Published from
Telangana and Andhra Pradesh

PRGI NO.TELTEL/2010/33275

ఎడిటర్- కలకొండ రామకృష్ణ

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily జాతీయ దినపత్రిక

Digital Editions : www.prajakalam.in., epaper.prajakalam.in , www.magzter.com, www.paperboy.com

శుక్రవారం | 13-11- 2026 | సంపుటి: 17, సంచిక : 223, పేజీలు : 12, వెల : 3/-



వందేళ్ల చరిత్ర నేలమట్టం..

ఆదేశాలిచ్చింది ఎవరు?

అర్ధరాత్రి కమాన్ కూల్చివేత స్పష్టత ఇవ్వాలి

బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తబ్రోజ్ ఖాన్

6

కలం కౌంటర్



తెలంగాణ పోలీస్ శాఖలో

భారీ ప్రక్షాళన!

21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం.. కీలక బాధ్యతల్లో మార్పులు

హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్... షీటీమ్స్ డీజీగా సౌమ్య మిశ్రా


వీసీ సజ్జనార్‌కు ఫైర్ డీజీ బాధ్యతలు - టీమార్స్ డైరెక్టర్‌గా స్టీఫెన్ రవీంద్ర

హైదరాబాద్, నవంబరు 12 (ప్రజాకలం) :

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ పరిపాలనను మరింత పటిష్టం చేయడంతో పాటు కీలక విభాగాల పనితీరును మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 21 మంది ఐపీఎస్ అధికారులకు వివిధ హోదాల్లో స్థానచలనం కల్పిస్తూ గురువారం సాధారణ పరిపాలన శాఖ (ప్రత్యేక విభాగం) జీఓ ఆర్టీ నంబర్ 1654, తేదీ 12-11-2026ను జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గవర్నర్ తరఫున ఈ ఉత్తర్వులను విడుదల చేశారు.

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేష్ భగవత్

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి మహేష్ మురళీధర్ భగవత్ నియమితులయ్యారు. ఇప్పటివరకు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేస్తున్న ఆయనను వీసీ సజ్జనార్ స్థానంలో నియమించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ వంటి కీలక



అంశాల్లో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు.

మహిళా భద్రతకు సౌమ్య మిశ్రా

డాక్టర్ సౌమ్య మిశ్రాను డీజీపీ, మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల అధిపతిగా బదిలీ చేశారు. గతంలో ఆమె జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. అదనంగా డీజీపీ ఆర్గనైజేషన్, డీజీపీ లీగల్ బాధ్యతలను పూర్తి అదనపు హోదాలో అప్పగించారు. మరోవైపు స్వాతి లక్రాను జైళ్ల శాఖ డీజీపీగా నియమించారు. ఆమెకు హోంగార్డ్స్ డీజీపీ బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు.

తరువాయి 2వ పేజీలో...

జూన్ 2 నాటికి టిమ్స్‌లు పూర్తి స్థాయి

సేవలందించాలి

ఏడాదిలో ఉస్మానియా సేవలు ప్రజలకు అందాలి

మూడు టిమ్స్‌లకు ఏకీకృత నియామకాలు

నిమ్స్... టిమ్స్‌ల మధ్య సమన్వయం ఉండాలి

వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం చేయండి

వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబరు 12 (ప్రజాకలం) :

వచ్చే జూన్ 2వ తేదీ నాటికి అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి ఉస్మానియా నూతన ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకు సేవలందించేలా చూడాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా నూతన ఆసుపత్రుల నిర్మాణ పనులు, ఆయా ఆసుపత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలు ఏకకాలంలో పూర్తి కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్స కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మూడేళ్లలోనే 9 మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారామెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు. సనత్ నగర్, అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌ల్లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ఏకీకృత విధానం పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా మూడు టిమ్స్ మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సీఎం సూచించారు. టిమ్స్ ల పర్యవేక్షణకు గ్రూప్-1 అధికారులను నియమిస్తామని



సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హౌస్ కీపింగ్ సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామన్నారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలకు వేరే సిబ్బంది ఉంటే, వైద్యులు పూర్తిగా వైద్య సేవలపైనే దృష్టి సారించే అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. నిమ్స్ లో శస్త్రచికిత్సలకు సమయం ఎక్కువ తీసుకుంటున్నందున సనత్ నగర్ టిమ్స్‌ను పూర్తి స్థాయిలో వినియోగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిమ్స్‌లో బెడ్స్ లేకపోయినా, శస్త్రచికిత్సలకు ఆలస్యమైనా

తరువాయి 2వ పేజీలో...

దేశాభివృద్ధిని అడ్డుకునే కుట్రలు



సమ్మిట్ పేరుతో దేశ వ్యతిరేక శక్తులు ఏకం

రాహుల్ విజన్ ఏమిటో ప్రపంచానికి చెబుతారా?

ఓటములను కప్పి పుచ్చుకునేందుకే సమ్మిట్ - కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్‌లో 'భారత్ సమ్మిట్' నిర్వహణపై తీవ్ర అభ్యంతరం

హైదరాబాద్, నవంబరు 12 (ప్రజాకలం):

'భారత్ సమ్మిట్ పేరుతో హైదరాబాద్‌లో ఏం సాధించాలనుకుంటున్నారు? ఈ సదస్సు నిర్వహణకు ప్రాతిపదిక ఏమిటి? కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి తెలంగాణ ప్రజల సొమ్ము ఎలా ఖర్చు చేస్తారు? పాక్ అనుకూల, భారత్ వ్యతిరేక శక్తులన్నీ హైదరాబాద్ వేదికగా ఏకమవుతున్నాయి. దేశాభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలకు తెలంగాణను వేదికగా మార్చడం దురదృష్టకరం' అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రధాని మోదీపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం, రాజ్యాంగబద్ధ సంస్థల ను బద్నాం చేయడం తప్ప ఈ సమ్మిట్ ద్వారా దేశానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు? అని కాంగ్రెస్ పార్టీని, తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పార్టీ కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా చిత్రీకరిస్తూ ప్రజాధనాన్ని వినియోగించ డంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాహుల్‌గాంధీకి అస లు ఏం విజన్ ఉంది? ఆయన రాజకీయ వైఫల్యాలను, కాంగ్రెస్ వరుస ఓటములను కప్పిపుచ్చుకునేందుకే హైదరాబాద్‌లో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు' అని విమర్శిం చారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో వంద ఓటములు కాంగ్రెస్ పార్టీ ఖాతాలో చేరాయని, వాటిని తక్కువ చేసి చూపించే ప్రయత్నంలో భాగమే సమ్మిట్ అని పేర్కొన్నారు. భారత్ సమ్మిట్ వేదికగా రాహుల్‌గాంధీ విజన్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతుండటంపై తీవ్ర విమర్శలు

తరువాయి 2వ పేజీలో...

ఇక తెలంగాణలో భారత్ విస్తార్ సేవలు

తెలుగులోనే రైతులకు అందుబాటులోకి ఏఐ ఆధారిత వ్యవసాయ సలహాలు

- వ్యవసాయ శాఖ - ఎన్ఐఎస్‌జీ మధ్య అవగాహన ఒప్పందం

- భారత్ విస్తార్ ద్వారా ఆరు కీలక వ్యవసాయ సేవలు ఒకే వేదికపైకి

- రైతుల పెట్టుబడి వ్యయం తగ్గించి, దిగుబడులు.. ఆదాయం పెంచడమే లక్ష్యం: మంత్రి తుమ్మల



హైదరాబాద్, నవంబరు 12 (ప్రజాకలం): వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ, తెలంగాణ రైతులకు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) ఆధారిత సేవలను వారి మాతృభాష తెలుగులోనే అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఏఐ ఆధారిత జాతీయ వ్యవసాయ డిజిటల్ వేదిక 'భారత్ విస్తార్'తో తెలంగాణను అనుసంధానించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నమెంట్ (ఎన్ఐఎస్‌జీ) మధ్య గురువారం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రితుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఒప్పందం జరిగింది.

సాంకేతికతతో వ్యవసాయంలో సమూల మార్పులు తీసుకురావాలి:

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయడం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించి,

తరువాయి 2వ పేజీలో...

ఎఫ్ఎంజీలపై వివక్ష తగదు

వాళ్లకూ నెలకు రూ. 29,792 స్టైఫండ్ చెల్లించాలి

సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరిస్తారా? - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్, నవంబరు 12 (ప్రజాకలం):

విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసి ఇక్కడ హౌస్ సర్జన్ల స్టుపైండ్ చెల్లింపుల్లో వివక్ష తగదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. ఇక్కడి విద్యార్థులకు ఇస్తున్నట్లుగా వారికి స్టైఫండ్ చెల్లించాలని కోరారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎదుట 34 రోజులుగా నిరసన తెలుపుతున్న విదేశీ వైద్య పట్టభద్రులపై పోలీసులు లాఠీచార్జ్ చర్యలను ఆయన ఖండించారు. గురువారం తనను కలిసిన ఎఫ్ఎంజీ వైద్య విద్యార్థుల బాధలను ఆలకించారు. అనంతరం రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అనేక ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఉన్నా కొందరు విదేశాలకు వెళ్లి చదువుకుని తిరిగి స్వదేశానికి వస్తున్నారని తెలిపారు. భారత నేషనల్ మెడికల్ కమిషన్ పరీక్షలో ఉత్తీర్ణులై ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రుల్లో హౌస్ సర్జన్లుగా సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. అయితే, స్థానిక హౌస్ సర్జన్ల మాదిరి రూ. 29,792 వరకు స్టైఫండ్ ఎఫ్ఎంజీలకు అందడం లేదని పేర్కొన్నారు. సమాన విద్యార్హత ఉండి, అంతే స్థాయిలో శ్రమిస్తున్న ఎఫ్ఎంజీలకు రూ. 5 వేలు మాత్రమే చెల్లించడం వివక్షేనని ఆగ్ర హం వ్యక్తం చేశారు. 'సమాన పనికి సమాన వేతనం'



ఇవ్వాలని, ఇతర హౌస్ సర్జన్లతో సమానంగా స్టైఫం డ్, అలవెన్సులు అందించాలనే సుప్రీంకోర్టు తీర్పు ను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం కోర్టు ధిక్కారమేనని మండిపడ్డారు. పొరుగు రాష్ట్రాలు, దేశంలోని ఇతర రాష్ట్రాలు ఈ నిబంధనను అమలు చేస్తున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం మొండివైఖరి ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎఫ్ఎంజీ ఇంటర్నల్స్‌లందరికీ ఇతర హౌస్ సర్జన్లతో సమానంగా రూ. 29,792 స్టైఫండ్‌తోపాటు పెం డింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. సమాజానికి ప్రాణం పోసే వైద్య విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కనీస వేత నం కూడా చెల్లించలేదా అని ప్రశ్నించారు. ఎఫ్ఎంజీ విద్యార్థుల న్యాయమైన పోరాటానికి బీజేపీ సంపూర్ణ సంఘీభావం తెలుపుతున్నదని ప్రకటించారు.



ఆత్మగౌరవానికి ప్రతీకగా

ఇందిరమ్మ టవర్ల నిర్మాణం

వచ్చే దీపావళి నాటికి పూర్తి చేస్తాం

క్యూర్ పరిధిలో 23 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టులు

గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 12 (ప్రజాకలం):

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఎకరాకు 270 కోట్ల రూపాయల విలువైన భూముల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నగరంలో అత్యంత విలువైన భూముల్లోనూ ఇందిరమ్మ టవర్లను నిర్మిస్తున్నామని తెలిపా రు. హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 23 నియోజకవర్గాల్లో చేపట్టిన ఈ నిర్మాణాలను వచ్చే దీపావళి నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని వెల్లడించారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి, నియోజకవర్గంలోని వైలార్‌దేవ్‌పల్లిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణ పనులకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో

తరువాయి 2వ పేజీలో...

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకంతో

మరోసారి సత్ఫలితాలు

సివిల్స్ తుది ఇంటర్వ్యూకు 31 మంది ఎంపిక

ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు మరోసారి - ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకం

అభ్యర్థులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు

హైదరాబాద్, నవంబరు 12 (ప్రజాకలం):

తెలంగాణ ప్రాంతం నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ లో విజయం సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ సహకారంతో ప్రారంభించిన 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం మరోసారి మంచి ఫలితాలను సాధించింది. ఇటీవల విడుదలైన సివిల్స్ మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులై 31 మంది అభ్యర్థులు తుది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు.

మెయిన్స్ కు ఎంపికైన 158 మందికి రూ. లక్ష చొప్పున ప్రోత్సాహకం

సింగరేణి సంస్థ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రోత్సాహకం అందించేందుకు రెండు నెలల క్రితం దరఖాస్తులను ఆహ్వానించింది. వచ్చిన దరఖాస్తుల్లో 158 మంది అర్హులైన అభ్యర్థులను గుర్తించి, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ. 1.58 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిం



చింది. ఈసారి ప్రోత్సాహక మొత్తాలను నేరుగా అభ్యర్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేశారు. ఈ ఆర్థిక సహకారంతో అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు మరింత ఉత్సాహంతో సిద్ధమయ్యారు. వారిలో 31 మంది తుది ఇంటర్వ్యూకు ఎంపిక కావడం విశేషం.

తరువాయి 2వ పేజీలో...

జూన్ 2 నాటికి టిమ్స్‌లు పూర్తి స్థాయి

సేవలందించాలి

మొదటి పేజీ తరువాయి...

సనత్ నగర్ టిమ్స్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. టిమ్స్ లో వైద్యుల నియామకం పూర్తయ్యే వరకు బయటి నుంచి వైద్యులను నియమించుకోవాలని, అందుకు అవసరమయ్యే మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. తాము అధికారంలోకి వచ్చాక కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్నమరో 79 డయాలసిస్ సెంటర్ల పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. టిమ్స్ తో పాటు బోధన కళాశాలలు, నర్సింగ్ కళాశాలల పనులు, పరికరాల కొనుగోలు ప్రక్రియ ఏకకాలంలో పూర్తవ్వాలని, అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుప్రతుల్లో వైద్యులు, సిబ్బంది హాజరైన సమయం, విధుల నుంచి వెళ్లే సమయాన్ని నమోదు చేయాలని, హాజరు విషయంలో బయోమెట్రిక్ విధానం అమలయ్యేలా చూడాలని, ఏఐతో పర్యవేక్షణ చేయాలని సీఎం శాఖాధికారులను ఆదేశించారు. మూడేళ్లలోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ల సంఖ్య 7 కోట్ల నుంచి సుమారు 9 కోట్లకు పెరగడం, ఇన్ పేషెంట్ల సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరగడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. మూడేళ్లలోనే వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారా మెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేశామని సీఎం తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసే క్రమంలో వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్తూ, టీజీఎంఎస్ఐడీసీ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ముష్రఫ్ అలీ ఫరూఖీ, ఆర్ అండ్ బీ కార్యదర్శి ఇలంబరితి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్ల నిర్మాణం

మొదటి పేజీ తరువాయి...

కలిసి మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. అనంతరం రాజేంద్రనగర్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రా, కేటాయింపుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 30 వేల మంది ప్రజలు, లబ్ధిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఎకరాకు రూ.250 కోట్ల నుంచి రూ.270 కోట్ల వరకు విలువ చేసే భూముల్లో పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని చెప్పారు. పేదలను నగరానికి దూరంగా తరలించకుండా, వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే అన్ని మౌలిక సదుపాయాలతో గృహాలు నిర్మించాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమన్నా రు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో కుల, మత, రాజకీయ వివక్షకు తావులేకుండా అర్హులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. రాజేంద్రనగర్‌లో చిన్నారి చేతుల మీదుగా లక్కీ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం పారదర్శకతకు నిదర్శనమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 2,21,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల నెరవేర్చామని వెల్లడించారు. ఈ నెల 19నుంచి ఆడబిడ్డలకుచిలకపచ్చ రంగు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రాధాన్యం: మంత్రి శ్రీధర్‌బాబు

పేదల సంక్షేమం, ఆత్మగౌరవానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా నగరానికి దూరంగా కాకుండా విలువైన భూముల్లోనే పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇళ్లు కేటాయిస్తామని, మొదటి విడతలో రానివారు ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, టి ప్రకాశ్‌గౌడ్, హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్, కలెక్టర్ సి నారాయణరెడ్డి, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఆర్డీవో శ్రీధర్, హౌసింగ్ పీడీ చంప్లా నాయక్, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ పారిజాతం పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకంతో

మరోసారి సత్ఫలితాలు

మొదటి పేజీ తరువాయి...

ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి మరో రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకం

తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మంది అభ్యర్థులకు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ త్వరలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించనుంది.

అభ్యర్థులకు ఉప ముఖ్యమంత్రి అభినందనలు

సివిల్స్ మెయిన్స్ లో ఉత్తీర్ణులై తుది ఇంటర్వ్యూకు ఎంపికైన తెలంగాణ బిడ్డలందరికీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. ఇంటర్వ్యూ దశకు చేరుకున్న అభ్యర్థులందరూ తుది పరీక్షలోనూ విజయం సాధించి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఇప్పటికే 27 మందికి సివిల్స్‌లో విజయం

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి సింగరేణి సంస్థ గత రెండేళ్లుగా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల నుంచి ఆర్థిక సహకారం అందిస్తోంది. ఈ పథకం ద్వారా మొదటి ఏడాది ఏడుగురు, రెండో ఏడాది20 మంది చొప్పున మొత్తం 27 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించడం విశేషం. ఈ ఏడాది కూడా అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు తుది ఇంటర్వ్యూలో విజయం సాధించి సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలని,ఈ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించబోతున్నారని,ఈ మాక్ ఇంటర్వ్యూల నిర్వహణకు కూడా సింగరేణి సంస్థ తన సహకారాన్ని అందిస్తుందని సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తెలిపారు.

వరంగల్ నుంచి అత్యధికంగా ఆరుగురు

ఈ ఏడాది తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మందిలో అత్యధికంగా వరంగల్ జిల్లా నుంచి ఆరుగురు ఉన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి నలుగురు, హైదరాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి ముగ్గురేసి, నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల నుంచి ఇద్దరేసి చొప్పున ఎంపికయ్యారు. అదిలాబాద్, నారాయణపేట, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మంచిర్యాల జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున తుది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. వీరిలో 18 మంది ఓబీసీ వర్గాలకు చెందిన వారున్నారు. ఎస్టీ అభ్యర్థులు ఇద్దరు, ఎస్సీ అభ్యర్థులు ముగ్గురు, 8 మంది జనరల్ అభ్యర్థులు ఉన్నారు.

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన!

మొదటి పేజీ తరువాయి...

ఏసీబీ పగ్గాలు చారు సిన్హాకు...

చారు సిన్హాను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. ఇప్పటివరకు సీఐడీ, మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా, ఏసీబీ విభాగాల్లో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమెకు ఏసీబీ పూర్తి బాధ్యతలు అప్పగించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సీఐడీ డీజీపీ బాధ్యతలను కూడా అదనంగా నిర్వహించనున్నారు.

ఆర్టీసీ ఎండీగా అనిల్ కుమార్

గ్రేహౌండ్స్, ఆక్టోపస్, పోలీస్ ఆపరేషన్స్ విభాగాల డీజీపీగా పనిచేస్తున్న డాక్టర్ అనిల్ కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. నాగిరెడ్డి స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. మరోవైపు వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డీజీగా నియమిం చారు. అదనంగా రాష్ట్ర ప్రత్యేక పోలీసు దళం (ఎస్పీఎఫ్) డీజీ బాధ్యతలను కూడా అప్పగించారు.

సివిల్ సప్లైస్ బాధ్యతల్లో నాగిరెడ్డి

వై. నాగిరెడ్డిని సివిల్ సప్లైస్ కమిషనర్‌గా, వినియోగదారుల వ్యవహారాల శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు. అదనంగా సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలతో పాటు లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ బాధ్యతలను అప్పగించారు. గతంలో ఈ బాధ్యతలు నిర్వహించిన ఎం. స్టీఫెన్ రవీంద్రను తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో (టీజీ–టీఎంఏఆర్ఎస్) డైరెక్టర్‌గా నియమించారు.

గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌కు విక్రమ్ సింగ్ మాన్

విక్రమ్ సింగ్ మాన్‌ను డీజీపీ (ఆపరేషన్స్), గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల అధిపతిగా నియమించారు. ఆయనకు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీజీ బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు. ఇక టీజీఎస్పీ అదనపు డీజీపీగా ఉన్న సంజయ్ కుమార్ జైన్‌కు డీజీపీ (ట్రైనింగ్) బాధ్యతలను పూర్తి అదనపు హోదాలో అప్పగించారు. అకున్ సబర్వాల్‌ను అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా నియమించారు. ఆయనకు కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ (టి–స్పార్క్) బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు.

ఇంటెలిజెన్స్, ఏసీబీ, మల్టీజోన్‌లో మార్పులు

ఎస్. చంద్రశేఖర్ రెడ్డిని ఏసీబీ డైరెక్టర్‌గా నియమించి, అవినాష్ మొహంతీని అదనపు బాధ్యతల నుంచి తప్పించారు. కార్తికేయను మల్టీజోన్–1 ఐజీగా బదిలీ చేశారు. ఆయనకు ఐసీసీసీ డైరెక్టర్ బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు. కే. రమేష్ నాయుడును రైల్వే ఐజీగా నియమించి, టీజీ–టీఎంఏఆర్ఎస్ డైరెక్టర్‌కు నివేదించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ట్రాఫిక్, జోనల్ పోలీసింగ్‌లోనూ కొత్త బాధ్యతలు

డీ. జోయల్ డేవిస్‌ను టీజీ–టీఎంఏఆర్ఎస్‌లో రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ జాయింట్ డైరెక్టర్‌గా నియమించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ బాధ్యతలను అదనంగా కొనసాగించనున్నారు.జి.చందన దీప్తికి జోగులాంబ జోన్–7 డీఐజీ బాధ్యతలు అదనంగా అప్పగించారు.ఆర్. భాస్కరన్‌కు డీఐజీ (ఇంటెలిజెన్స్) బాధ్యతలు, కే. నారాయణ నాయక్‌కు జోన్–2, బాసర డీఐజీ బాధ్యతలు అదనంగా అప్పగించారు. ఎల్.ఎస్. చౌహాన్‌ను డీఐజీ కోఆర్డినేషన్‌గా నియమించి, చార్మినార్ జోన్–6 డీఐజీ బాధ్యతలు కూడా అప్పగించారు.

కొత్త పోస్టింగులతో పాటు పెండింగ్ నియామకాలకు ముగింపు

పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఎస్.పి.ఎస్. అధికారి శ్రీ బాలాదేవిని టీజీ–టీఎం ఏఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్)గా, వి. అరవింద బాబును హైదరాబాద్ నగరంలో డీసీపీ (ఎస్ఎం అండ్ ఐటీ)గా నియమించారు. ఈ బదిలీలు, నియామకాల ద్వారా పోలీస్ శాఖతో పాటు రవాణా, పౌరసరఫరాలు, ట్రాఫిక్, రోడ్డు భద్రత, అగ్నిమాపక శాఖల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పలువురు అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొనసాగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొత్తంగా రాష్ట్ర పోలీస్ యంత్రాంగంలో కీలక స్థానాల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన ఈ ఉత్తర్వులు పరిపాలనా వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఇక తెలంగాణలో భారత్ విస్తార్ సేవలు

మొదటి పేజీ తరువాయి...

వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చవచ్చని పేర్కొన్నారు. పంట సాగులో రైతులు ఎదుర్కొనే సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, శాస్త్రీయమైన సూచనలు అందిస్తే చీడపీడలు, తెగుళ్లు పంట మొత్తం విస్తరించకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, పంట రకం, సాగు సమయం, మార్కెట్ ధరలను విశ్లేషించి రైతులకు అవసరమైన సమయంలో కచ్చితమైన సలహాలు అందించడంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. రైతులు ఎరువులు, పురుగుమందులు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్‌లను అవసరానికి మించి వినియోగించకుండా, సరైన మోతాదులో ఉపయోగించేలా సాంకేతిక సలహాలు అందితే పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు దిగుబడులు, ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. తెలంగాణలోని ప్రాంతీయ వాతావరణ పరిస్థితులు, నేలల స్వభావం, పంటల వైవిధ్యం, స్థానిక సాగు పద్ధతులు, మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారత్ విస్తార్ వేదికను రాష్ట్ర రైతులకు మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలకు అదనంగా తెలంగాణకు సంబంధించిన వ్యవసాయ పథకాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, పంటల సాగు విధానాలు, శాస్త్రీయ సలహాలు కూడా ఈ వేదికలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

భారత్ విస్తార్ అంటే ఏమిటి?

భారత్ విస్తార్‌అనేది కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ రూపొందించిన కృత్రిమ మేధ ఆధారిత జాతీయ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్. దేశవ్యాప్తంగా వ్యవసాయానికి సంబంధించిన వివిధ ప్రభుత్వ వ్యవస్థలు, శాస్త్రీయ పరిశోధనా సంస్థలు, వాతావరణ విభాగాలు, మార్కెట్ సమాచార వ్యవస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రైతులకు సమగ్ర సమాచారాన్ని అందించడమే దీని ప్రధాన ఉద్దేశం.సాధారణంగా రైతులు పంటల సాగు, వాతావరణం, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాల సమాచారం కోసం వివిధ కార్యాలయాలు, వెబ్‌సైట్లు, యాప్‌లపై ఆధారపడాల్సి వస్తుంది. ఈ సమస్యకు పరిష్కారంగా భారత్ విస్తార్ ఒకే డిజిటల్ వేదిక ద్వారా అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది. ఈ వేదికలో పొందుపరిచిన 'భారతి' అనే కృత్రిమ మేధ ఆధారిత వాయిస్ అసిస్టెంట్ రైతులతో సంభాషిస్తూ వారి ప్రశ్నలకు సమాధానాలు అందిస్తుంది. రైతులు తమకు ఎదురైన సమస్యలను వారి మాతృభాషలో మాట్లాడి లేదా టైప్ చేసి అడగవచ్చు. రైతు అడిగిన ప్రశ్నను విశ్లేషించి, అందుబాటులో ఉన్న శాస్త్రీయ సమాచారం, ప్రభుత్వ డేటా ఆధారంగా అవసరమైన సూచనలు అందించడం దీని ప్రత్యేకత.

భారత్ విస్తార్ ద్వారా రైతులకు ఆరు కీలక సేవలు... 1. పంటల సాగుపై శాస్త్రీయ సలహాలు: ఏ ప్రాంతంలో ఏ పంట సాగు చేయాలి? ఎప్పుడు విత్తుకోవాలి? ఏ రకమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి? ఎరువులు, నీటి యాజమాన్యాన్ని ఎలా నిర్వహించాలి? వంటి అంశాలపై భారత వ్యవసాయ పరిశోధనా మండలి అందించే శాస్త్రీయ పరిజ్ఞానం ఆధారంగా రైతులకు సూచనలు లభిస్తాయి.

2. వాతావరణ సమాచారం, ముందస్తు హెచ్చరికలు: భారత వాతావరణ శాఖ సమాచారాన్ని అనుసంధానం చేసి వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులపై ముందస్తు సమాచారం అందుతుంది. దీనివల్ల రైతులు విత్తనాలు వేయడం, సాగునీరు అందించడం, పంట కోత వంటి పనులను వాతావరణానికి అనుగుణంగా ప్రణాళిక చేసుకోవచ్చు.

3. చీడపీడలు, తెగుళ్ల గుర్తింపు: పంటలకు వచ్చే చీడపీడలు, తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలపై సలహాలు పొందవచ్చు. పంటకు సంబంధించిన ఫొటోలను పంపించడం ద్వారా అందుబాటులో ఉన్న ఏఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానంతో సమస్యను విశ్లేషించి తగిన సూచనలు పొందే అవకాశం ఉంటుంది. నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ సమాచారాన్ని కూడా ఈ వ్యవస్థ వినియోగిస్తుంది.

4. నేల ఆరోగ్యం, ఎరువుల వినియోగంపై సూచనలు: సాయిల్ హెల్త్ కార్డులు, నేల పరీక్షల సమాచారాన్ని ఆధారంగా చేసుకుని నేలలోని పోషకాల స్థితి, పంటకు అవసరమైన ఎరువుల వినియోగం, పోషకాల యాజమాన్యంపై సూచనలు అందుతాయి. దీనివల్ల అనవసర ఎరువుల వినియోగాన్ని తగ్గించి సాగు ఖర్చును నియంత్రించవచ్చు.

5. మార్కెట్ ధరలు, విక్రయ సమాచారం: అగ్రిమార్కెట్ నెట్ ద్వారా వివిధ వ్యవసాయ మార్కెట్లలో పంటల ధరలు, మార్కెట్ పరిస్థితుల సమాచారం అందుతుంది. రైతులు తమ ఉత్పత్తులను ఎక్కడ, ఎప్పుడు విక్రయించాలనే విషయంలో మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు ఇది దోహదపడుతుంది.

6. ప్రభుత్వ పథకాలు, లబ్ధి వివరాలు: పీఎం–కిసాన్, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, సాయిల్ హెల్త్ కార్డు, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల వివరాలు, అర్హతలు, దరఖాస్తుల స్థితి, లబ్ధి వివరాలను ఒకే వేదికపై తెలుసుకోవచ్చు. ఫిర్యాదుల నమోదు, వాటి పరిష్కార స్థితిని కూడా తెలుసుకునే సదుపాయాలు దశలవారీగా అందుబాటులోకి వస్తాయి.

నాలుగు మాధ్యమాల్లో తెలుగు సేవలు

తెలంగాణ రైతులు సులభంగా ఈ సేవలను వినియోగించుకునేలా ఎన్ఐఎస్‌జీ సహకారంతో నాలుగు ప్రధాన మాధ్యమాల్లో భారత్ విస్తార్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.

హెల్ప్‌లైన్ – 155261: ఫోన్ ద్వారా వాయిస్ బాట్ సహాయంతో రైతులు వ్యవసాయ సందేహాలను అడిగి తెలుసుకునే అవకాశం ఉంటుంది. తెలుగు వాయిస్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంపై చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.

వెబ్ పోర్టల్, మొబైల్ యాప్: రైతులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా చాట్‌బాట్‌ను వినియోగించుకుని వ్యవసాయసమాచారం,సలహాలు పొందేలా ప్రత్యేకరాష్ట్రస్థాయి పోర్టల్,తెలుగుయాప్‌ను ఎంఓయూ కుదిరిన 15 నుంచి 21 రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

వాట్సాప్ చాట్‌బాట్: వాట్సాప్ ద్వారా రైతులు తమ సందేహాలను పంపించి సమాధానాలు పొందే సదుపాయాన్ని 45 నుంచి 60 రోజుల్లో ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించారు.

ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్: తెలుగు వాయిస్ బాట్‌తో కూడిన ప్రత్యేక సేవా నంబర్‌ను కేంద్ర ప్రభుత్వ అనుమతుల అనంతరం ప్రారంభించనున్నారు. దీంతో స్మార్ట్ ఫోన్ ఉన్న రైతులే కాకుండా సాధారణ ఫోన్ వినియోగించే రైతులు కూడా వాయిస్ కాల్ ద్వారా వ్యవసాయ సలహాలు పొందే అవకాశంఉంటుంది.రైతులు ఏ మాధ్యమం ద్వారా సంప్రదించినా ఒకే సమగ్ర వ్యవస్థ నుంచి విశ్వసనీయమైన సమాచారాన్ని పొందేలా ఈ సేవలను అనుసంధానం చేయనున్నారు.

కేంద్ర, రాష్ట్ర నిధులతో భారత్ విస్తార్ అమలు

భారత్ విస్తార్ జాతీయ వేదికలో భాగస్వామ్యం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమ్మతి తెలియజేసింది. 2026–27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల భాగస్వామ్యంతో భారత్ విస్తార్ అనుసంధాన ప్రక్రియను చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

నాలుగు దశల్లో అమలు

భారత్ విస్తార్ సేవలను తెలంగాణలో సమర్థవంతంగా అమలు చేసేందుకు నాలుగు దశల్లో కార్యాచరణ రూపొందించారు. మొదటి దశలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న జాతీయ చాట్‌బాట్, వాయిస్ బాట్ సేవలను తెలుగులో అందుబాటులోకి తీసుకురానున్నారు. రెండో దశలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, ఉత్తర్వులు, పంటల సాగుకు సంబంధించిన సలహాలు, స్థానిక వ్యవసాయ సమాచారాన్ని అనుసంధానం చేస్తారు.

మూడో దశలో రైతుల దరఖాస్తులు, పథకాల లబ్ధి, చెల్లింపులు, ఫిర్యాదుల స్థితి వంటి వివరాలను రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థలతో అనుసంధానం చేస్తారు. నాలుగో దశలో రైతుల సమ్మతి, సమాచార భద్రతకు సంబంధించిన నిబంధనలను పాటిస్తూ వ్యవసాయ శాఖ అనుమతించిన సమాచారాన్ని మరింత విస్తృతంగా అనుసంధానం చేస్తారు.

ఇప్పటికే అందుబాటులో ఉన్న జాతీయ డిజిటల్ వేదికను వినియోగించుకోవడం వల్ల కొత్త వ్యవస్థను మొదటి నుంచి అభివృద్ధి చేయాల్సిన అవసరం లేకుండా తక్కువ సమయంలో రైతులకు సేవలను అందించవచ్చని అధికారులు తెలిపారు.

దేశాభివృద్ధిని అడ్డుకునే కుట్రలు

మొదటి పేజీ తరువాయి...

వ్యక్తమవుతున్నాయని, అసలు రాహుల్‌కు ఏం విజన్ ఉందని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు అనే తేడా లేకుండా.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు అభివృద్ధి, పెట్టుబడుల కోసం ఆరోగ్యకరమైన పోటీ పడుతున్నాయని, అభివృద్ధిని అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ 'భారత్ సమ్మిట్' పేరుతో కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ఒకవైపు హైదరాబాద్‌లో ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని చెబుతూనే.. మరోవైపు దేశంలోకి విదేశీ పెట్టుబడులు రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని వారు మండిపడ్డారు.

దేశ వ్యతిరేక శక్తుల అజెండా అమలుకే సదస్సు..

'దేశంలో ఉగ్రవాదం తగ్గుముఖం పట్టింది.. అవినీతికి అడ్డుకట్ట పడింది.. కుల, మత రాజకీయాల ప్రభావం తగ్గింది.. కుటుంబ రాజకీయాల కు ప్రాధాన్యం లేకుండా పోతోంది. దేశంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పులను, అభివృద్ధిని రాహుల్‌గాంధీ ఏనాడైనా స్వాగతించారా? కనీసం ప్రశంసించారా?' అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. దేశంలో జరుగుతున్న ప్రగతిని గుర్తించకుండా, భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. భారత వ్యతి రేక శక్తులు నిర్దేశిస్తున్న అజెండాను అమలు చేసేందుకే హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ నిర్వహిస్తు న్నారని ఆరోపించారు. సొంత ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ ప్రతులను చించేసి, నాటి ప్రధాని మన్మోహన్‌ను అవమానించిన చరిత్ర రాహుల్‌గాంధీది అని మండిపడ్డారు. దేశంలో బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక వంటి పరిస్థితులు వస్తాయని ప్రచారం చేయడమంటే దేశ భద్రతకు విఘాతం కలిగించడమేనని మండిపడ్డారు. దంతేవాడలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను నక్సలైట్లు హత్యచేస్తే ఖండించకుండా, నక్సలిజం సామాజిక సమస్య అంటూ సమర్థించడం దేశ భద్రతపై రాహుల్‌కున్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తుందన్నారు. బలూచిస్తాన్‌లో భారత్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుందని వ్యాఖ్యలు చేయడం భారతీయుడిగా రాహుల్ విధానమా? అని ప్రశ్నించారు.

ఏ రోజు కూడా దేశ గౌరవం పెంచే విధంగా రాహుల్‌గాంధీ వ్యవహరించలేదని విమర్శించారు. జార్జ్ సోరోస్ లాంటి వ్యక్తులు రాహుల్‌గాంధీని వెపన్‌లా వాడుకుంటూ దేశ గౌరవాన్ని మంటగలిపే ప్రయత్నం చేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

హామీలను సమ్మిట్‌లో ప్రస్తావించాలి

2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ హైదరాబాద్ వచ్చి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను సమ్మిట్‌లో ప్రస్తావించాలని మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. తల్లి, చెల్లి, మీ సీఎంతో కలి సి ఇచ్చిన గ్యారంటీలు, హామీలు, అందులో ఏవేవి అమలవుతున్నాయో చెప్పాలన్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి నానాటికీ దిగజారుతోందని, హైకోర్టు జోక్యం చేసుకుని పెండింగ్ బిల్లును చెల్లించాలని ఆదేశించడం అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులను కాంగ్రెస్ సర్కార్ మరింతగా పెంచి పోషిస్తోందని, తద్వారా తెలంగాణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైనదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి అసమర్థత, రాహుల్‌గాంధీ విజన్ లేని డైరెక్షన్ కారణంగా రాష్ట్రం ఆర్థిక సంక్షోభం వైపు వెళ్తుందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు విరమణ బెనిఫిట్స్ అందడం లేదని, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, కౌలు రైతులకు రైతుభరోసా, బీసీ డిక్లరేషన్ తదితర హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందించలేదని, ఒక్కో ఆడబిడ్డకు ప్రభుత్వం రూ.85వేల బకాయి పడిందన్నారు. వితంతువులు, దివ్యాంగులు, నిరుద్యోగ యువత, ప్రభుత్వ ఉద్యోగులను.. ఇలా ప్రతి వర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, విద్యారంగ సమస్యలు కూడా ఎక్కడి గొంగళి అక్క డే అన్నట్టుగా ఉన్నాయని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షలు, గ్రామ పంచాయతీలకు రూ.25 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. వెయ్యి రోజులు గడిచినా ఆప్రస్తావనే తేవడం లేదని మండిపడ్డారు. ఇవన్నీ భారత్ సమ్మిట్‌లో అంతర్జాతీయ ప్రతినిధులకు తెలియజేయాలని పేర్కొన్నారు.

ఖేతీ బచావో అభియాన్‌పై రైతులకు అవగాహన...



ఇబ్రహీంపట్నం నవంబర్ 12(ప్రజా కలం ప్రతినిధి)

ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్కపేట గ్రామంలో ఖేతీ బచావో అభియాన్‌లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కోరుట్ల ఏడీఏ రమేష్, ఆత్మ డీపీడీ సుధాకర్. రైతులకు ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం, భూగర్భ జలాల పరిమిత లభ్యత, నీటి వనరుల సంరక్షణ మరియు పంటల వైవిధ్యీకరణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటిని వినియోగించే ఆరుతడి పంటలను సాగు చేయాలని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుతూ సహజ వనరులను సంరక్షించే విధంగా స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఏడీఏ రమేష్, ఆత్మ డీపీడీ సుధాకర్, మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఏఈఓ వినోద్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఏలాల వెంకట్ రెడ్డి.రైతులు పాల్గొన్నారు.

వెల్లుల్ల గ్రామంలో అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తుల పంపిణీ



మెట్ పల్లి రూరల్ నవంబర్ 12:(ప్రజా కలం);మెట్ పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. చిన్నారుల సంక్షేమం, వారి ఆరోగ్యం, విద్యతో పాటు వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామపంచాయతీ తరఫున కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.చిన్నారులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి సహకరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చిన్నారులకు దుస్తులు అందజేయడంతో వారిలో ఆనందం వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి, పంచాయతీ కార్యదర్శి రావళిక, ఉపసర్పంచ్ శేఖర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సలీం పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, లావణ్య, లత, నీరజ, ఉమ, రాధిక తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుకోవెల శ్యామ్‌సుందర్



జగిత్యాల ప్రతినిధి నవంబర్12 (ప్రజా కలం) పీఆర్సీ కాలపరిమితి ముగిసినందున వెంటనే కొత్త పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు తిరుకోవెల శ్యామ్‌సుందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని ఆయా పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని ఉద్యోగులకు న్యాయం జరిగేలా అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను తక్షణమే క్లియర్ చేయడంతోపాటు బదిలీలు, పదోన్నతులు చేపట్టి పాఠశాల విద్యను మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఆదర్శ పాఠశాలల్లో 317 జీవోను అమలు చేయడంతోపాటు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.కస్తూర్బా పాఠశాలల ఉపాధ్యాయులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు కనీస కాలపరిమితి వేతన స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఒజ్జ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి తిరునగరి ప్రభాకర్, తేలు చిరంజీవి పాల్గొన్నారు.

దామన్న సేవలు చిరస్మరణీయం

దివంగత ఎమ్మెల్యే కు ఘన నివాళి

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్ 12 (ప్రజాకాలం):-నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తుమ్మల వెంకటరమణారెడ్డి దామన్న 18వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఆయన విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దామన్న నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల మన్ననలు పొందారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఆయన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. దామన్న ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సేవలో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొడ్ల రమేశ్, అరిగెల రాకేశ్, కొల్లెపు శ్రీనివాస్, శ్రీకర్ గౌడ్, సుంకేటి విజయ్, గంప శ్రీనివాస్, సుతారి భూమారెడ్డి, భీమనాతి విజయ్, అరిగెల అజయ్, నాగుల రంజిత్, మారంపెల్లి రంజిత్, పడిగేల శ్రీనివాస్, ముక్క మధు తదితరులు పాల్గొన్నారు.



యువత భవిష్యత్తును కాపాడేందుకు

గంజాయి నిర్మూలనపై కఠిన చర్యలు

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖుతుబోదీన్ పాషా



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 12(ప్రజా కలం):

యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, ఇతర మత్తుపదార్థాల అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖుతుబోదీన్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మత్తుపదార్థాల విక్రయాలు, సరఫరాపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లోనూ గంజాయి ముఠాలు యువతను లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు తక్షణమే స్పందించి గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మత్తుపదార్థాల సరఫరా మూలాలను గుర్తించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ, చెడు వ్యసనాల బారిన పడకుండా వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని పాషా సూచించారు.గంజాయి రహిత జిల్లాగా జగిత్యాలను తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాల అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే ప్రజలు ధైర్యంగా పోలీసులకు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోంది. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులతో పాటు ప్రజలు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, గంజాయి విక్రయాలు లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే గంజాయి రహిత సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుందన్నారు.

రీ సర్వే పనులను

పకడ్బందీగా నిర్వహించాలి

క్షేత్రస్థాయిలో రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలి



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 12 (ప్రజా కలం):

జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం జగదేవ్‌పేట గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే పనుల పురోగతిని, సర్వే చేపడుతున్న విధానాన్ని, భూ రికార్డులకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను ఎలాంటి తప్పులు, పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియలో రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర రెవెన్యూ రికార్డుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు.సర్వే నిర్వహణ సమయంలో రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు, సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిశీలించి పరిష్కరించేలా రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్దేశించిన మార్గదర్శకాలు, లక్ష్యాలకు అనుగుణంగా రీ సర్వే పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

అనంతరం అదే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులను, పనుల పురోగతిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అర్హులైన పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఎలాంటి జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటి నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందాల్సిన సహాయ సహకారాలు సకాలంలో అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, అర్హులైన లబ్ధిదారులు త్వరగా తమ సొంత ఇళ్లలో నివసించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, హౌసింగ్ అధికారి భాస్కర్, ల్యాండ్ సర్వే ఏడీ, ఎంపీఓ, మండల తహసీల్దార్, సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీ సర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - సర్వే సమయంలో రైతులు భూముల హద్దులను సరిచూసుకోవాలి

- చామనపల్లి ముంపు గ్రామ తరలింపు ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలి



ధర్మారం, నవంబర్ 12 : (ప్రజా కలం ప్రతినిధి) అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందేలా చర్యలు తీసుకోవాలి భూముల రీ సర్వే, చామనపల్లి సోషల్ ఎకనామిక్ సర్వే, పాఠశా లను ఆకస్మికంగా తనిఖీ ధర్మారం, మండలా లలో విస్తృతంగా పర్య టించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే కార్య క్రమానికి రైతులు అందరూ పూర్తిస్థాయిలో సహక రించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. సర్వే సమయం లో రైతులు తప్పనిసరిగా అందుబాటు లో ఉండి తమ భూముల హద్దులను క్షుణ్ణంగా పరిశీ లించు కోవాలని సూచించారు. గురువారం రోజున జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ధర్మారం మండలం లోని శాయంపేట గ్రామం లో జరుగుతున్న భూముల రీ సర్వేను, చామనపల్లి గ్రామం లో జరుగుతున్న (ఎస్.ఈ. ఎస్) సోషల్ ఎకనామిక్ సర్వే పరిశీలన, ఆయా ప్రాంతాల్లో జరుగు తున్న పనుల పురోగతిని, సర్వే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ భూముల రీ సర్వే చేపట్టే ముందు గ్రామాల్లో రైతుల కు ముందస్తుగా సమా చారం అందించడం జరుగు తుందని తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం వివరాలను గ్రామం లో ప్రకటిస్తామని, అభ్యంత రాలు తెలియజేసేందుకు తగిన గడువు కూడా కల్పి స్తామని స్పష్టం చేశారు. కాబట్టి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సర్వే సమయం లో రైతులు అందుబాటులో లేకపోతే భవిష్యత్తులో జియో కో-ఆర్డినేట్ల ఆధారంగా జారీ చేసే పట్టాదారు పాస్ పుస్తకాల విషయం లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. భూముల రీ సర్వే సజావుగా పూర్త య్యేందుకు రైతులు తమ వంతు బాధ్యతగా సహక రించాలని కోరారు. ధర్మారం మండలం చామనపల్లి గ్రామం లో జరుగుతున్న సోషల్ ఎకనామిక్ సర్వేను పరిశీలించారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. చామనపల్లి ముంపు గ్రామ తరలింపు ప్రక్రియను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఈ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేసేలా సం బంధిత అధికారులు సమన్వయం తో పనిచేయాలని ఆదేశించా రు. అనంతరం జూలపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసి ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థు లకు అల్పాహారం సక్రమంగా అందేలా పర్య వేక్షించాలని సంబం ధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటన లో ధర్మారం తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చింతలపేటలో గ్రామ సమాఖ్య భవనానికి భూమిపూజ.. బీసీ సఖి కేంద్రం ప్రారంభం



మెట్ పల్లి రూరల్ నవంబర్ 12: (ప్రజా కలం); మెట్ పల్లి మండలంలోని చింతలపేట గ్రామంలో గ్రామ సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా నూతనంగా ఏర్పాటు చేసిన బీసీ నఖి కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు డీఆర్‌డీఓ , గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ హాజరయ్యారు. అలాగే డీపీఎం ఎఫ్ఎన్/ బీఎల్, బ్రాంచి మేనేజర్, బీసీ పాయింట్ బ్యాంక్ ట్రైనర్, ఏపీఎం ఐబీ/పీడబ్ల్యూడీ, వీఓ ఓబీ సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, క్లస్టర్ సీసీ, మండల సీసీ, బీసీ పాయింట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో గ్రామ సమాఖ్య భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో పాటు బీసీ సఖి కేంద్రాన్ని ప్రారంభించడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులకు నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

- ఎండపల్లి ఎంఈఓ సముద్రాల హరికృష్ణ ఆధ్వర్యంలో



ఎండపల్లి, నవంబర్ 12 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని గుల్లకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించేందుకు నిర్వ హించే చెకుముకి సైన్స్ టెస్ట్ -- చెకుముకి సంబరాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం రోజున ఎండ పల్లి మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో గుల్లకోట సెకండరీ పాఠశాల ప్రధా నోపాధ్యాయులు మునీందర్, ఉపాధ్యాయు లు శనిగరపు రవి, నరసింహ చారి, శ్రీనివాస్ రెడ్డి, గాలేటి శ్రీనివాస్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా పరీక్షల నిర్వహణ వివరాలను వెల్లడిస్తూ, ఈ నెల 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి చెకు ముకి సైన్స్ టెస్ట్ నిర్వహించ నున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన జట్లకు డిసెంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు మేడ్చల్‌లోని కండ్లకోయలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చు కోవాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాల

సాన రామకృష్ణారెడ్డి సొంత ఖర్చులతో 1వ తరగతిగదిని ఆధునికరించి ప్రారంభం

గదిని ప్రారంభించిన డీఈవో ఖీలావత్ రాము, సాన రామకృష్ణారెడ్డి, సర్పంచ్



ఎండపల్లి, నవంబర్ 12 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని గుల్లకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గుల్లకోట లో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గుల్లకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కు క్రమశిక్షణ అభ్యసన సామర్థ్యాలు ఉన్నాయని జగిత్యాల జిల్లా విద్యాధికారి ఖీలావత్ రాము అన్నారు. గురు వారం రోజున ప్రాథమిక పాఠశాల లో సానా రామకృష్ణారెడ్డి విరాళం ద్వారా ఆధునికరించిన ఒకటవ తరగతి గదిని ప్రారంభించారు. అనంతరం జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ గుల్లకోట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా మూడు రకాల రంగు రంగుల టీషర్ట్స్ ప్రభుత్వ యూనిఫామ్, షూస్, టై, బెల్ట్ ధరించి మంచి క్రమ శిక్షణ నాణ్యమైన విద్యా బోధన ద్వారా ప్రైవేటు పాఠశాలల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గొప్ప పేరు సాధించిందని ఈ పాఠశాల విద్యార్థులు చాలా చక్కగా ఉపన్యసిస్తున్నారని సమాజం తోడ్పాటు ద్వారా ఈ పాఠశాలను ప్రధానోపా ధ్యాయులు చందూరి రాజిరెడ్డి పాఠశాలను చాలా అభివృద్ధి చేస్తున్నారని వారి సేవలు అభినంద నీయమని అన్నారు ఉపా ధ్యాయ బృందం గ్రామ ప్రజా ప్రతినిధులు దాతలు ఈ పాఠశాల అభివృద్ధికి చాలా సహకరించే విధంగా సమాజ తోడ్పాటును ప్రధానోపాధ్యాయులు సాధిస్తున్నారని అన్నారు. జిల్లా మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లా డుతూ నేను సందర్శించిన ప్రభుత్వ పాఠశాలల్లోకెల్లా గుల్లకోట ప్రాథమిక పాఠ శాల ప్రభుత్వ పాఠశాల లన్నింటికీ ఆదర్శప్రాయంగా ఉంటుందని అన్నారు క్రమ శిక్షణ ఎఫ్ఎల్ఎం కార్య క్రమ నిర్వహణ ఎక్స్ఎల్ ల్యాబ్ ద్వారా వెనకబడిన విద్యార్థులకు చక్కటి విద్యాబోధన అందిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తున్నట్లు వారు తెలిపారు. దాత సాన రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నేను చిన్న ప్పుడు ఈ పాఠశాల లో విద్యను అభ్యసించానని ఈ పాఠశాలకు రాజిరెడ్డి లాంటి ప్రధానోపాధ్యాయు లు ఆ కాలంలో ఉంటే మా భవిష్యత్తు లో ఇంకా బాగుండేవన్నీ తెలిపారు ఈ పాఠశాలకు సేవ చేసే భాగ్యం నాకు రావడం నా జన్మజన్మల అదృష్టమని సాన రామకృష్ణారెడ్డి అన్నారు. గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు ఈ పాఠశాలకు వచ్చినప్పటి నుండి పాఠశాలను రాష్ట్ర స్థాయిలో అన్ని రంగాలలో అభివృద్ధి పరిచారని వారి సేవలో అభినందనీయమని ఉపాధ్యాయ బృందం కృషి గొప్పగా ఉందని గ్రామ సర్పంచ్ గొల్లపల్లి మల్లేష్ గౌడ్ అన్నారు. అనంతరం జిల్లా విద్యా అధికారి ఖీలావత్ రాము నాయక్, జిల్లా మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, ఎండపల్లి మండల విద్యా అధికారి సముద్రాల హరికృష్ణ, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో దాత సాన రామకృష్ణారెడ్డి ని శాలువా తో ఘనంగా సన్మా నించారు. పాఠశాల లో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహణలో విశేష కృషి చేస్తున్న పాఠ శాల స్వీపర్ మహమ్మద్ రాజ్ మహమ్మద్, విద్యా ర్థులను సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఇనుగుర్తి మునీందర్, ఉపాధ్యాయులు ఎస్ రమాదేవి,ఆర్ మాలతి, ప్రశాంత్, నరేష్, కుమార్ కృష్ణారెడ్డి, ఎన్ శ్రీలత, పూర్వ ప్రాథమిక విద్యాశిక్షకురాలు శిరీష, గ్రామ పంచాయితీ కార్యదర్శి కొమురయ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా కలం
శుక్రవారం, నవంబర్ 13, 2026

విశ్వాసం, గౌరవమే వివాహ వ్యవస్థకు మూలం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించి ఉప ముఖ్య మంత్రి అయిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు తన మూడవ భార్యకు విడాకులు ఇచ్చి దూరంగా ఉంటున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పవన్ కళ్యాణ్ విడాకుల గురించే మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియా, టీవీ చానళ్లు, వెబ్ సైట్లు ఒకటేంటి అన్నీ చోట్ల ఏపీ డిప్యూటీ సీఎం ముచ్చటగా మూడో పెళ్లిని కూడా రద్దు చేసుకోవడం ఏంటని ఆశ్చర్యపోతున్నారు. 2026 నవంబర్ 9 రాత్రి పవన్ కళ్యాణ్, అనా లెజ్‌నెవా విడిపోతున్నట్లు ప్రకటించారు. అభిమానులకు ఈ ప్రకటన షాకిచ్చింది. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ కళ్యాణ్ ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన ప్రసంగాల్లో సనాతన ధర్మ పరిరక్షణ గురించి ప్రస్తావిస్తుంటారు. అయితే సనాతన ధర్మం గురించి మాట్లాడే వ్యక్తులు తమ వ్యక్తిగత జీవితంలో ధర్మవిలువలు పాటిస్తున్నారా? పవన్ కళ్యాణ్ మమూడు పెళ్లిళ్లు.. మూడో భార్యతో విడాకుల వ్యవహారంతో మరోసారి చర్చనీయాంశమైంది. 1997లో నందినిని వివాహం చేసుకున్న పవన్ కళ్యాణ్ 2008లో విడాకులు తీసుకున్నారునటి రేణుదేశాయ్ లో సహజీవనం చేసి 2009లో పెళ్లిచేసుకున్నారు..వీరికి ఇద్దరు పిల్లలు.. 2012లో విడిపోయారు.రష్యాకు చెందిన అనా లెజ్‌నెవాని 2013లో వివాహం చేసుకున్నారు..వీరికి ఇద్దరు పిల్లలున్నారు..లేటెస్ట్ గా వరస్పర అంగీకారంతో విడిపోతున్నట్టు ప్రకటించారుతమ వైవాహిక బంధం ముగిసినప్పటికీ పిల్లల బాధ్యతలు కలసి నిర్వహిస్తామని తెలిపారు. సనాతన ధర్మం అంటే శాశ్వతమైన ధర్మం లేదా ఎప్పటికీ నిలిచే జీవన విలువలు అని అర్థం. ఇది కేవలం మతపరమైన నినాదం కాదు.. సత్యం, ధర్మం, అహింస, దయ, కరుణ, ఇంద్రియ నిగ్రహం, పరులకు హాని చేయకపోవడం లాంటి విలువలకు సనాతన ధర్మంలో ప్రాధాన్యత ఉంది. ధర్మం అంటే కేవలం పూజ చేయడం, దేవాలయాలు సందర్శించడం, ఆచారాలు పాటించడం మాత్రమే కాదు.. మనిషి తన బాధ్యతలు నిజాయితీగా నిర్వహించడం, ఇతరుల హక్కులు గౌరవించడం, కుటుంబాన్ని బాధ్యతతో నడిపించడం కూడా ధర్మంలో భాగమే. హిందూ సంప్రదాయంలో వివాహాన్ని పవిత్రమైన సంస్కారంగా భావిస్తారు. ప్రాణి భూమ్మీద పడినప్పటి నుంచి మరణించే వరకూ ముఖ్యమైన 16 సంస్కారాలు అనుసరిస్తారు. వాటిలో వివాహం కూడా ఒకటి. అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకుని ఆఖరిక్షణం వరకూ ఆమెతోనే కలసి బతకాలన్నది శాస్త్రవచనం. పవన్ కళ్యాణ్ మొదటి భార్య నందిని. వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. అయితే, పవన్, నందినిల మధ్య ప్రేమ ఎక్కువ కాలం నిలవలేదు. నందిని కూడా విశాఖపట్నంలోని ఒక సంపన్న కుటుంబానికి చెందినది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే రెండో పెళ్లి చేసుకున్నాడని ఆమె ఆరోపించింది. విశాఖపట్నం కుటుంబ న్యాయస్థానానికి వాంగ్మూలం ఇచ్చిన పవన్ కళ్యాణ్, తాను రేణు దేశాయ్‌ను వివాహం చేసుకోలేదని చెప్పారు. ఆ తర్వాత, పవన్ కళ్యాణ్ విడాకుల కోసం దరఖాస్తు చేసుకోగా, 2008లో నందినికి రూ. 5 కోట్ల భరణం చెల్లించి విడాకులు పొందారు.తన మొదటి భార్యతో విడిపోయి, 2012లో, ఈ జంట విడాకులు తీసుకుని విడిపోయారు.అయితే పవన్ కళ్యాణ్ నుండి రేణు దేశాయ్ కోట్ల రూపాయల భరణం అందుకోలేదని సమాచారం. దానికి బదులుగా, పవన్ కళ్యాణ్ ప్రతి నెలా వారి ఇద్దరు పిల్లల పోషణ ఖర్చులను చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. రేణు దేశాయ్ తన పేరు మీద కొన్ని ఆస్తులను రిజిస్టర్ చేయించుకున్నట్లు కూడా సినీ వర్గాల్లో ఇన్ సైడ్ టాక్.తన రెండవ భార్య రేణు దేశాయ్‌తో విడాకులు తీసుకునే ముందు, పవన్ కళ్యాణ్ 2010లో 'టీన్ మార్' సినిమా షూటింగ్ కోసం రష్యా వెళ్లారు. అక్కడ ఆయన మోడల్ అన్నా లెజ్నోవాను కలిశారు. 2012లో రేణు దేశాయ్‌కు విడాకులు ఇచ్చిన పవన్ కళ్యాణ్, 2013 ప్రత్యేక వివాహ చట్టం కింద అన్నా లేజనోవాను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆయన మూడవ వివాహం కూడా విడాకుల బాట పట్టింది. అన్నాతో పవన్ కళ్యాణ్ 13 ఏళ్ల వైవాహిక జీవితానికి తెరదించారు.కొందరు మాత్రం పవన్ కళ్యాణ్ విడాకులు తీసుకోవడానికి ఓ బలైమన కారణం ఉందంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. అందులో మరీ ముఖ్యంగా తన రాజకీయపాలన కోసమే ఈ పని చేసినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు సేవ చేయాలన్న ఒకే ఒక్క కారణంతో తన కుటుంబానికి దూరంగా ఉండాలనుకున్నాడని.. అందుకోసమే విడాకులు తీసుకున్నాడని పెద్ద ఎత్తున పోస్ట్‌లు పెడుతున్నారు. నిజంగానే ఈ కారణంతోనే విడాకులు తీసుకున్నాడా? లేదంటే ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయా? అనేది క్లారిటీ లేదు.ఇందులో నిజమెంతుందో పక్కన పెడితే ఈ టైమ్‌లో పవన్ కళ్యాణ్ విడాకులు తీసుకోవడం తన పొలిటికల్ కెరీర్‌కు మరో మచ్చలా మిగిలిపోతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే చాలా మంది మాత్రం అది వాళ్ల పర్సనల్ లైఫ్.. విడాకులు తీసుకుంటారో, కలిసుంటారో అన్నది వాళ్ల ఛాయిస్. వాళ్ల డెసిషన్‌కు రెస్పెక్ట్ ఇవ్వాలి కానీ... ఇంకా బురద జల్లే ప్రయత్నాలు చేయడం సరికాదు అంటూ పోస్ట్‌లు పెడుతున్నారు.భార్యాభర్తలు పరస్పర విశ్వాసం, గౌరవం, బాధ్యతతో జీవించాలని వివిధ ధర్మశాస్త్రాలు, సంప్రదాయాలు బోధిస్తాయి. వివాహం విఫలం అయితే జీవితాంతం బాధను భరించాలనే నియమమం సనాతన ధర్మంలో ఉందని చెప్పలేం. పెళ్లి, విడాకులు, పునర్వివాహాల విషయంలో హిందూ సంప్రదాయాల్లో భిన్నమైన అభిప్రాయాలు, ఆచారాలు ఉన్నాయి. ఆధునిక భారతీయ చట్టం కూడా విడాకులు, పునర్వివాహాలకు అవకాశం కల్పిస్తోంది. ఓ వ్యక్తి ఎన్ని వివాహాలు చేసుకున్నారనే సంఖ్య ఆధారంగా మాత్రమే వారి ధార్మికతను నిర్ణయించడం సరైన పద్ధతి కాదు. అదే సమయంలో ప్రతి వివాహంలోనూ భాగస్వామ్య గౌరవం, పిల్లల సంక్షేమం, కుటుంబ బాధ్యతలను ప్రాధాన్యత ఇవ్వడం అవసరం.ఆధ్యాత్మిక దృక్పథంలో చూస్తే వ్యక్తిగత జీవితంపై తీర్పు చెప్పడం కన్నా ఆ వ్యక్తి ప్రవర్తనలో ధర్మ విలువలు ఎంతవరకు ప్రతిబింబిస్తున్నాయో పరిశీలించడం ముఖ్యం. వివాహ బంధం కొనసాగపోవడానికి ఎన్నో వ్యక్తిగత కారణాలు ఉండొచ్చు. పూర్తి కారణాలు తెలియకుండా తప్పొప్పులు చెప్పడం సముచితం కాదంటారు ఆధ్యాత్మికవేత్తలు. సనాతన ధర్మం గురించి ప్రజలకు సందేశాలు ఇచ్చేనాయకులు తమ జీవితాల్లో సత్యం, నిబద్ధత, బాధ్యత, పరస్పర గౌరవం వంటి విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని అంతా ఆశించడం సహజం.సనాతన ధర్మం అంటే ఇతరులకు చెప్పేందుకు ఉపయోగించే నినాదం కాదు..అది మనిషి తన జీవితంలో ఆచరించాల్సిన విలువల సమాహారంరాజకీయ నాయకుడు అయినా,ఆధ్యాత్మికవేత్త అయినా, సామాన్యుడు అయినా ధర్మం ముందు బాధ్యత ఒక్కటే. ధర్మం మాటల్లో కనిపించడం కన్నా చేతల్లో చూపించినప్పుడే సందేశం విలువ పెరుగుతుంది..

అత్యవసర వైద్య సేవలకు పెద్దపీట

- జూలపల్లికి 108 అంబులెన్స్ మంజూరుకు ఎమ్మెల్యే హామీ

పెద్దపల్లి,నవంబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జూలపల్లి మండల ప్రజల చిరకాల కోరికైన 108 అంబులెన్స్ సదుపాయాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని పెద్దపల్లి శాసనసభ్యులు,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు భరోసా ఇచ్చారు.జూలపల్లి మండల కేంద్రానికి విచ్చేసిన ఆయనకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘనస్వాగతం పలికి,శాలువాతో సన్మానించారు.అనంతరం మండలంలో అత్యవసర వైద్య సేవల కోసం 108 వాహనాన్ని కేటాయించాలని కోరుతూ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.దీనిపై తక్షణమే సానుకూలంగా స్పందించిన ఆయన, అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా 108 సేవలు ప్రారంభమయ్యేలా చూస్తానని మాట ఇవ్వడంతో మండల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గత పాలకులు జూలపల్లిని ఒక మారుమూల ప్రాంతంగా పరిగణించి అభివృద్ధిలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు.కానీ ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక చొరవతో కోట్లాది రూపాయల



నిధులు మంజూరు చేస్తూ,జూలపల్లి మండలాన్ని ఒక సిటీ మోడల్ తరహాలో తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. మండల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు, కార్యకర్తల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జూలపల్లి సింగిల్ విండో చైర్మన్ లోక జలపతి రెడ్డి,అబ్బాపూర్ సర్పంచ్ దండే వెంకటేశ్వర్లు,మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మానుమండ్ల శ్రీనివాస్,మాజీ ప్రధాన కార్యదర్శి కోరేపు సంపత్,నాయకులు కొట్టే సంజీవ్,ఈర్ల స్వామి,పిట్టల రమేష్,గుండా సాగర్, కొమ్మ రాజేశం,నాగులాపల్లె రవి, మానుమండ్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సేద్యంతో రైతు ఆదాయానికి భరోసా

ఉద్యాన రాయితీలను అందిపుచ్చుకోవాలి - జిల్లా ఉద్యానశాఖాధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్



పెద్దపల్లి,నవంబర్ 12:(ప్రజాకాలం జిల్లా ప్రతినిధి)

వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ తక్కువ నీటితో అధిక లాభాలు ఆర్జించేందుకు రైతులు కూరగాయల సాగు వైపు మొగ్గు చూపాలని జిల్లా ఉద్యానశాఖాధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు.గురువారం పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట గ్రామంలో రైతు గౌరవెల్లి రవీందర్ రావు తన 4.5 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో బిందు సేద్యం,మల్చింగ్ పద్ధతుల ద్వారా అంతర పంటలుగా సాగు చేస్తున్న టమాటా,మిరప పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వాతావరణ పరిస్థితులు మరింత క్లిష్టంగా మారే ప్రమాదం ఉందని,భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో నీటి లభ్యత తగ్గుతున్న దృష్ట్యా రైతులు అధిక నీటిని వినియోగించే వరి,పత్తి,చెరకు,మొక్కజొన్న వంటి పంటలకు బదులుగా పంటల మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తక్కువ కాలపరిమితి, స్వల్ప నీటి అవసరాలు కలిగిన బెండ,అలసంద, గోరుచిక్కుడుతో పాటుమార్కెట్‌లో మంచి గిరాకీ ఉన్న టమాటా,పచ్చిమిర్చి,బీరకాయ, కాకరకాయ వంటి కూరగాయల పంటలను ఆధునిక సాగు పద్ధతుల్లో పండించడం ద్వారా స్థిరమైన దిగుబడులు,మెరుగైన ఆదాయం పొందవచ్చని వివరించారు.బిందు సేద్యం,మల్చింగ్ షీట్ల ఏర్పాటుకు ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి రాము,స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే భూ కబ్జా పర్వం.. నిలదీయగానే పరార్

పెద్దపల్లి,నవంబర్ 12:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లా కేంద్రంలో భూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారు.కనీస భయం లేకుండా పట్టపగలే ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు తెగబడుతున్నారు.తాజాగా పెద్దపల్లి పట్టణంలోని బండారికుంట ప్రాంతంలో ఉన్న సర్వే నంబర్ 5లో ఆబ్కారీ శాఖ కార్యాలయం సమీపంలోని సుమారు 3 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నించడం స్థానికంగా కలకలం రేపింది.గురువారం పట్టపగలే కొందరు వ్యక్తులు ఆ స్థలంలోకి ప్రవేశించి,అక్కడ అధికారులు ఏర్పాటు చేసిన ప్రభుత్వ హద్దు రాళ్లను నిర్దాక్షిణ్యంగా తొలగించారు.అనంతరం ఆ భూమిని చదును చేసే పనులు చేపట్టారు.ఇది గమనించిన స్థానికులు అక్కడికి చేరుకుని కబ్జాదారులను అడ్డుకుని నిలదీశారు.అయితే ఈ భూమిని మేము కొనుగోలు చేశాం అంటూ వారు పొంతనలేని సమాధానం ఇచ్చారు.స్థానికులు గట్టిగా ప్రశ్నించడంతో ఆ వ్యక్తులు హడావుడిగా అరగంటలోనే పని ముగించుకుని అక్కడి నుంచి జారుకున్నారు.



రెవెన్యూ యంత్రాంగం స్పందించాలి

కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని,ఆ 3 గుంటల ప్రభుత్వ భూమిని తిరిగి తమ ఆధీనంలోకి తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.భూమి చుట్టూ కంచె లేదా బార్డర్ లైన్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డును అమర్చాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మున్నూరుకాపుల హక్కుల సాధనకు కృషి చేస్తా

- మున్నూరుకాపు జిల్లా ఉపాధ్యక్షుడిగా నూమూరి శ్రీధర్ పటేల్ నియామకం



పెద్దపల్లి,నవంబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ మున్నూరుకాపు సంఘం (పటేల్స్) పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి పట్టణానికి చెందిన నూమూరి శ్రీధర్ పటేల్ నియమితులయ్యారు.ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లిపల్లి వెంకటేశ్వర్లు పటేల్ గురువారం ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు.రాష్ట్ర, జిల్లా కమిటీ ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 50 లక్షల జనాభా ఉన్న మున్నూరుకాపుల ఐక్యత,సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.జిల్లాలోని మండల, నియోజకవర్గ, గ్రామ మరియు వార్డు స్థాయి సంఘాల సమగ్ర వివరాలను సేకరించి రాష్ట్ర కమిటీకి నివేదించాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ జనగణన నేపథ్యంలో మున్నూరుకాపులందరూ తమ పేరు చివరన రావు,రెడ్డి వంటి పదాలు ఉన్నా లేకపోయినా తప్పనిసరిగా పటేల్ అని నమోదు చేయించుకోవాలని,తద్వారా రాష్ట్రవ్యాప్తంగా తమ సామాజిక వర్గ బలం స్పష్టమవుతుందని పేర్కొన్నారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ,జనాభా దామాషా ప్రకారం మున్నూరుకాపులకు రావాల్సిన వాటా,కోటా సాధన కోసం అంకితభావంతో పనిచేస్తానని నూతన జిల్లా ఉపాధ్యక్షుడు నూమూరి శ్రీధర్ పటేల్ స్పష్టం చేశారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో

ఎండపల్లి విద్యార్థుల ప్రతిభ

ఎండపల్లి, నవంబర్ 12 : (ప్రజా కలం ప్రతినిధి) రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎండపల్లి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చారు. ఖమ్మం లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించి న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల లో జడ్పీహెచ్ఎస్ ఎండపల్లి విద్యార్థి సాయి సూరజ్ అండర్-17 విభాగం లో హ్యామర్ త్రో పోటీలో నాలుగో స్థానాన్ని సాధించాడు. అదేవిధంగా హనుమకొండ లోని జేఎన్ఎస్ స్టేడియం లో ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల లో జెడ్ పి హెచ్ ఎస్ ఎండపల్లి



విద్యార్థిని బి కావ్యశ్రీ అండర్-14 బాలికల విభాగం.లో డిస్కస్ త్రో పోటీల లో కాంస్య పతకాన్ని సాధించింది. ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి లో ప్రతిభ కనబరచడం పాఠశాలకు గర్వకారణం. ఈ సందర్భంగా విద్యార్థు లను పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తూ, భవిష్యత్తు లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

82 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

ఎమ్మెల్యే కోటాలో మంజూరైన ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్



మెట్ పల్లిరూరల్ నవంబర్ 12:(ప్రజా కలం);మండలంలోని నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మెట్‌పల్లి మండలానికి ఎమ్మెల్యే కోటాలో మంజూరైన 82 ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేశారు. మెట్‌పల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుందని పేర్కొన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ ప్రాధాన్యత క్రమంలో ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసుకోవాలని సూచించారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంపై లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బంది, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

భోజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

గొల్లపల్లి నవంబర్ 12 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలం శంకర్రావుపెట్ గ్రామానికి చెందిన సామాజిక సేవకులు ఎడమల భోజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక యువకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈరక్తదాన శిబిరంలో సుమారు 25 మంది యువకులు రక్తదానం చేశారు.ఈ సందర్భంగా సామాజిక సేవకులు ఎడమల భోజేందర్ రెడ్డి మాట్లాడుతూ నా జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించిన యువతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయాలనే సదుద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని రక్తదానం మహాదానమని హంగూ ఆర్భాటాలకు పోకుండా సమాజానికి ఉపయోగ పడేలా రక్తదాన శిబిరం నిర్వహించిన యువతకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం మల్లన్నపేట్,శంకర్రావుపేట,వెంగలపూర్, శ్రీరాముపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శంకర్రావుపెట్, మల్లన్నపేట్,వెంగలపూర్,శ్రీరాముపల్లి సర్పంచ్ లు గోలి గంగారెడ్డి,సిద్ధెంకి మల్లారెడ్డి,రాంరెడ్డి, సల్లూరి శోభన్ ఉప సర్పంచ్ లు రంజిత్ రెడ్డి,తిరుపతి యూత్ నాయకులు అవారి చందు,గుర్రం మల్లారెడ్డి,కిషోర్ రెడ్డి,గోలి శశి,సరసని హన్మారెడ్డి,గాజుల మల్లారెడ్డి,ఉల్లెంగుల మొగిలి,లవన్,రఘుపతి తదితరులు పాల్గొన్నారు



ధాన్యం కొనుగోలు కేంద్రాలను
వెంటనే ప్రారంభించాలి
- బీజేపీ నాయకులు సత్యనారాయణ రెడ్డి

గొల్లపల్లి నవంబర్ 12 ప్రజా కలం ప్రతినిధి
గొల్లపల్లి మండలంలో వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ సీనియర్ నాయకులు వూట్కూరి సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించుకునే సమయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే పరికరాలు, ఇతర అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా, రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు పండించిన ధాన్యానికి నిబంధనల ప్రకారం మద్దతు ధర కల్పించి, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను సకాలంలో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పంట విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని బీజేపీ సీనియర్ నాయకులు వూట్కూరి సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

భూముల రీసర్వే ప్రక్రియలో వేగం పెంచాలి
రీ సర్వే లో నాణ్యత, పారదర్శకత కు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కచ్చితంగా నమోదు చేయాలి
రీ సర్వే లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయాలి లేని యెడల కఠిన చర్యలు తప్పవు
రీ సర్వే ప్రతి దశలో నిశితంగా పరిశీలించి డిసెంబర్ మొదటి వారంలోగా పూర్తి చేయాలి
మండల సర్వే బృందాల్లోని అధికారులు సమన్వయం తో పని చేయాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 12 (ప్రజా కలం):
జిల్లాలో చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతము గా, పకడ్బందీగా పూర్తి పారదర్శకతతో, నిర్దేశిత గడువులోగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఆర్డీవోలు, మండల తహశీల్దార్లు, భూ సర్వే శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ రీసర్వే పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే చేపట్టిన మొత్తం భూమి విస్తీర్ణం ఎన్ని ఎకరాలు ఉంది, ఇప్పటివరకు ఎన్ని ఎకరాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తి చేశారు, ఇంకా ఎన్ని ఎకరాల్లో సర్వే నిర్వహించాల్సి ఉందనే వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో ఇప్పటివరకు సాధించిన పురోగతి, మిగిలి ఉన్న సర్వే పనులు, వాటిని పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీసర్వే ప్రక్రియను ప్రాధాన్యతగా తీసుకొని క్షేత్రస్థాయిలో పనుల వేగం పెంచాలని సూచించారు. రీసర్వేకు సంబంధించి ప్రతి మండలానికి నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సర్వే పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. జిల్లాలో నిర్వహించే భూరి సర్వే ప్రక్రియలో కచ్చితంగా కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పనులను త్వరితగతిన డిసెంబర్ మొదటి వారంలోగా ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఆర్డీవోలు, మండల తహశీల్దార్లు, భూ సర్వే శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మండలాల వారీగా సర్వే పూర్తయిన విస్తీర్ణం, ఇంకా పెండింగ్‌లో ఉన్న భూముల వివరాలను ప్రతి రోజు ఎప్పటికప్పుడు సమీక్షించాలని, క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నిర్దేశిత గడువులోగా జిల్లాలో రీసర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, లేనియెడల కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావు, భూ సర్వే శాఖ ఏడీ, మండల తహశీల్దార్లు (ఎంఆర్ఓలు), సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేమునూర్ యువతి ప్రతిభకు కేటీఆర్ ప్రశంస
- అన్‌డిఫైనబుల్ గర్ల్ పుస్తకాన్ని ఆవిష్కరించిన కేటీఆర్



పెద్దపల్లి,నవంబర్ 12:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) రామగుండం నియోజకవర్గం వేమునూర్ గ్రామనికి చెందిన సివిల్స్ విద్యార్థిని కోల సింధు రచించిన అన్‌డిఫైనబుల్ గర్ల్. పుస్తకాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చేతల మీదుగా ఆవిష్కరించారు.సింధు రచనా ప్రతిభను అభినందించిన కేటీఆర్, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, సివిల్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.చిన్న వయసులోనే రచనా రంగంలో రాణిస్తూ సివిల్స్ లక్ష్యంతో ముందుకు సాగుతున్న సింధు యువతకు ఆదర్శమని పలువురు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి,నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆదర్శ పాఠశాలలో అతిథి అధ్యాపకుల భర్తీ
దరఖాస్తులకు ఈ నెల 16 తుది గడువు -ప్రిన్సిపల్ వూటూరి సరిత



జూలపల్లి,నవంబర్ 12(ప్రజాకలం జిల్లాప్రతినిధి): పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వూటూరి సరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కళాశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో ఐఐటీ, నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలకు శిక్షణ అందించేందుకు మొత్తం 6 అతిథి అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఇందులో గణితం–2, భౌతిక శాస్త్రం–1, రసాయన శాస్త్రం–1, వృక్ష శాస్త్రం–1, జంతు శాస్త్రం–1 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు.దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో ఎం.ఎస్సీ ఉత్తీర్ణతతో పాటు గతంలో ఐఐటీ, నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇచ్చిన బోధనా అనుభవం కలిగి ఉండాలని స్పష్టం చేశారు.ఎంపికైన అభ్యర్థులకు గౌరవ వేతనంగా ప్రతి గంటకు రూ. 650 చొప్పున చెల్లించబడుతుందని తెలిపారు.ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు ఈ నెల 16న సాయంత్రం 4 గంటల లోపు కళాశాల పనివేళల్లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని,మరిన్ని వివరాల కోసం పెద్దాపూర్‌లోని ఆదర్శ పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని ప్రిన్సిపల్ సరిత కోరారు.

చిన్నారి కల నెరవేర్చిన ఎంపీ వంశీకృష్ణ
- హామీ ఇచ్చిన 36 గంటల్లోనే సైకిల్ అందజేత

పెద్దపల్లి,నవంబర్12:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) విద్యార్థినికి ఇచ్చిన మాటను కేవలం 36 గంటల్లోనే నిలబెట్టుకుని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పలువురి ప్రశంసలు అందుకున్నారు.ఇటీవల ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంపీ వంశీకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.అనంతరం జిల్లా స్థాయి రీడింగ్ కాంపిటీషన్ లో ప్రథమ బహుమతి సాధించిన ఐదో తరగతి విద్యార్థిని సాయి విజ్ఞత ప్రతిభను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.చిన్నారిని ప్రోత్సహించేందుకు సైకిల్ బహుమతిగా ఇస్తాననిఅక్కడికక్కడే హామీ ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం,సరిగ్గా 36 గంటల్లోనే సాయి విజ్ఞతకు కొత్త సైకిల్‌ను అందజేసి ఆమె కలను నెరవేర్చారు.కొత్త సైకిల్ అందుకున్న చిన్నారి సంతోషంతో ఎంపీకి కృతజ్ఞతలు తెలిపింది. సామాజిక సేవా దృక్పథంతో స్పందించి,విద్యార్థినిని ప్రోత్సహించిన ఎంపీ వంశీకృష్ణకు పాఠశాల ఉపాధ్యాయులు,సాయివిజ్ఞత తల్లిదండ్రులు ప్రత్యేకధన్యవాదాలు తెలియజేశారు.



సొంత పార్టీ ఎంపీ సభకు వెళ్తే సస్పెండ్ చేస్తారా?
ఏకపక్ష సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేయాలి - కొయ్యూరు గ్రామ ఉప సర్పంచ్ లకవత్ సవేందర్



పెద్దపల్లినవంబర్ 12:(ప్రజా కలం జిల్లాప్రతినిధి)
తమపై పార్టీ విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహార్ రావు మండలం కొయ్యూరు గ్రామ ఉపసర్పంచ్ లకవత్ సవేందర్,మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎండీ ఖలీముద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కమాన్ రోడ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపసర్పంచ్ లకవత్ సవేందర్ మాట్లాడుతూ ఇటీవల పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి నాలుగో వార్డు సభ్యురాలు లక్ష్మి, ఆమె భర్త తిరుపతి ఆహ్వానం మేరకు తాము హాజరైనట్లు తెలిపారు.అయితే,అదే రోజు సాయంత్రం మండల అధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్ తమను పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు పత్రికా ప్రకటన విడుదల చేయడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఈ విషయంపై మండల అధ్యక్షుడిని ప్రశ్నించగా మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకే సస్పెండ్ చేశామని చెప్పారని వారు పేర్కొన్నారు. కనీసం సంజాయిషీ నోటీసు ఇవ్వకుండా,ఎవరు ఫిర్యాదు చేశారో ఆ కాపీని కూడా చూపించకుండా ఏకపక్షంగా బహిష్కరించడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల సర్పంచులు,గ్రామ అధ్యక్షులు పెద్ద ఎత్తున హాజరైనప్పటికీ వారిని వదిలేసి కేవలం తమనే లక్ష్యంగా చేసుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.ఇప్పటికే ఈ వ్యవహారంపై హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు వెళ్లి టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార రావుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. మండల అధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్ తక్షణమే తమ సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోకపోతే,ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పార్టీ కోసం తాము చేసిన కృషిని వివరిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వారి వెంట మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి భూమయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యం
- మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మరో మహా ఉద్యమానికి సిద్ధం
- వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్ రావు
-ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు అంబాల రాజేందర్



పెద్దపల్లి,నవంబర్ 12(ప్రజాకలం జిల్లా ప్రతినిధి):
ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు దివ్యాంగుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మరో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.గురువారం జిల్లా కేంద్రంలో కమాన్ రోడ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్ రావు,ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు అంబాల రాజేందర్ మాట్లాడుతూ. ఖమ్మంలో నిర్వహించిన జాతీయ సమావేశంలో భాగంగా పెద్దపల్లి జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులకు కీలక పదవులు దక్కాయని,జాతీయ కమిటీ సభ్యురాలిగా చింతిరెడ్డి సంతోష రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మీర్జా అమీన్ బేగ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కన్నం స్వామి నియమితులయ్యారని, అలాగే రాబోయే పదిహేను రోజుల్లో జిల్లా కమిటీని కూడా పూర్తిస్థాయిలో విస్తరిస్తామని వారు వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7 నాటికి మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ దివ్యాంగులకు రూ. 6 వేలు,వృద్ధులు మరియు వితంతువులకు రూ. 4 వేల ఆసరా పింఛన్ హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదని,కండరాల క్షీణతతో బాధపడుతున్న వారికి ప్రకటించిన రూ. 15 వేల పింఛన్‌ను సైతం వెంటనే మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.కొత్త పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియలో ఒంటరి మహిళలు,వృద్ధుల విభాగాలను తొలగించడం సరికాదని తప్పుబడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పన్నెండు లక్షల దరఖాస్తులన్నింటినీ తక్షణమే ఆమోదించాలని వారు కోరారు.మహిళలకు కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని దివ్యాంగులకు కూడా వర్తింపజేయాలని, ప్రస్తుతం దివ్యాంగ పురుషులు సగం టికెట్ పైనే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విలేకరుల సమావేశంలో అంబాల నరేష్,బరెడ్డి నారాయణ రెడ్డి,కన్నం స్వామి,ఎం.అమిన్ బేగ్,నరిగే మల్లేశ్వరి,కల్వల స్వాతి,రాసపెల్లి రవి,గోస్కె స్వామి,పల్లె రాకేష్,కాదాసి కిరణ్,పోశం తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు ఘనంగా సన్మానం



మల్లాపూర్, నవంబరు 12 (ప్రజా కలం ప్రతినిధి):
తెలంగాణ రక్షణ సేన పార్టీ మల్లాపూర్ మండల నూతన కమిటీ సభ్యులు గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి అలువాల శ్రీకాంత్, తహసీల్దార్ రామచందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దేశెట్టి కిరణ్ ఆధ్వర్యంలో అధికారులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు మైలారం గౌతమ్, ప్రధాన కార్యదర్శి సుద్దాల నాగరాజు, సంయుక్త కార్యదర్శి ఆరెల్లి మహేష్, సురకంటి వినోద్‌రెడ్డి, బండి రాజు, శ్రీనివాస్ యాదవ్, కొండ మధు తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల గ్రామంలోకి బస్సు రావాలని ధర్నా
గ్రామంలోకి బస్సు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు: సర్పంచ్ ఎం.డి ఇబ్రహీం.

బెల్లంపల్లి, నవంబర్ 12, (ప్రజాకలం) ప్రతినిధి... బెల్లంపల్లి టూ నెన్నెల టూ మైలారం వెళ్లే బస్సు యథావిధిగా గ్రామంలోకి రావాలని డిమాండ్ చేస్తూ నెన్నెల గ్రామ సర్పంచ్ ఎండి ఇబ్రహీం గురువారం ప్రజలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు.గత యాభై నుంచి అరవై సంవత్సరాలుగా నెన్నెల గ్రామంలోకి బస్సు వస్తూ విద్యార్థులు,రైతులు,కూలీలు, మహిళలు,వృద్ధులకు రవాణా సౌకర్యం కల్పిస్తోంది.అయితే ఇటీవల కొత్తగా వచ్చిన ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందులు సృష్టిస్తూ బస్సును గ్రామంలోకి రాకుండా మెయిన్ రోడ్డు మీదుగానే నడుపుతున్నారని



గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.
దీంతో గ్రామంలోకి బస్సు రాకపోవడంతో విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ తెలిపారు.బస్సు సౌకర్యాన్ని యథావిధిగా కొనసాగించాలని, గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.ధర్నాలో గ్రామ పెద్దలు, యువకులు,మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సమస్య పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామ ప్రజలు హెచ్చరించారు.స్థానిక ఎస్.ఐ జగదీశ్వర్ రెడ్డి ధర్నా స్థలానికి చేరుకుని ప్రజలతో, ఆర్టీసీ బస్ డ్రైవర్ తో మాట్లాడి బస్సు యథావిధిగా గ్రామంలోకి వస్తుందని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించినట్లు సర్పంచ్ ఇబ్రహీం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కీసరి సంతోష్,మాజీ ఉప సర్పంచ్ గడ్డం స్వామి గౌడ్,భాస్కర్, అంజన్న,క్రిష్ణ స్వామి,తిరుమల్, రాము.శ్రీశైలం,ఆశన్న, తాజ్, ఆశన్న,బాపు,వెంకన్న, దుర్గయ్య, ప్రవీణ్,నాగేష్, సంతోష్, లస్మయ్య, మల్లన్న, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు....

నవంబర్ 16న చలో కలెక్టరేట్
రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి
సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ పిలుపు



నాగర్‌కర్నూల్ నవంబర్ 12 (ప్రజా కలం): జిల్లాలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, సామాన్య ప్రజలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 16న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అనేక మండలాలు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, పంటలు సాగు చేసిన రైతులు నష్టాలపాలై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కూలీలు, కౌలు రైతుల పరిస్థితి కూడా దయనీయంగా మారిందన్నారు. కరువు బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్, పదర మండలాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలకు కనీసం తాగునీరు కూడా అందని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను మెరుగుపరచడంతో పాటు కరువు ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.నవంబర్ 16న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాలనరసింహ హాజరుకానున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా కరువు బారిన పడిన రైతులు, వ్యవసాయ కార్మికులు,కౌలు రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫయాజ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు బి. శ్రీనివాసులు, మారేడు శివశంకర్, మాడుగుల నరసింహ, ఎండీ బషీర్, వంకేశ్వరం శ్రీనివాసులు, కొత్త రామస్వామి, ఈర్ల హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్రావును అభినందించిన భద్రాచలం ఎమ్మెల్యే

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, నవంబర్ 12 అమెరికాలో ఇటీవల జరిగిన ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మాస్టర్-4, 83 కేజీల విభాగంలో రజిత



పతకం, కాంస్య పతకం సాధించి దేశం గర్వించదగ్గ రీతిలో కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన ప్రముఖ అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ శ్రీ దేశరాజు వెంకట శంకరరావు ని, మరియు భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ రామిరెడ్డి ని, భద్రాచలం శాసనసభ్యులు (ఎమ్మెల్యే) శ్రీ తెల్లం వెంకట్రావ్ అభినందించారు. అంతేకాకుండా దేశరాజు వెంకట శంకరరావు ని మెడల్ వేసి అలంకరించి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ తెల్లం వెంకట్రావ్ మాట్లాడుతూ.. వయస్సుతో సంబంధం లేకుండా పట్టుదల, కఠిన శ్రమ, క్రమశిక్షణతో ఆయన సాధించిన ఈ అరుదైన విజయం భద్రాచలం ప్రాంతానికే కాక యావత్ దేశానికి గర్వకారణమని కొనియాడారు. అంతర్జాతీయ వేదికపై భారత్ జెండాను రెపరెపలాడించిన వెంకట శంకరరావు ప్రయాణం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ ఆయనకు కోచింగ్ ఇచ్చిన జిమ్ కోచ్ రామిరెడ్డి కి కూడా అభినందనలు తెలిపారు.

పొంగులేటి సుధాకర్ రెడ్డిని సన్మానించిన చల్లా నాగులు, తిరుమలదేవి దంపతులు..



తల్లాడ నవంబర్ 12 ప్రజా కలం న్యూస్ బిజెపి జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డిని తల్లాడ బిజెపి మండల అధ్యక్షులు చల్లా నాగులు, మాజీ ఎంపీటీసీ తిరుమలదేవి దంపతులు సన్మానించారు. గురువారం తల్లాడ మండలంలో పొంగులేటి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనను వారు ఇంటి వద్ద శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా పలు విషయాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నియోజకవర్గ అభ్యర్థి నంబూరు రామలింగేశ్వర రావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరావు, జిల్లా అధ్యక్షులు నరుకుల్లా వెంకటేశ్వర్లు తల్లాడ మండల ప్రధాన కార్యదర్శి రాయల్ రమేష్ ఉ పాధ్యక్షులు గొల్లమందల నరేష్ ట్రెజరీ యద్దనపూడి శ్రీనివాసరావు నాయకులు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అన్నారుగూడెంలో సీసీరోడ్లకు శంకుస్థాపనలు

ప్రారంభించిన సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు..



తల్లాడ నవంబర్ 12 (ప్రజా కలం న్యూస్): తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో గ్రామపంచాయతీ నిధులతో గురువారం పలు సిసిరోడ్లకు శంకుస్థాపన చేశారు. ఎస్సీ కాలనీలోని గొడ్ల నాగేశ్వరరావు ఇంటి నుండి సాల్మన్ ఇంటి వరకు సుమారు 2 లక్షలు, ఎస్సీ కాలనీ (మాలపల్లిలో) తంబళ్ల రమేష్ ఇంటి నుండి కోపెల రామారావు ఇంటివరకు మరో 2లక్షల నిర్మించనున్న సిసి రోడ్డుకు గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ) చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం సిసి రోడ్లుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సెక్రటరీ వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్ దావీదు, నాయకులు మారెళ్ళ దేవేంద్రరావు, పొన్నం కృష్ణయ్య, గోవిందు సురేష్, గొడ్ల బాబురావు, మదార్, కొత్తపల్లి దానయ్య, ఇన్నపల్లి లక్ష్మణ్, భాస్కర్, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

గగ్గలపల్లి పాఠశాలలో షెడ్ నిర్మాణానికి భూమి పూజ

- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 1.60 లక్షలతో నిర్మాణం..
- విద్యార్థులకు ఎండ, వాన నుంచి రక్షణ

నాగర్‌కర్నూల్ నవంబర్ 12 (ప్రజాకలం): జిల్లా పరిధిలోని గగ్గలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతన షెడ్ నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ. 1.60 లక్షల వ్యయంతో ఈ షెడ్‌ను నిర్మించనున్నారు ఈ కార్యక్రమానికి లయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ దొడ్ల రాజవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గతంలో పాఠశాల ఆవరణలో నిర్మించిన వేదికపై నూతనంగా షెడ్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో విద్యార్థులకు ఎండ, వాన నుంచి రక్షణ లభించడంతో పాటు పాఠశాలలో జరిగే వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రావు తెలిపారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో నీటి ట్యాంకుల ఏర్పాటు, బస్సు షెల్టర్ల నిర్మాణం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.విద్యార్థుల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమానికి ముందుకొచ్చిన లయన్స్ క్లబ్ సభ్యులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిలేందర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి, క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

నేర రహిత సమాజ నిర్మాణానికి చట్టాలపై అవగాహన అవసరం - డీఎల్ఎస్ఏ కార్యదర్శి నిహారిక
వడ్డేమాన్‌లో జాతీయ న్యాయ సేవల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం



నాగర్‌కర్నూల్ నవంబర్ 12 (ప్రజా కలం): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా గురువారం వడ్డేమాన్ గ్రామ పంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి నిహారిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలకు చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే సమాజంలో నేరాలను అరికట్టడం సాధ్యమవుతుందని, తద్వారా నేర రహిత సమాజ నిర్మాణానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను ప్రజలకు వివరించారు. సైబర్ నేరాలు, మోటార్ వాహనాల చట్టం, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేని అర్హులైన వారికి సంస్థ తరఫున ఉచితంగా న్యాయవాదిని నియమించి న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు, న్యాయ సహాయం అవసరమైనప్పుడు 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సేవలను పొందవచ్చని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, విద్యార్థులకు ఉన్న న్యాయపరమైన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ ఆర్య, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సర్వే నిర్వహించే తేదీ, సమయాన్ని పట్టాదారులకు తెలియజేయాలి

- దేపల్లి గ్రామంలో భూ రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన
- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 12:

మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం దేపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి జె.ఎల్.బి. హరిప్రియ సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో భూ రీసర్వే పనుల పురోగతిని సమీక్షించారు. పట్టా వ్యవసాయ భూములు, ప్రభుత్వ భూములు, ఇతర భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఇప్పటికే ఉన్న రెవెన్యూ రికార్డులను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి భూముల విస్తీర్ణాలు, సరిహద్దులను తనిఖీ చేశారు. సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణాలు, భూముల వర్గీకరణ వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం రైతులతో మాట్లాడి భూ రీసర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు. రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. రీసర్వే నిర్వహించే తేదీ, సమయాన్ని ముందుగానే పట్టాదారులకు తెలియజేయాలని, సర్వే సమయంలో వారు తమ తాజా భూ రికార్డులతో అందుబాటులో ఉండేలా చూడాలని సర్వే బృందానికి సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం



సంబంధిత పట్టాదారులకు వారి భూముల తుది సర్వే విస్తీర్ణాలను తెలియజేయాలని ఆదేశించారు.రైతులతో సమన్వయం చేసుకుంటూ, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి భూ రీసర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, ఖచ్చితత్వంతో నిర్వహించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలకు ఆస్కారం లేకుండా సర్వే పనులను పకడ్బందీగా, నిర్ణీత పద్ధతిలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా సర్వే మరియు భూ రికార్డుల సహాయ సంచాలకులు అశోక్, నవాబుపేట తహసీల్దార్ సురేష్, .డిప్యూటీ తహశీల్దార్ సువర్ణ,డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే మూసా,మండల సర్వేయర్ అహ్మద్, సంబంధిత సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహనకు వ్యాసరచన, క్విజ్ పోటీలు



నిర్మల్ నవంబర్ 12 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

విద్యార్థులు, యువ ఓటర్లలో ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించేందుకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ఆధ్వర్యంలో 009-నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్మల్ ఆర్డీవో, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి దేవిదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు పాల్గొనాలని, విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలు నవంబర్ 13న ఉదయం 11 గంటలకు నిర్మల్‌లోని భాగ్యనగర్ నారాయణ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు, పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎంపికైన విద్యార్థులను సకాలంలో పంపించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వందేళ్ల చరిత్ర నేలమట్టం..
ఆదేశాలిచ్చింది ఎవరు?

అర్ధరాత్రి కమాన్ కూల్చివేత స్పష్టత ఇవ్వాలి - బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తబ్రోజ్ ఖాన్



వందేళ్ల ఘన చరిత్రకు సజీవ సాక్ష్యం ఈ కమాన్



కమాన్ లేక బోసిపోయిన రహదారి

పెద్దపల్లి,నవంబర్ 12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన పెద్దపల్లి కమాన్‌ను ఎవరి ఆదేశాలతో,ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రాత్రికి రాత్రే తొలగించారని బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తబ్రోజ్ ఖాన్ మున్సిపల్ పాలకవర్గాన్ని,కమిషనర్‌ను ప్రశ్నించారు.గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ,అభివృద్ధి పనులను పగటిపూట పారదర్శకంగా చేయాలి తప్ప,రాత్రిపూట కూల్చివేతలు జరపడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని అన్నారు.ట్రాఫిక్ సమస్య దృష్ట్యా కమాన్‌ను తొలగించాల్సి వస్తే,ముందుగా పట్టణ ప్రముఖులు,అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించి ఉండాల్సిందని తబ్రోజ్ ఖాన్ అభిప్రాయపడ్డారు.కమాన్ పునర్నిర్మాణం చేపడతారా చేపడితే దానికి ఎంత నిధులు మంజూరయ్యాయి,దాని రూపకల్పన ఎలా ఉండబోతోందో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తాము అభివృద్ధికి ఎప్పుడూ అడ్డుపడమని,కానీ అభివృద్ధి పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు.దసరా,దీపావళి పండుగల సమయంలో జెండా వద్ద డ్రైనేజీ పనులు మొదలుపెట్టి, 25 రోజులు గడుస్తున్నా పూర్తి చేయకుండా వదిలేయడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.దీనివల్ల పండుగ పూట పూలు,దీపాలు అమ్ముకునే చిన్న వ్యాపారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు.ఏదైనా అభివృద్ధి పని చేపట్టే ముందు స్పష్టమైన ప్రణాళిక,కాలపరిమితిని ప్రకటించాలని కోరారు.కమాన్ కూల్చివేత, నూతన నిర్మాణ నిధుల వివరాలపై మున్సిపల్ కమిషనర్ వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి స్పష్టత ఇవ్వాలని తబ్రోజ్ ఖాన్ ఖాన్ డిమాండ్ చేశారు.

నేరాల నియంత్రణ కోసం పోలీస్ కార్డన్ అండ్ సర్చ్...

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి,నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి: ఎస్సై ప్రశాంత్



బెల్లంపల్లి, నవంబర్ 12, (ప్రజాకలం) ప్రతినిధి.. బెల్లంపల్లి మండలం తాళ్లగురిజల పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళ్లగురిజాల లో ఏసిపి ఉత్తర్వుల మేరకు ఎస్సై ప్రశాంత్ పర్యవేక్షణలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రసాద్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని,సైబర్ నేరాలు, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, డ్రంక్ అండ్ డ్రైవ్,ఆస్తి సంబంధిత నేరాలు, మహిళలపై జరిగే నేరాలు, వ్యక్తులపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పించామన్నారు.యువత, విద్యార్థులకు వారి భవిష్యత్తును మెరుగుపరుచుకునేలా విలువైన సూచనలు తెలిపామన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని ముపై ద్విచక్ర వాహనాలను,తొమ్మిది ఆటోలు,టాటా ఏసి ఆటో-రిక్షాలు మూడు స్వాధీనం చేసుకున్నట్లు వివరాలను వెల్లడించారు.ఈ కార్యక్రమంలో తాళ్ల గురజాల పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించేందుకు చర్యలు : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ నవంబర్ 12 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించడంతో పాటు, లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సోన్ మండలం సంగెంపేట్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు అవసరమైన అన్ని సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలని, తద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ వివిజి రామ్ జీ పథకం ద్వారా ఉపాధి పనులు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, హౌసింగ్ డీఈ గంగాధర్, సర్పంచ్ విలాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దివ్యాంగులకు స్వయం ఉపాధిపై శిక్షణ

- ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రత్యేక కార్యక్రమం - సర్పంచ్ సృజన కృష్ణ



పాలేరు నవంబర్ 12(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం మండలం మండల పరిధిలోని పల్లెగూడెం గ్రామపంచాయతీ కార్యాలయ భవనంలో మండలానికి చెందిన మహిళా దివ్యాంగులకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఆర్‌డీఎస్ - ఎనేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వయం ఉపాధి, వ్యాపార అభివృద్ధి, నైపుణ్య శిక్షణపై అవగాహన కల్పించి పలు మార్గదర్శక సూచనలు అందించారు. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధి గద్దం రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ సృజన కృష్ణ మాట్లాడుతూ మండలంలోని మహిళా దివ్యాంగులందరూ ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. వారి అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, వారు ఆర్థికంగా బలోపేతం కావడానికి అవసరమైన కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ కార్యదర్శి నర్మద మాట్లాడుతూ దివ్యాంగ మహిళలకు సొంతంగా వ్యాపారాలు నిర్వహించుకునేలా నైపుణ్య శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. తద్వారా వారు ఇతరులపై ఆధారపడకుండా స్వయంగా ఉపాధి పొందుతూ తమ కాళ్లపై తాము నిలబడే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని మహిళా దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్ఆర్‌డీఎస్ గ్రూప్ ఆఫీసర్ ప్రతాప్ మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధి నైపుణ్యాలపై పది రోజుల పాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం పాల్గొన్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన సుమారు 45 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. ఐకేపీ వీవోఏలు విజయకుమారి, శ్రీదేవి, ఎనేబుల్ కమిటీ ప్రతినిధులు, సంస్థ సభ్యులు, దివ్యాంగ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి

- ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి
- టీడీపీ నేత టైగర్ రమేష్ కొప్పుల



నాగర్‌కర్నూల్ నవంబర్ 12 (ప్రజా కలం): కొల్లాపూర్ ఎక్స్ రోడ్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని వసతులతో కూడిన బస్ షెల్టర్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి, అడాక్ కమిటీ సభ్యుడు టైగర్ రమేష్ కొప్పుల డిమాండ్ చేశారు.ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ కూడలి వద్ద బస్సుల కోసం ఎదురుచూస్తుంటారని తెలిపారు. అయితే బస్ షెల్టర్ లేకపోవడంతో ఎండ, వాన, చలిలో నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ఆసుపత్రులు, దేవాలయాలకు వెళ్లే ప్రజలకు కొల్లాపూర్ ఎక్స్ రోడ్ ప్రధాన రవాణా కూడలిగా ఉందని, ఇంతటి రద్దీ ప్రాంతంలో బస్ షెల్టర్ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.ప్రయాణికుల సౌకర్యార్థం నీడ, కూర్చునేందుకు బెంచీలు, తాగునీరు, లైటింగ్ వంటి వసతులు కల్పించాలని కోరారు. బస్సులు నిలిచేందుకు అనువైన స్థలాన్ని గుర్తించి బస్‌స్టాప్‌తో పాటు అన్ని సౌకర్యాలతో కూడిన బస్ షెల్టర్ నిర్మించాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ, సుబ్బారెడ్డి, దివాకర్ నాయుడు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ శంకుస్థాపనకు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆహ్వానం

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 12: మహబూబ్‌నగర్ నగరంలోని శ్రీ చంద్ర కాలనీ, ఏనుగొండలో నిర్మించనున్న శ్రీ శ్రీ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ ఆలయ నిర్వాహకులు గౌరవ ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆయనకు తెలియజేశారు.

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాల 25వ గ్రాడ్యుయేషన్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు
- చదువుకున్న కళాశాలకు, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 12:

విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తిచేసుకుని వృత్తి జీవితంలోకి అడుగుపెడుతున్న సమయంలో తమ భవిష్యత్తుకు సంబంధించిన ప్రతి నిర్ణయాన్ని ఎంతో ఆలోచించి, ఆచితూచి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. యువత తీసుకునే నిర్ణయాలే వారి భవిష్యత్తు జీవితానికి బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన 25వ గ్రాడ్యుయేషన్ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో కళాశాల అందించిన క్రమశిక్షణ, విజ్ఞానం, నైపుణ్యాలను జీవితంలో ఆచరణలో పెట్టాలని సూచించారు. కళాశాల వాతావరణం నుంచి బయటకు వచ్చి వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెట్టిన తర్వాత ఉద్యోగ, వ్యాపార రంగాల్లో వ్యక్తుల సామర్థ్యం, పనితీరు, ఫలితాలే వారి ప్రతిభకు కొలమానాలుగా నిలుస్తాయని తెలిపారు. కొత్త వాతావరణానికి అలవాటు పడేందుకు కొంత సమయం పట్టినా, ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

వచ్చే పదేళ్లు జీవితానికి కీలకం

ప్రస్తుతం పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు 23 నుంచి 26 ఏళ్ల వయస్సులో ఉన్నారని, ఈ దశలో తీసుకునే నిర్ణయాలు వారి రాబోయే జీవితంపై ఎంతో ప్రభావం చూపుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా వచ్చే పదేళ్లు వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అత్యంత కీలకమని అన్నారు. ఇతరుల ఒత్తిడికి, తాత్కాలిక భావోద్వేగాలకు లోనై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. జీవితంలో ముఖ్యమైన



నిర్ణయాలు తీసుకునే ముందు తల్లిదండ్రులు, గురువులు, శ్రేయోభిలాషుల సలహాలు తీసుకుని, సరైన అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు. చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధనపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాలలో విద్యనభ్యసించిన పలువురు పూర్వ విద్యార్థులు నేడు దేశ, విదేశాల్లోని ప్రముఖ ఫార్మాస్యూటికల్ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతుండటం గర్వకారణమని కలెక్టర్ అభినందించారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం పట్టాలు అందుకున్న విద్యార్థులు కూడా తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తాము చదువుకున్న కళాశాలకు, మహబూబ్‌నగర్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి, భారతదేశానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.అనంతరం బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఫార్మ్ – డి పూర్తిచేసుకున్న 90 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. మంగీలాల్, కార్యదర్శి పద్మలత, చైర్మన్ డాక్టర్ పి. బాలరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో పరుమాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం!



గద్వాల ప్రతినిధి, నవంబర్ 12 (ప్రజా కలం):

జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరుమాల గ్రామంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో గురువారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ సంధ్య అంజి ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ నాగరాజ్, గ్రామ పెద్దలు, పాస్టర్ సమక్షంలో బేతనీయ చర్చి నిర్మాణం, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం పనుల ప్రారంభానికి మార్కింగ్ చేపట్టారు.అలాగే గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులతో పాటు మహిళా సమైక్య భవనం, రైతు గోదాము నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.


మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు బ్రిలియంట్ విద్యాసంస్థల ఏర్పాట్లు!

చిల్డ్రన్స్ డే సందర్భంగా జీకే, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

ప్రజాకలం ప్రతినిధి బూర్గంపహాడ్, నవంబర్ 12 చిల్డ్రన్స్ డే సందర్భంగా సారపాకలోని బ్రిలియంట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు రాష్ట్రస్థాయి గురుబ్రహ్మ అవార్డు గ్రహీత డాక్టర్ బి.ఎన్.ఆర్. ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జీకే (జనరల్ నాలెడ్జ్), వ్యాసరచన, డ్రాయింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలు జూనియర్, సీనియర్ విభాగాల్లో ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 9:30 గంటలకు ఓఎంఆర్ షీట్ విధానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో జనరల్ నాలెడ్జ్ పెంపొందించడంతో పాటు పోటీ తత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే ఈ టాలెంట్ టెస్ట్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బూర్గంపహాడ్ మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు పోటీలకు ఒక రోజు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని డాక్టర్ బి.ఎన్.ఆర్. కోరారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 98662 83566, 97051 37128.



సైబర్ వలలో లక్ష రూపాయలు మాయం!



గద్వాల ప్రతినిధి, నవంబర్ 12 (ప్రజా కలం):

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని పెద్ద తండా గ్రామానికి చెందిన సురేష్ నాయక్ సైబర్ మోసానికి గురై లక్ష రూపాయలు పోగొట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సురేష్ నాయక్ గత ఆరు సంవత్సరాలుగా హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కష్టపడి సంపాదించిన డబ్బును బ్యాంకు ఖాతాలో దాచుకున్నారు. అయితే సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకోవడంతో ఆయన బ్యాంకు ఖాతా నుంచి లక్ష రూపాయలు మాయమైనట్లు బాధితుడు తెలిపారు. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి సంపాదించిన డబ్బు ఒక్కసారిగా పోవడంతో సురేష్ నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, పోగొట్టుకున్న డబ్బును తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నారు. ప్రజలకు విజ్ఞప్తి: గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులను క్లిక్ చేయవద్దు. బ్యాంకు వివరాలు, ఓటీపీ, పిన్ నంబర్లను ఎవరికీ చెప్పవద్దు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయండి.

విద్యావంతుల తరపున ప్రశ్నించే గొంతుకనవుతా

సమాజంలో మార్పు తేవాలన్న సంకల్పంతో పనిచేస్తా - బీసీ బిడ్డను, ఉద్యమకారున్ని, విద్యావంతులరా అండగా నిలవండి
హైదరాబాద్- మహబూబ్ నగర్- రంగారెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టీఆర్ఎస్ అభ్యర్థి ఆకాశ్ కొల్లూరి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 12:

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యావంతుల తరపున ప్రశ్నించే గొంతుకనవుతానని టీఆర్ఎస్ అభ్యర్థి ఆకాశ్ కొల్లూరి చెప్పారు. హైదరాబాద్- మహబూబ్ నగర్- రంగారెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మహబూబ్ నగర్ లో స్థానిక నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీలు, చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాలన్న మంచి ఉద్దేశంతో తనకు టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత గారు అవకాశం కల్పించారన్నారు. తనలాంటి కొత్త వారిని ప్రోత్సహించి గెలిపించాలని విద్యావంతులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఉస్మానియా యూనివర్సిటీలో చదివిన తాను నేషనల్ మీడియాలో జర్నలిస్టుగా ఎన్నో స్టింగ్ ఆపరేషన్లు నిర్వహించానని చెప్పారు. సమాజానికి ఏదీ అవసరమో దాని కోసం ఎలా పనిచేయాలో తనకు తెలుసని అన్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలుగా గెలిచిన అభ్యర్థులెవరు విద్యావంతులకు మంచి చేయలేదన్నారు. బీఆర్ఎస్ నుంచి ఇదివరకు గెలిచిన ఎమ్మెల్సీ సురభి వాణిదేవి గారు తన మొత్తం పదవీకాలంలో ఒక్కసారి కూడా మహబూబ్ నగర్ వెళ్లకపోవటం ఆశ్చర్యం కలిగించిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లు అధికారంలో ఉండి యూత్ ను, మహిళలను అన్ని వర్గాలను మోసం చేశాయని చెప్పారు. 2 కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన బీజేపీ సైతం మాట నిలబెట్టుకోలేదన్నారు. ఆయా పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన సమయమిదని.. ఎమ్మెల్సీ ఎన్నికలను అవకాశాన్ని వినియోగించుకోని వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తాను గెలిస్తే ప్రతిరోజు ఒక నియోజకవర్గంలో ప్రజలతో ఉంటానని అన్నారు. యువతరం ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తానని చెప్పారు.

సామాజిక తెలంగాణ కు తొలి అడుగు– డాక్టర్ రఘులి

సామాజిక తెలంగాణ సాధనలో భాగంగా రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు తమ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత బీసీలకే ఇచ్చారని ఎమ్మెల్సీ ఎన్నికల ఇంఛార్జ్ డాక్టర్ రఘు చెప్పారు. సామాజిక తెలంగాణ సాధనలో ఇది తొలి అడుగని చెప్పారు. కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన తమ పార్టీ అభ్యర్థి ఆకాశ్ కొల్లూరిని గెలిపించాలని ఆయన కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ లు కాంగ్రెస్ రాష్ట్రాన్ని ఆగం చేశాయని చెప్పారు. బీజేపీ ఉండి కూడా తెలంగాణ సమాజానికి ప్రయోజనం లేదన్నారు. ప్రశ్నించి, పోరాడి, పరిష్కారం చూపే టీఆర్ఎస్ అభ్యర్థినే ఈ ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ లకు బుద్ధి చెప్పాలి– గొంగళ్ల రంజిత్ కుమార్

సమాజంలో మార్పు తేవాలన్న బలమైన సంకల్పం కలిగిన చదువుకున్న యువకుడు, టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆకాశ్ కొల్లూరిని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని మహబూబ్ నగర్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ కోరారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఇది వరకు గెలిచిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు విద్యావంతులకు చేసిందేమీ లేదన్నారు. కనీసం సభలో వారి గొంతుకగా కూడా మాట్లాడలేదని మండిపడ్డారు. ప్రశ్నించే వారుంటునే సమస్యలు పరిష్కారమవుతాయని, తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే విద్యావంతుల గొంతుకగా సభలో ప్రశ్నిస్తాడని ఆయన చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పేందుకు ఈ ఎన్నికలను విద్యావంతులు అవకాశంగా మలుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహబూబ్ నగర్ నియోజకవర్గ ఇంఛార్జ్ సౌజన్య రెడ్డి సహా పలువురు టీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు.

విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం

- ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం, వృత్తి విద్యా మార్గదర్శక శిక్షణ



తానూర్, నవంబర్ 12(ప్రజా కలం): విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు భవిష్యత్తు విద్యా, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ప్రాంతం 19 ఆధ్వర్యంలో గురువారం తానూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు వాడేకర్ లక్ష్మణ్, అనిల్ దుగ్గే పాల్గొని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, జీవిత నైపుణ్యాలు, వృత్తి విద్యా అవకాశాలపై మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా వాడేకర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ, సామర్థ్యం దాగి ఉంటాయని, వాటిని గుర్తించి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. అపజయాలకు భయపడకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలిపారు. పదో తరగతి అనంతరం ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ తదితర కోర్సులతో పాటు వివిధ పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. విద్యార్థులు తమ ఆసక్తులు, అభిరుచులు, సామర్థ్యాలకు అనుగుణంగా భవిష్యత్తు విద్యా మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. అనిల్ దుగ్గే మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, సంభాషణా నైపుణ్యాలు, బృంద స్ఫూర్తి, సమస్యలను పరిష్కరించుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. క్రమశిక్షణ, సమయపాలన, ఏకాగ్రతతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానో పాధ్యాయులు సాయిబాబా సహకారం అందించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని శిక్షకుల నుంచి పలు అంశాలపై అవగాహన పొందారు.

రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలి

ప్రభుత్వ నిర్లక్ష్యంపై జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆగ్రహం



తల్లాడ, నవంబర్ 12 (ప్రజా కలం న్యూస్): భారతీయ జనతా పార్టీ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తల్లాడ మండలంలోని గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో మురసు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటలను జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు తదితర నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి ఎకరాకు పెట్టిన పెట్టుబడి, పంట నష్టం, ఆశించిన దిగుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గారితో ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు. దీనిపై స్పందించిన వ్యవసాయ అధికారి గ్రామానికి అధికారులను పంపించి పంట నష్టాన్ని అంచనా వేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులను అప్రమత్తం చేయడంలో, పంటలను కాపాడడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు తీవ్రంగా నష్టపోయి ఆందోళనలో ఉంటే ప్రభుత్వం మాత్రం రాజకీయాలకే పరిమితమైందని మండిపడ్డారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేసి ఉంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ఎంతో కొంత భరోసా లభించేదని, కానీ రైతులకు ఉపయోగపడే పంటల బీమాను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతుల పంట పొలాలను పరిశీలించి వారి సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రశ్నించారు. రైతుల కష్టాలను గాలికి వదిలేసి ప్రభుత్వం గాలిమేడలు కట్టడం తప్ప చేసిందేమీ లేదని తీవ్రంగా విమర్శించారు. భారతీయ జనతా పార్టీ తరపున ప్రభుత్వానికి ప్రధానంగా ఈ డిమాండ్లు చేస్తున్నాం.

రైతులకు తక్షణ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కేవలం హామీలతో కాలయాపన చేయకుండా నష్టపరిహారాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ అండగా నిలిచి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ తల్లాడ మండల అధ్యక్షులు చల్లా నాగులు, పాలేరు ఇన్చార్జి నాయకులు నున్న రవి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నరుకుళ్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆపతి వెంకట రామారావు, నాయకులు నన్నపనేని శారద, గాద కృష్ణారావు చీద నరసింహారావు రాయల రమేష్ వాడవల్లి నాగేశ్వరరావు మరుసకట్ల బాబురావు చిన్న బసివి రెడ్డి సత్యనారాయణ రెడ్డి గొల్లమందల నరేష్ మీగడ గోపాలరావు, కుమిలి శ్రీనివాసరావు, చింత నిప్పు రామారావు , గ్రామ రైతులు బొగ్గుల పుల్లారెడ్డి, బొగ్గుల వెంకటరెడ్డి, విలాసాగరం రామకృష్ణ, విలాసాగరం సత్యనారాయణ, బొగ్గుల పెద్ద పుల్లారెడ్డి, కొరకొప్పుల లక్ష్మణ్, చల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

దేవరకద్ర నియోజకవర్గంలోని పలు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో చర్చ
దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్)

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 12: తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా తో దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి(జిఎంఆర్) చర్చించారు ఈ సందర్భంగా దేవరకద్ర పట్టణంలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించాలని, స్టేడియం నిర్మాణం కోసం అదనంగా 3 ఎకరాల 30 గుంటల భూమిని కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు.అలాగే చిన్నచింతకుంట జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి సంబంధించిన అంశాలను చర్చించారు. భూత్పూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాబోయే రోజుల్లో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు.



ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సానుకూలంగా స్పందించారు.

రాజ్ కమల్ ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

ఇలాంటి ప్రాణ నష్టం జరగలేదు లేదు



(నందిగామ నవంబర్ 12 ప్రజా కలం ప్రతినిధి)

రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రసమీపంలో రాజ్ కమల్ ప్లాస్టిక్ ఇండస్ట్రీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిశ్రమలో పని చేస్తున్న వర్కర్లు తీవ్ర భయాందోళన గురయారు.ప్లాస్టిక్ పరిశ్రమ కావడంతో మంటలు క్షణాల్లోనే భారీగా వ్యాపించాయి. దట్టమైన నల్లటి పొగ పరిసర ప్రాంతాలు వ్యాపించి స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేసాయిమంటలు, పొగ చూసి చుట్టుపక్కల పారిశ్రామిక కార్మికులు భయంతో బయటకు పరుగులు తీశారు. తక్షణమే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా హుటా హుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం తెలియాల్సి ఉంది.

ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యం..

- మురుగు కాలువల శుభ్రతపై సర్పంచ్ దృష్టి

- సర్పంచ్ పి. వినోద్ కుమార్



గద్వాల ప్రతినిధి, నవంబర్ 12 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల పరిధిలోని ఎల్కూర్ గ్రామంలో ప్రజల ఫిర్యాదుపై గ్రామ సర్పంచ్ పి. వినోద్ కుమార్ వెంటనే స్పందించి పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని మురుగు కాలువల పరిసరాల్లో దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామపంచాయతీ కార్యదర్శి సుభావతికి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని కార్యదర్శి సుభావతి సర్పంచ్ పి. వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తక్షణమే స్పందించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని జేసీబీ యంత్రం సహాయంతో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికను తొలగించి శుభ్రపరిచే పనులు చేపట్టారు.గ్రామంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటూ, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన సర్పంచ్ పి. వినోద్ కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఆసియా పారా గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించిన దీప్తి

జీవంజికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘన సన్మానం



(వరంగల్/పర్వతగిరి)నవంబర్ 12, ప్రజాకలం ప్రతినిధి: జపాన్‌లో ఇటీవల నిర్వహించిన ఆసియా పారా గేమ్స్-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ ముద్దుబిడ్డ, వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన పారా అథ్లెట్ దీప్తి జీవంజిని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు ఘనంగా సన్మానించి అభినందించారు. హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దీప్తి జీవంజిని శాలువాలతో సత్కరించి, ఆమె సాధించిన అద్భుత విజయానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జపాన్‌లో జరిగిన ఆసియా పారా గేమ్స్--2026లో మహిళల 400 మీటర్ల టీ20 విభాగంలో దీప్తి జీవంజి కేవలం 56.36 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుని స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడంతో పాటు తన ప్రతిభతో రికార్డు సృష్టించడం ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై తెలంగాణ రాష్ట్రం పేరును మారుమోగించి, భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన దీప్తి జీవంజి విజయం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు మాట్లాడుతూ.. క్రీడల్లో విజయం సాధించాలంటే పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఎంతో అవసరమని, ఈ లక్షణాలకు దీప్తి జీవంజి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ తన అసాధారణ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగి స్వర్ణ పతకం సాధించడం అభినందనీయమని తెలిపారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అసాధ్యమనుకున్న లక్ష్యాలను సైతం సాధించవచ్చని దీప్తి తన విజయంతో నిరూపించారని పేర్కొన్నారు. దీప్తి సాధించిన ఈ విజయం కేవలం ఒక పతకానికే పరిమితం కాదని, ఎందరో యువతీ యువకులకు, ముఖ్యంగా పారా క్రీడాకారులకు కొత్త ఆశలు, ఆత్మవిశ్వాసాన్ని అందించే గొప్ప విజయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల్లోనూ అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, వారికి సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధించగలరని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన దీప్తి జీవంజి అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించడం నియోజకవర్గ ప్రజలందరికీ గర్వకారణమని, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఎల్లప్పుడూ తన ప్రోత్సాహం, సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం దీప్తి జీవంజిని మరోసారి అభినందిస్తూ, రాబోయే అంతర్జాతీయ పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి క్రీడాకారిణికి రావాల్సిన బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దీప్తి జీవంజిని తల్లిదండ్రులు ధనమ్మ యాదగిరిలు పాల్గొన్నారు.

వంద మంది 'వద్దు' అని చెప్పేంత వరకు!

చిన్న సంఘటనే... కానీ జీవితానికి ఎంతో గొప్ప పాఠం!

నేను కొన్ని సరుకులు కొనుగోలు చేయడానికి ఒక సూపర్ మార్కెట్‌కు వెళ్లాను. బయట విపరీతమైన చలి ఉంది. స్టోర్ ప్రవేశ ద్వారం వద్ద సుమారు ఐదేళ్ల వయసున్న ఒక చిన్న బాలుడు నిలబడి ఉన్నాడు. అతని చేతిలో కొన్ని బిస్కెట్ ప్యాకెట్లు ఉన్నాయి. మెడలో ఒక చిన్న బోర్డు వేలాడుతోంది. పిల్లల చేతిరాతతో వంకరటింకరగా దానిపై ఇలా రాసి ఉంది:

"స్కూట్ ఛారిటీ కోసం ఒక బిస్కెట్ ప్యాకెట్ కొనండి – కేవలం ఇరవై రూపాయలు మాత్రమే!"



ప్రజలు అతన్ని దాటుకుంటూ వెళుతున్నారు. కొందరు తొందరలో ఉన్నారు. మరికొందరు ఫోన్లలో మాట్లాడుకుంటూ వెళుతున్నారు. ఇంకొందరు అతన్ని చూసినా పట్టించుకోకుండా ముందుకు సాగుతున్నారు. కానీ ఆ చిన్నారి మాత్రం ప్రతి ఒక్కరి దగ్గరకు వెళ్లి, అమాయకంగా వారి ముఖంలోకి చూస్తూ, "మీరు ఒక ప్యాకెట్ కొంటారా?" అని అడుగుతున్నాడు.

కొందరు ప్యాకెట్లు కొన్నారు. చాలా మంది చిరునవ్వుతో "వద్దు బాబూ!" అంటూ తిరస్కరించారు.

ఇన్ని తిరస్కరణలు ఎదురైన తర్వాత ఆ చిన్నారి బాధపడతాడని, కనీసం ఏడుస్తాడని నేను భావించాను. కానీ ఆశ్చర్యం! ప్రతి 'వద్దు' అనే సమాధానం తర్వాత కూడా అతను చిరునవ్వుతో తల ఊపుతూ మరో వ్యక్తి దగ్గరకు వెళ్లసాగాడు.

అతని ముఖంలో సిగ్గు లేదు. భయం లేదు. నిరాశ అసలే లేదు. ఉన్నదల్లా అద్భుతమైన ఆత్మవిశ్వాసం!

ఇది చూసి నేను కూడా ఆగలేక అతని దగ్గర ఒక ప్యాకెట్ కొనుగోలు చేశాను. ఆ చిన్నారి కళ్లు ఆనందంతో మెరిసిపోయాయి. "మీకు చాలా ధన్యవాదాలు!" అంటూ ఎంతో సంతోషంగా చెప్పాడు.

అప్పుడు నేను అతన్ని ప్రేమగా అడిగాను:

"బాబూ! ఇంత చలిలో ఇంకా ఎన్ని ప్యాకెట్లు అమ్మాలి?"

అందుకు "వంద మంది 'వద్దు' అని చెప్పేంత వరకు!" అని ఆ చిన్నారి ఇచ్చిన సమాధానం నన్ను ఆశ్చర్యపరిచింది.

మా సంభాషణను సమీపం నుంచి గమనిస్తున్న అతని తల్లి దగ్గరకు వచ్చి "మా ఉద్దేశం కేవలం బిస్కెట్ ప్యాకెట్లు అమ్మించడం కాదు. చిన్న వయసులోనే పిల్లలకు 'వద్దు' అనే మాటను ఎలా స్వీకరించాలో నేర్పించడమే మా అసలు లక్ష్యం. ఎవరైనా తిరస్కరించినప్పుడు కుంగిపోకుండా, మళ్లీ చిరునవ్వుతో ప్రయత్నించే అలవాటును వారికి నేర్పిస్తున్నాం!" అని చిరునవ్వుతో వివరించారు.

ఆ మాటలు విన్న నేను కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాను. ఎంత గొప్ప ఆలోచన! ఎంత అద్భుతమైన జీవిత పాఠం!

మనం పిల్లలకు ఏం నేర్పిస్తున్నాం?

మన పిల్లలకు సాధారణంగా "బాగా చదువుకో... మంచి మార్కులు తెచ్చుకో... మొదటి ర్యాంకు సాధించు... పోటీలో గెలువు... అందరికంటే ముందుండాలి!" అని చెబుతుంటాం. అంటే పిల్లలకు ఎలా గెలవాలో నేర్పిస్తున్నాం. కానీ ఓటమిని ఎలా స్వీకరించాలో, తిరస్కరణను ఎలా ఎదుర్కోవాలో నేర్పించడం మర్చిపోతున్నాం.

విజయానికి దారులు చూపిస్తున్నాం. కానీ వైఫల్యాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని అందించలేకపోతున్నాం.

నిజానికి జీవితంలో పిల్లలకు అన్నింటికంటే ఎక్కువగా అవసరమయ్యేది ఆ ధైర్యమే!

ఎందుకంటే జీవితం ప్రతిసారీ మనకు "అవును" అని చెప్పదు.

కొన్ని పరీక్షల్లో అపజయం ఎదురవుతుంది.

కొన్ని ఉద్యోగ ఇంటర్వ్యూలలో తిరస్కరణ ఎదురవుతుంది.

కొన్ని వ్యాపార ప్రయత్నాలు విఫలమవుతాయి.

కొన్ని సంబంధాలు మధ్యలోనే ముగిసిపోతాయి.

మరికొన్ని కలలు నెరవేరడానికి సంవత్సరాలు పట్టవచ్చు.

అలాంటి సందర్భాల్లో ఎదురయ్యే "కాదు" అనే సమాధానం మనల్ని కుంగదీయవచ్చు. లేదా మరింత బలవంతులుగా తీర్చిదిద్దవచ్చు. ఆ "కాదు"ను శత్రువుగా భావిస్తున్నామా? లేక మనల్ని మరింత బలంగా మార్చే జీవిత పాఠంగా స్వీకరిస్తున్నామా? అన్నదానిపైనే మన ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. ఓటమిని ఎదుర్కొనే ధైర్యమే అసలైన విజయం!

ఆ ఐదేళ్ల బాలుడు అక్కడ కేవలం బిస్కెట్ ప్యాకెట్లు అమ్మడం లేదు. ప్రతి తిరస్కరణను ఒక అనుభవంగా స్వీకరిస్తున్నాడు. "కాదు" అనే సమాధానానికి భయపడకుండా ముందుకు సాగడం నేర్చుకుంటున్నాడు. మళ్లీ మళ్లీ ప్రయత్నించే పట్టుదలను అలవర్చు కుంటున్నాడు. జీవితంలో ఎదురయ్యే అతి పెద్ద పరీక్షకు సిద్ధమవుతున్నాడు. ఆ పరీక్ష పేరు – "కిందపడినాతిరిగి లేచి నిలబడగలగడం!"

ఒక్కసారిమనల్ని మనం ప్రశ్నించుకుందాం. మన బిడ్డ అనుకున్న ర్యాంకు సాధించకపోతే లేదా ఏదైనా పరీక్షలో విఫలమైతే మనం ఎలా స్పందిస్తున్నాం? కొన్నిసార్లు తిడుతున్నాం. ఇతర పిల్లలతో పోలుస్తున్నాం. వారి ఓటమిని మన అవమానంగా భావిస్తున్నాం. "నీ వల్ల కాదు!" "నువ్వు పనికిరావు!"

"అందరూ సాధించారు... నువ్వెందుకు సాధించలేకపోయావు?" అంటూ మనకు తెలియకుండానే వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాం. ఓటమితో బాధపడుతున్న బిడ్డకు మన మాటలతో మరో ఓటమిని పరిచయం చేస్తున్నాం! కానీ ఆ బాలుడి తల్లి చేసింది అందుకు పూర్తి భిన్నం. తిరస్కరణను భయపడకుండా ఎదుర్కోవడం, "కాదు" అనే సమాధానం తర్వాత కూడా చిరునవ్వుతో నిలబడటం, మళ్లీ ప్రయత్నించే ధైర్యాన్ని పెంపొందించుకోవడం నేర్పించింది. ఇది నిజంగా ప్రతి తల్లిదండ్రి ఆలోచించాల్సిన గొప్ప విషయం.

ఎందుకంటే విజయం మనకు ఆనందాన్ని ఇస్తుంది.

కానీ ఓటమిని ఎదుర్కోవడం నేర్చుకోవడమే జీవితంలో ఎలాంటి పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని ఇస్తుంది.

పిల్లలకు కావాల్సింది మార్కులు కాదు... మనోధైర్యం!

ఈ రోజు నుంచి మన పిల్లలను కేవలం "ఎన్ని మార్కులు వచ్చాయి?", "ర్యాంకు ఎంత?", "గెలిచావా?" అని మాత్రమే అడగకుండా, వారి ప్రయత్నాన్ని కూడా అభినందిద్దాం.

పిల్లలకు ఇలా భరోసా ఇద్దాం:

"నీకు ఎన్ని మార్కులు వచ్చాయన్నదానికంటే, నువ్వు ఎంత ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొంటున్నావన్నదే మాకు ముఖ్యం. ఒక్క పరీక్షలో విఫలమైనంత మాత్రాన జీవితంలో ఓడిపోయినట్లు కాదు. దానికి ప్రత్యామ్నాయ మార్గాలు ఎన్నో ఉన్నాయి. ఏం జరిగినా మేము నీకు అండగా ఉంటాం!"

ఈ మాటలు పిల్లల్లో కలిగించే ఆత్మవిశ్వాసం అపారం.

గెలిచినప్పుడు మాత్రమే సంతోషించే పిల్లలను కాదు... ఓడిపోయినా ఆత్మవిశ్వాసం కోల్పోని పిల్లలను పెంచాలి. అపజయానికి భయపడకుండా, దాని నుంచి పాఠాలు నేర్చుకుని మళ్లీ ప్రయత్నించేలా ప్రోత్సహించాలి.ఎందుకంటే పిల్లలకు మనం ఇవ్వగలిగే గొప్ప బహుమతి ఎప్పుడూ గెలిచే అవకాశాలు కాదు. ఓడిపోయినా మళ్లీ ప్రయత్నించగలిగే ధైర్యం!

చివరిగా ఒక్క మాట... వంద మంది "వద్దు" అని చెప్పినా చిరునవ్వు చెదరని ఆ ఐదేళ్ల చిన్నారి మనందరికీ ఎంతో విలువైన జీవిత పాఠాన్ని నేర్పించాడు. జీవితంలో ఎదురయ్యే వందలాది "కాదు"లు మనలోని ధైర్యాన్ని చంపకూడదు. అవే మనల్ని జీవితంలోని అతిపెద్ద 'అవును' వైపు నడిపించాలి. ఆ చిన్నారికి ఇంత గొప్ప జీవిత పాఠాన్ని నేర్పిస్తున్న తల్లికి మనస్ఫూర్తిగా అభినందనలు! మన పిల్లలకు కావాల్సింది కేవలం విజయాలను పంచే తల్లిదండ్రులు కాదు... ఓటమిలోనూ తమను ప్రేమిస్తూ, ప్రతి పరిస్థితిలో అండగా నిలిచే తల్లిదండ్రులు! ఎందుకంటే జీవితంలో ఎప్పుడూ గెలవడం గొప్ప కాదు... ఓడిపోయినా ఓటమిని అధిగమించి మళ్లీ గెలిచే వరకు ప్రయత్నించడం అసలైన గొప్పతనం!

కైలాస్ నాగేష్, 9849052956

గాంధీ కుటుంబంలో మరణాలు యాదృచ్ఛికం కాదు


- సోనియా గాంధీపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్ర ఆరోపణలు

- సోనియాను 'మిస్టీరియస్ ఫారినర్' అంటూ అభివర్ణించిన కంగన

- గాంధీ కుటుంబంలో వరుస మరణాలపై అనుమానాలు వ్యక్తం చేసిన నటి

- సంజయ్ గాంధీ మరణం తర్వాత మేనకను సోనియా ఇంటి నుంచి పంపించేశారని ఆరోపణ

- 'ఎమర్జెన్సీ' సినిమా కోసం చేసిన పరిశోధనలో ఈ విషయాలు తెలిశాయన్న ఎంపీ



హైదరాబాద్ : బీజేపీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్.. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీపై సంచలన ఆరోపణలతో విరుచుకుపడ్డారు. సోనియా గాంధీ రాక తర్వాతే గాంధీ కుటుంబంలో వారసులంతా ఒక్కొక్కరిగా మరణించారని, ఇవన్నీ కేవలం యాదృచ్ఛిక సంఘటనలు కావని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. సోనియా గాంధీని 'అంతుచిక్కని విదేశీ వ్యక్తి' (మిస్టీరియస్ ఫారినర్) అని సంబోధిస్తూ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోనియా గాంధీ రాసిన ఆత్మకథ "బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్" ఇటీవల విడుదలైన నేపథ్యంలో దేశవ్యాప్తంగా రాజకీయ చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో కంగన తన 'ఎమర్జెన్సీ' సినిమా కోసం గాంధీ కుటుంబంపై లోతుగా పరిశోధన చేశానని, ఆ సమయంలో తనకు కొన్ని వింత విషయాలు తెలిశాయని పేర్కొన్నారు. ''గాంధీ కుటుంబంలోకి ఓ మిస్టీరియస్ ఫారినర్ ప్రవేశించాక, ఇందిరా గాంధీ, సంజయ్ గాంధీ, రాజీవ్ గాంధీ వంటి సింహాసనానికి అసలైన వారసులంతా హతమయ్యారు. చివరికి ఆ విదేశీ వ్యక్తే ఏకైక వారసురాలిగా మిగిలిపోయారు. ఇన్ని యాదృచ్ఛిక సంఘటనలు జరిగినా ప్రజలు ఎందుకు ఆలోచించలేదు?" అని కంగనా ప్రశ్నించారు. మరో పోస్టులో, సంజయ్ గాంధీ మరణం తర్వాత ఆయన భార్య మేనకా గాంధీని, వారి కుమారుడిని సోనియా గాంధీ ఇంటి నుంచి గెంటేశారని కంగన ఆరోపించారు. "సంజయ్ గాంధీ ప్రేమించి పెళ్లి చేసుకున్న మేనక, ఆయన మరణం తర్వాత దిక్కులేనిదైంది. చిన్న వయసులోనే వితంతువుగా మారిన ఆమెను, పసిబిడ్డతో సహా ఇంటి నుంచి బయటకు పంపించేశారు. మిగిలిన వారందరూ చనిపోవడానికి ముందే ఆమెను పక్కకు తప్పించడం ఎంత సౌకర్యంగా ఉంది!" అని కంగన వ్యాఖ్యానించారు. ఇటీవల విడుదలైన గాంధీ కుటుంబానికి చెందిన ఓ పాత వీడియోపైనా కంగనా స్పందించారు. ఆ వీడియోలో అందరూ సోనియా కనుసన్నల్లో ఉన్నట్లు కనిపించారని, భర్తను కోల్పోయిన మేనకా గాంధీ మాత్రం ఒంటరిగా, చిన్నబుచ్చుకుని ఉన్నారని ఆమె విశ్లేషించారు. విదేశాల్లోని ఓ కేఫ్‌లో రాజీవ్ గాంధీకి అనుకోకుండా పరిచయమై, అప్పటి నుంచి గాంధీ కుటుంబంలోకి వచ్చిన సోనియా.. ఆ తర్వాత దేశాన్ని దశాబ్దాల పాటు పాలించడంపై కంగన తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. కంగనా చేసిన ఈ ఆరోపణలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయికి గీతాంజలి విద్యార్థి ఎంపిక

కోకో పోటీల్లో ప్రతిభ చాటిన పదో తరగతి విద్యార్థి ఎస్. సాయి



నాగర్ కర్నూల్ నవంబర్ 12 (ప్రజాకలం) : స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి కోకో పోటీలకు నాగర్ కర్నూల్ పట్టణంలోని గీతాంజలి హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి ఎన్. సాయి ఎంపిక య్యాడు. ఇటీవల తూడుకుర్తిలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి కోకో క్రీడా పోటీల్లో ఎస్. సాయి అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో షామీర్‌పేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ రాయ్ జోసెఫ్ విద్యార్థి సాయిని అభినందించి మెమెంటో అందజేశారు. అలాగే పాఠశాల పీఈటీ కృష్ణ విద్యార్థి ప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు

ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ నవంబర్ 12 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఉపాధ్యాయులు అంకితభావంతో బోధన సాగించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులందరూ ప్రతిరోజూ పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని తిరిగి పాఠశాలలకు వచ్చేలా చూడాలన్నారు. నిర్దిష్ట సమయంలో సిలబస్ పూర్తి చేయడంతో పాటు, విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు పరీక్షలు నిర్వహించాలని, చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ విధులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని స్పష్టం చేశారు.అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం, సురక్షిత తాగునీరు అందించడంతో పాటు, పాఠశాలలు, వసతి గృహాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, సంక్షేమ శాఖల అధికారులు దయానంద్, నిహారిక, శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ విలువ కంటే చలానాలే ఎక్కువ

రూ.4.06 లక్షల జరిమానాలున్న ద్విచక్రవాహనం సీజ్

గురుగ్రామ్‌లో బైక్‌పై 67 చలాన్లు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు

హెల్మెట్, ఇన్సూరెన్స్, పీయూసీ లేకపోవడం వంటివి ప్రధాన ఉల్లంఘనలు

పత్రాలు చూపించకపోవడంతో బైక్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

గురుగ్రామ్: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై పోలీసులు ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నా, కొందరు వాహనదారులు మాత్రం బేఖాతరు చేస్తున్నారు. దీనికి నిదర్శనంగా గురుగ్రామ్‌లో ఒక ద్విచక్ర వాహనంపై ఏకంగా రూ. 4 లక్షలకు పైగా జరిమానాలు పెండింగ్‌లో ఉన్న ఉదంతం వెలుగులోకి వచ్చింది. రికార్డులను పరిశీలించి విస్తుపోయిన అధికారులు వెంటనే ఆ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం దామ్‌దామా రెడ్‌లైట్ సమీపంలో ట్రాఫిక్ పోలీసు బృందం వాహన తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలో ఒక బైక్‌ను ఆపి వివరాలను పరిశీలించగా, ఆ వాహనంపై మొత్తం 67 చలాన్లు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈ చలాన్ల మొత్తం విలువ రూ. 4,06,500గా తేలడంతో అధికారులు నివ్వెరపోయారు. ఈ ఉల్లంఘనల్లో అధిక శాతం హెల్మెట్ ధరించకపోవడం, ఇన్సూరెన్స్ లేకపోవడం, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్ గడువు ముగియడం వంటివే ఉన్నాయని అధికారులు వెల్లడించారు. తనిఖీ సమయంలో వాహనదారుడు సరైన పత్రాలు చూపించడంలో విఫలమవడంతో మోటారు వాహన చట్టం కింద ఆ బైక్‌ను సీజ్ చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించడంతో పాటు ఇన్సూరెన్స్, పీయూసీ వంటి పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. ఇది కేవలం వ్యక్తిగత భద్రతకే కాకుండా, భారీ జరిమానాల నుంచి కూడా రక్షణనిస్తుందని వారు స్పష్టం చేశారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రోడ్డెక్కిన ప్రజలు

హైదరాబాద్ : రోడ్లపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హయత్ నగర్ డివిజన్ కి చెందిన 10 కాలనీల ప్రజలు రోడ్డుపై బైఠాయించి నిరసన ధర్నా చేపట్టారు. మూడు సంవత్సరాల క్రితం సాంక్షన్ అయిన డ్రైనేజీ పనులను ప్రారంభించకుండా అలసత్వం వహిస్తున్న అధికారులు వెంటనే వచ్చి సమస్య పరిష్కారం చేయాలని కాలని వాసులు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పాల్గొని రోడ్డుపై స్థానిక ప్రజలతో కలసి బైఠాయించారు. పక్కనే ఉన్న స్కూల్ విద్యార్థులు డ్రైనేజీ వల్ల అనారోగ్యం పాలై అంటు రోగాలకు గురవుతున్నారన్నారు. ఈ డ్రైనేజీ వల్ల దాదాపు 15 కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారన్నారు.పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కాలయాపన చేయడం జరుగుతుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించాలని జీవన్ రెడ్డి అన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించి వంటావార్పు కార్యక్రమంను చేపడతామని హెచ్చరించారు.

నత్తనడకన టిమ్స్ ఆసుపత్రుల పనులు

హైదరాబాద్ : రేవంత్ రెడ్డికి మెడికవర్ ఆసుపత్రులపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ ఆసుపత్రులపై ఎందుకు లేదని బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ప్రశ్నించారు. రెండు సంవత్సరాల్లో హెలికాప్టర్ వేసుకొని వెళ్లి 3 మెడికవర్ ఆసుపత్రులను ప్రారంభించాడు. కానీ అదే 23 నెలల్లో అల్వాల్ టిమ్స్ ఆసుపత్రి పనులు కేవలం 5 శాతం మాత్రమే చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 2025 జనవరి నెలలో అల్వాల్ టిమ్స్ ఆసుపత్రిని సందర్శించి, 90% పనులు పూర్తయ్యాయని, 2025 ఆగస్టు 31వ తేదీలోపు పనులు పూర్తి చేస్తామని తెలిపాడు.

20 రోజుల్లో రూ.14.80 లక్షల బీమా క్లెయిమ్ చెల్లింపు

కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలిచిన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్

గజ్వేల్, నవంబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి):

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ వేగవంతమైన సేవలతో ఓ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించింది. గజ్వేల్‌కు చెందిన దివంగత మాగపు వెంకటలక్ష్మి బీమా పాలసీకి సంబంధించిన రూ. 14,80,055 డెత్ క్లెయిమ్ మొత్తాన్ని కేవలం 20 రోజుల్లోనే నామినీ మాగపు నత్యనారాయణకు



అందజేసింది.వెంకటలక్ష్మి ఈ ఏడాది ఆగస్టు 30న మృతి చెందగా, నామినీ సత్యనారాయణ క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచ్ అధికారులు అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి క్లెయిమ్ మొత్తాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఆదర్శ్ కుమార్,అసిస్టెంట్ మేనేజర్లు నవీన్,మహేందర్, పార్టనర్ గుడెల్లి రాజు,సీనియర్ లీడర్లు ప్రసాద్ రాయపోల్,దులం రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవిత బీమా కేవలం పాలసీ మాత్రమే కాదని, కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆర్థికంగా అండగా నిలిచే భరోసా అని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భవిష్యత్తు భద్రత కోసం జీవిత బీమా ప్రాధాన్యతను గుర్తించాలని సూచించారు.

భూనిర్వాసుల సమస్యలను ముఖ్యమంత్రి పరిష్కరించాలి

- సిద్దిపేట సభలో నిర్వాసుల సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలి

- సిపిఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగం కృష్ణ

గజ్వేల్: నవంబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి):

ఈ నెల 19న సిద్దిపేటలో జరిగే బహిరంగ సభకు హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూనిర్వాసుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిపిఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగం కృష్ణ కోరారు.మల్లన్నసాగర్ ప్రాజెక్టు భూనిర్వాసులు ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కోసం



ఎదురుచూస్తున్నారని తెలిపారు. 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భూనిర్వాసులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం, పునరావాస ప్రయోజనాలు కల్పించలేదని పేర్కొన్నారు. అప్పట్లో నిర్వాసుల సమస్యల పరిష్కారం కోసం ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎటిగడ్డ కిష్టాపూర్‌లో రెండు రోజులపాటు దీక్ష చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి హోదాలో ఉన్నందున భూనిర్వాసుల సమస్యలపై పూర్తి అవగాహనతో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మల్లన్నసాగర్ భూనిర్వాసులకు పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీలు,ప్లాట్లు, ఇళ్లు, రిజిస్ట్రేషన్లు,ఒంటరి మహిళల పరిహార ప్యాకేజీలు,వ్యవసాయ భూములకు సంబంధించిన నష్టపరిహారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.నిర్వాసుల సొంత గ్రామాల పేర్లను కొనసాగించాలని, గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనం చేసిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి పదేళ్లపాటు పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే సిద్దిపేట జిల్లాలోని వివిధ ప్రాజెక్టులు,కాలువల నిర్మాణాల కోసం భూములు కోల్పోయిన రైతులకు కూడా పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించాలని శివలింగం కృష్ణ ముఖ్యమంత్రిని కోరారు.

ప్రసాద్ చారి దంపతులకు

రామయ్య తలంబ్రాలు

కళ్యాణ వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేసిన రామకోటి రామరాజు

గజ్వేల్: 12 నవంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవానికి భక్తిశ్రద్ధలతో గోటి తలంబ్రాలు సమర్పించిన ప్రముఖ పాత్రికేయులు,టీఎన్‌టీ ఛానల్ వ్యవస్థాపకులు తాటోజు ప్రసాద్ చారి, వీణాకుమారి దంపతులకు గురువారం ప్రత్యేక ఆధ్యాత్మిక గౌరవం లభించింది.శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు దంపతులకు రామయ్య కల్యాణ వస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ.. భద్రాచలం సీతారాముల కల్యాణానికి గోటి తలంబ్రాలు సమర్పించడం అత్యంత పవిత్రమైన భక్తి కార్యమని అన్నారు. శ్రీరామచంద్రునిపై అచంచలమైన భక్తి, నిష్ఠతో ప్రసాద్ చారి,వీణాకుమారి దంపతులు చేసిన సేవ అభినందనీయమని పేర్కొన్నారు. భగవంతుని సేవలో భాగస్వాములు కావడం గొప్ప అదృష్టమని,ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని,ధార్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.



కార్మిక రత్న అవార్డుకు ఎంపికైన కృష్ణమూర్తికి ఘన సన్మానం

- మునిగడప గ్రామానికి దక్కిన అరుదైన గౌరవమన్న గ్రామ ప్రముఖులు



గజ్వేల్ నియోజకవర్గం:12 నవంబర్ (ప్రజా కలం ప్రతినిధి)

జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (బీఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు,గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మరాఠీ కృష్ణమూర్తి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన కార్మిక రత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు మాట్లాడుతూ.. తమ గ్రామానికి చెందిన కార్మిక నాయకుడు జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం గ్రామ ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న కృష్ణమూర్తికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

అనంతరం మరాఠీ కృష్ణమూర్తిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షులు మామిండ్ల శ్రీశైలం యాదవ్, గ్రామ ప్రముఖులు,మాజీ సర్పంచ్ పబ్బా రవి గౌడ్,కొలిచెల్మా ఐలయ్య,గ్రామ ఉపసర్పంచ్ మామిండ్ల కిషన్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు గుర్రం సుధాకర్,సీనియర్ పాత్రికేయులు గుర్రం శ్రీకాంత్,బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు రాచకొండ అనిల్,నర్రా బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

మంఖల్ 67 డివిజన్ ఫ్యూచర్ సిటీలో ఉంటుందా,

జీహెచ్ఎంసీలో ఉంటుందా?

- ప్రజల సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం - అందుబాటులో లేని అధికారులు
- సమస్యలకు నిలయంగా మంఖల్ 67వ డివిజన్
- తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మంఖల్ 67వ డివిజన్ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తాం
- బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మణికొండ నర్సింగ్ రాజ్

మహేశ్వరం, నవంబర్ 12, (ప్రజా కలం):

మంఖల్ 67వ డివిజన్‌ను ఫ్యూచర్ సిటీలో కలుపుతారా లేక జీహెచ్ఎంసీలోనే కొనసాగిస్తారా అనే విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మణికొండ నర్సింగ్ రాజ్ డిమాండ్ చేశారు.ఫ్యూచర్ సిటీలో ఉంటుందా లేక జీహెచ్ఎంసీలోనే ఉంటుందా అనేది స్పష్టం చేయాలని అన్నారు.పరిపాలన పరంగా ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఫ్యూచర్ సిటీ లో కలపాలని లేనిపక్షంలో జీహెచ్ఎంసీలో కలపాలని కోరారు. కొన్ని కార్యాలయాలు ఫ్యూచర్ సిటీ మరికొన్ని కార్యాలయాల్లో జిహెచ్ఎంసిలో ఉంటే మంఖల్ ప్రజలకు పరిపాలన పరంగా ఎన్నో ఇబ్బందులు ఏర్పడతాయని అంతా ఒకే చోట అంటే ఫ్యూచర్ సిటీ లో కానీ జిహెచ్ఎంసి కానీ ఉండాలి ఉండే విధంగా చూడాలని ఆయన కోరారు.రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మంఖల్ 67వ డివిజన్‌లో ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. మంఖల్ 67వ డివిజన్ కార్యాలయంలో ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడానికి మాత్రమే అధికారులు ఉన్నారని, ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు శంషాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఉన్నారని ఆయన అన్నారు.డివిజన్ ప్రజలు శంషాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయానికి వెళ్లి సమస్యలు చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారని, తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారని నర్సింగ్ రాజ్ పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న అధికారులను అడిగితే శంషాబాద్ కార్యాలయానికి వెళ్లి చెప్పుకోవాలని చెబుతున్నారని, అక్కడి వరకు వెళ్లలేని ప్రజల సమస్యలను పరిష్కరించరా అని ఆయన ప్రశ్నించారు. మంఖల్ డివిజన్‌లో విద్యుత్ సమస్యల కోసం మహేశ్వరం అధికారులను, స్థానిక సమస్యల కోసం శంషాబాద్ జీహెచ్ఎంసీ అధికారులను సంప్రదించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ప్రశాంతంగా ఉన్న మున్సిపాలిటీని తీసివేసి జీహెచ్ఎంసీగా మార్చిన తర్వాత ప్రజలకు సౌకర్యాలు మెరుగుపడాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా ఈ డివిజన్ సమస్యలకు నిలయంగా మారిందని ఆయన విమర్శించారు.మంఖల్ 67వ డివిజన్‌గా ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యలను పట్టించుకోకుండా, ప్రజల నుంచి పన్నులు వసూలు



చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒకవైపు నీటి ఇబ్బందులు, మరోవైపు విద్యుత్ సమస్యలు, డ్రైనేజీ సమస్యలు, దోమల బెడద, అందుబాటులో లేని అధికారులు ఇలా ప్రతిరోజూ ప్రజలు ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజా సమస్యల విషయంలో అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తే కనీసం కార్పొరేటర్లైనా బాధ్యత తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని, కానీ ప్రభుత్వానికి జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించే ఆలోచన కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు.తక్షణమే మంఖల్ 67వ డివిజన్‌లో కమిషనర్ స్థాయి అధికారులను ఏర్పాటు చేయాలని, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించి జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని నర్సింగ్ రాజ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ పార్టీ తరఫున ప్రజల సహకారంతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

వచ్చే దీపావళి నాటికి పేదల సొంతింటి కళ సాకారం

- ప్రతి పేదవాడి ఇంటా వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యం
- జల్ పల్లి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి ఘనంగా భూమి పూజ చేసిన
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

మహేశ్వర నవంబర్ 12 (ప్రజా కలం)

భరోసాతో ఆనందభాష్పాలు రాల్చిన నిరుపేద లబ్ధిదారులు దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో మగ్గుతూ, సొంతింటి కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న నిరుపేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపే శుభకార్యానికి మహేశ్వరం నియోజకవర్గం వేదికైంది. జల్‌పల్లి డివిజన్ పరిధిలో నిర్మించనున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మహేశ్వరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించి, నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇది కేవలం శంకుస్థాపనకు మాత్రమే పరిమితమయ్యే కార్యక్రమం కాదు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తాం అన్నారు. వచ్చే ఏడాది దీపావళి పండుగ నాటికి అర్హులైన ప్రతి పేదవాడు తమ స్వగృహంలో దీపాలు వెలిగించుకునేలా చేస్తాం అని హామీ ఇచ్చారు.దీంతో తమ జీవితకాలపు కల నెరవేరబోతోందని, వచ్చే దీపావళికి సొంతింట్లో అడుగుపెట్టబో తున్నామని అక్కడికి వచ్చిన లబ్ధిదారులు ఆనందభాష్పాలు రాల్చారు. పేదల కష్టాలను అర్థం చేసుకుని అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు



తెలుపుతూ జయజయధ్వానాలు చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసి సెక్రటరీ యేలిమేటి అమరేందర్ రెడ్డి, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, హౌసింగ్ శాఖ అధికారి ఐఏఎస్ వి. పి గౌతమ్, రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, ఆర్డిఓ జగదీశ్వర్ రెడ్డి, బాలాపూర్ మండల తాసిల్దార్ పి. ఇందిరా దేవి, జల్ పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకట్రామ్, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు మర్కూక్ పోలీసుల చర్యలు

- ప్రమాద సూచిక బోర్డులకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, మొక్కల తొలగింపు

గజ్వేల్ నియోజకవర్గం, నవంబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి):

రోడ్డు ప్రమాదాల నివారణకు మర్కూక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్ఐ ఎస్.కె. యూనస్ ఆధ్వర్యంలో ఎర్రవల్లి--వర్ధరాజుపూర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ప్రమాదకరమైన మూలమలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులకు అడ్డుగా ఉన్న మొక్కలు, చెట్ల కొమ్మలను తొలగించారు.దీంతో ప్రమాద సూచిక బోర్డులు వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్.కె.యూనస్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని,వాహనాలను అప్రమత్తంగా నడపాలని సూచించారు.

సీఎం సభ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

- అధికారులకు కలెక్టర్ కే.హైమావతి ఆదేశాలు

సిద్దిపేట, నవంబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి):

ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ



బహిరంగ సభ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కే.హైమావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నాగదేవత గుట్ట నుంచి సిరిసిల్లకు వెళ్లే బైపాస్ రోడ్డు సమీపంలో సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సభా వేదికతో పాటు వీఐపీలు, ప్రజాప్రతినిధులు,అధికారులు, ప్రజలు, మీడియా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు.సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు.వీఐపీలు, అధికారుల వాహనాల పార్కింగ్, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ముందస్తు ప్రణాళిక ప్రకారం చేపట్టాలని ఆదేశించారు.ప్రజల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయడంతో పాటు బారికేడింగ్ పటిష్టంగా ఉండేలా చూడాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం,తహసీల్దార్ కిరణ్,పోలీసు శాఖ అధికారులు, రెవెన్యూ,ఆర్‌అండ్‌బీ,విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పటాన్చెరువు నుండి పిఎఫ్ కార్యాలయాని ఖాజాగూడ కు తరలించాలనే

ఆలోచన విరమించుకోవాలి.

పిఎఫ్ కార్యాలయాని తరలిస్తే పోరాటం తప్పదు కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అతిమేల మానిక్

సంగారెడ్డి ప్రతినిధి నవంబర్ 12(ప్రజా కలం):

పిఎఫ్ కార్యాలయాని పటాన్చెరువు నుండి తరలించొద్దని, తరలిస్తే ప్రతిఘటన తప్పదని సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు.



పటాన్చెరువు పారిశ్రామిక ప్రాంతం ఆసియా ఖండంలోనే అతిపెద్దది గా పేరుగాంచిందని అన్నారు. పటాన్చెరు పారిశ్రామిక ప్రాంతంలో పాశమైలారం రామచంద్రపురం జిన్నారం కాజిపల్లి బొల్లారం బొంతపల్లి గుమ్మడిదల గడ్డపోతారం సుల్తాన్పూర్ సంగారెడ్డి సదాశివపేట హత్నూర కొండాపూర్ జహీరాబాద్ ప్రాంతాల్లో వందలాది పరిశ్రమల్లో వేలాదిమంది కార్మికుల పని చేస్తున్నారని అన్నారు. పటాన్చెరువులో గల పిఎఫ్ కార్యాలయం ను ఖాజాగూడ కు తరలించాలనే ప్రభుత్వం ఆలోచిన ఈ ప్రాంత కార్మికులకు వ్యతిరేకమైనదని అన్నారు. పిఎఫ్ కార్యాలయం సొంత భవనం కోసం పటాన్ చెరువు ఇస్నాపూర్ కర్దానూరు పాశమైలారం ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలం కేటాయించి భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు.. పిఎఫ్ కార్యాలయం పటాన్చెరువు నుండి కాజా గూడ తరలించాలని ఆలోచన వెంటనే విరమించుకోవాలని లేని పక్షంలో ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.



గంజాయి విక్రయానికి యత్నం.. ఇద్దరి అరెస్ట్

- పలు ప్రాంతాల్లో వైన్‌షాపుల దొంగతనాల గుట్టురట్టు.

- 72 మద్యం సీసాలు, 160 గ్రాముల గంజాయి స్వాధీనం.

వేములవాడ నవంబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి) : గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను వేములవాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి విచారణలో పలు ప్రాంతాల్లోని వైన్‌షాపుల్లో జరిగిన దొంగతనాల కేసులు వెలుగులోకి వచ్చాయి. విశ్వసనీయ సమాచారం మేరకు వేములవాడ పట్టణ ఎస్సై ఎస్. ప్రేమానందం సిబ్బందితో కలిసి చెక్కపల్లి రోడ్డులోని పెద్దమ్మ గుడి సమీపంలో నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 160 గ్రాముల గంజాయి లభించింది.

హపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాకు చెందిన బానోత్ సురేష్ (33), జగిత్యాల జిల్లాకు చెందిన రాంపెల్లి మహేందర్ (28) గంజాయి విక్రయించేందుకు వచ్చినట్లు గుర్తించారు. వారి నుంచి గంజాయితో పాటు హోండా డియో స్కూటీ, రెండు వివో సెల్‌ఫోన్లు, రూ. 400 నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు వేములవాడ, కరీంనగర్, సిద్ధిపేట, భువనగిరి, కాజీపేట ప్రాంతాల్లో పలు వైన్‌షాపుల్లో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. కరీంనగర్‌లోని విఘ్నేశ్వర వైన్స్‌లో చోరీకి గురైన 72 మద్యం సీసాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు సిబ్బందికి అభినందనలు..

కేసును చాకచక్యంగా ఛేదించి నిందితులను పట్టుకున్న ఎస్సై ఎస్. ప్రేమానందం, పోలీసు సిబ్బంది ఇమ్రాన్, నరేందర్‌తో పాటు సహకరించిన ఇతర సిబ్బందిని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. నేరాల నియంత్రణకు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

మహిళా కాంగ్రెస్‌కు కొత్త సారథి..

- సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా నియామకం..

- గాంధీ భవన్‌లో నియామక పత్రం అందజేత..

-మహిళా హక్కుల కోసం పోరాటమే లక్ష్యం..

- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యాచరణ..

పటాన్‌చెరు, నవంబర్ 12 (ప్రజా కలం) ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా రాజకీయాల్లో మహిళా శక్తికి కొత్త ఊపు వచ్చింది. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ నియమితులయ్యారు. జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని, మహిళా సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న పార్టీ అధిష్ఠానం ఆమెకు ఈ కీలక బాధ్యతలు అప్పగించింది..

గాంధీ భవన్‌లో నియామక పత్రం..



హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా, తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చేతుల మీదుగా సుధా శ్రీనివాస్ గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి మహిళా నాయకత్వం సమక్షంలో ఈ నియామకం జరగడం జిల్లా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది..

మహిళల హక్కుల కోసం నిరంతర పోరాటం..

నియామకం అనంతరం మాట్లాడిన సుధా శ్రీనివాస్ గౌడ్, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు. మహిళల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతాను. గ్రామ గ్రామానా, ఇంటింటా మహిళల గొంతుకగా నిలుస్తాను అని ఆమె దృఢంగా ప్రకటించారు..

ప్రజల్లోకి పార్టీ కార్యక్రమాలు..

పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, వారి హక్కుల కోసం జరుగుతున్న పోరాటాల నేపథ్యంలో ఈ నియామకానికి ప్రాధాన్యత ఏర్పడింది. క్షేత్రస్థాయిలో మహిళలతో మమేకమై, వారి సమస్యలను నేరుగా పార్టీ దృష్టికి తీసుకెళ్లే నాయకత్వం అవసరమన్న అభిప్రాయం వ్యక్తమవుతున్న వేళ, సుధా శ్రీనివాస్ గౌడ్ రాకతో జిల్లా మహిళా కాంగ్రెస్‌లో కొత్త శకం ప్రారంభమవుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి..



ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

- వ్యాసరచన, క్విజ్ పోటీల్లో 128 మంది విద్యార్థుల భాగస్వామ్యం.

- జిల్లా స్థాయి పోటీలకు 20 మంది ఎంపిక.

వేములవాడ, నవంబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి) : విద్యార్థుల్లో ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు వేములవాడ నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 128 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిలో వ్యాసరచన విభాగం నుంచి 10 మంది, క్విజ్ విభాగం నుంచి 10 మందిని ఎంపిక చేశారు. మొత్తం 20 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారు.విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల విధానం, ఓటు హక్కు ప్రాధాన్యం, బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

సమగ్ర రీసర్వే రైతుల భూ హక్కుల పరిరక్షణకు ఎంతో కీలకం

గఫూర్ నగర్ గ్రామంలో భూముల రీసర్వేపై గ్రామసభ నిర్వహణ



కందుకూరు, నవంబర్ 12, (ప్రజా కలం)

కందుకూరు మండలంలోని గఫూర్ నగర్ గ్రామంలో భూముల సమగ్ర రీసర్వే కార్యక్రమంపై గ్రామసభను కందుకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డివో మాట్లాడుతూ, చాలా సంవత్సరాల తరువాత రాష్ట్రంలో చేపట్టిన భూముల సమగ్ర రీసర్వే రైతుల భూ హక్కుల పరిరక్షణకు ఎంతో కీలకమైన కార్యక్రమమని పేర్కొన్నారు. రీసర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు, ఉపవిభాగాల వివరాలను స్పష్టంగా గుర్తించి భూ రికార్డులను మరింత ఖచ్చితంగా రూపొందించేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. రీసర్వే వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను ఆర్ డి వో ఈ క్రింది విధంగా వివరించారు.భూముల హద్దుల స్పష్టత ప్రతి రైతుకు తన భూమి యొక్క ఖచ్చితమైన సరిహద్దులు తెలిసే అవకాశం ఉంటుంది.భూ వివాదాల నివారణ పొరుగు రైతుల మధ్య హద్దులకు సంబంధించిన వివాదాలు తగ్గుతాయి. విస్తీర్ణం నిర్ధారణ రికార్డుల్లో ఉన్న విస్తీర్ణం, క్షేత్రస్థాయి కొలతల మధ్య వ్యత్యాసాలను గుర్తించవచ్చు భూ హక్కుల పరిరక్షణ రైతుల భూములకు సంబంధించిన రికార్డులను మరింత పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించవచ్చు, వారసత్వ భూముల స్పష్టత కుటుంబ సభ్యులు, వారసుల మధ్య భూముల విభజన వివరాలను స్పష్టీకరించడానికి సహాయపడుతుంది.

క్రయవిక్రయాల్లో పారదర్శకత భూముల కొనుగోలు, అమ్మకాల సమయంలో హద్దులు, విస్తీర్ణంపై స్పష్టత ఏర్పడుతుంది.బ్యాంకు రుణాలకు ఉపయోగం ఖచ్చితమైన భూ రికార్డులు బ్యాంకుల పరిశీలనకు ఉపయోగపడతాయి.ప్రభుత్వ పథకాల అమలు అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడంలో భూ రికార్డుల ఖచ్చితత్వం తోడ్పడుతుంది.భవిష్యత్ తరాలకు భద్రత డిజిటల్ భూ రికార్డుల ద్వారా భూముల వివరాలను భవిష్యత్తులో కూడా సులభంగా తెలుసుకోవచ్చు ఈ సందర్భంగా ఆర్ డి వో రైతులందరూ రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. సర్వే బృందం గ్రామానికి వచ్చినప్పుడు ప్రతి రైతు స్వయంగా లేదా తన ప్రతినిధి ద్వారా తమ భూముల వద్ద హాజరై, భూముల వాస్తవ హద్దులను చూపించాలని సూచించారు. పొరుగు రైతులతో సమన్వయం చేసుకుంటూ సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.రీసర్వే అనేది కేవలం భూముల కొలతల కార్యక్రమం మాత్రమే కాదని, రైతుల భూ హక్కులకు భద్రత కల్పించే దీర్ఘకాలిక కార్యక్రమమని, అందువల్ల ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ గ్రామసభలో తహసీల్దార్ వేణుగోపాల్, డీటీ కందుకూరు శేఖర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే రామకాంత్ రెడ్డి,మండల సర్వేయర్ సాయికాంత్, గ్రామ సర్పంచ్ కృష్ణ, ఉపసర్పంచ్ రవికుమార్ రెడ్డి, గ్రామ రైతులు ఇతర గ్రామస్థులు పాల్గొన్నారు.

రహదారి కష్టాలకు చెక్!..

అభివృద్ధి బాటలో బీరంగూడ

- ఏళ్ల నిరీక్షణకు తెర..సీసీ రోడ్డు పనులు ప్రారంభం..

- కాలనీల అభివృద్ధికి కాటా శ్రీనివాస్ గౌడ్ ప్రాధాన్యత..

- పనులను పరిశీలించిన కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి..

- నాణ్యతతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచన..



పటాన్‌చెరు, నవంబర్ 12 (ప్రజా కలం) ప్రతినిధి

ఏళ్లుగా రహదారి కష్టాలతో సతమతమవుతున్న మల్లారెడ్డి కాలనీవాసుల కల ఎట్టకేలకు నెరవేరే దిశగా అడుగులు పడ్డాయి.బీరంగూడ డివిజన్ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే తమ ప్రథమ ప్రాధాన్యమని అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి స్పష్టం చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించామని ఆయన తెలిపారు..

ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలే లక్ష్యం..

ప్రజలకు నాణ్యమైన రహదారి సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా విడతలవారీగా సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు శశిధర్ రెడ్డి వివరించారు. ఒక్కో కాలనీని అభివృద్ధి బాట పట్టిస్తూ, రానున్న రోజుల్లో మరిన్ని పనులు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు..

స్వయంగా పరిశీలన..

పనులు జరుగుతున్న తీరును శశిధర్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో భ్రమరాంబ మల్లికార్జున దేవాలయ సభ్యుడు లక్ష్మీకాంత్ రావు, చుక్క రెడ్డి, రాజీ రెడ్డి, పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంపై కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు..

జెకె ఫెన్నార్‌లో బీఆర్‌టీయూ జయకేతనం..

- 13 ఓట్ల ఆధిక్యంతో బీఆర్‌టీయూ ఘన విజయం..

- బీఆర్‌టీయూ 103..హెచ్ఎంఎస్ 93.. సీఐటీయూ 48 ఓట్లు..

- ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి.. ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం..

పటాన్‌చెరు, నవంబర్ 12 (ప్రజా కలం) ప్రతినిధి

జెకె ఫెన్నార్ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్‌టీయూ ఘన విజయం సాధించింది.సమీప ప్రత్యర్థి హెచ్ఎంఎస్‌పై13 ఓట్ల ఆధిక్యంతో కార్మికుల మద్దతును చాటుకుంది.గురువారం నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 247 ఓట్లు పోలవగా, బీఆర్‌టీయూకు 103, హెచ్ఎంఎస్‌కు 93, సీఐటీయూకు 48 ఓట్లు వచ్చాయి.మరో మూడు ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి విజయం



అనంతరం నిర్వహించిన సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు,రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్ మాట్లాడుతూ,తమపై నమ్మకంతో విజయాన్ని అందించిన ప్రతి కార్మికుడికి రుణపడి ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు గూడెం మధుసూదన్ రెడ్డి సహకారం, మార్గదర్శకత్వంతో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం, ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు.నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, అధ్యక్షుడిగా రాంబాబు యాదవ్,ప్రధాన కార్యనిర్వహక అధ్యక్షుడిగా యాదగిరి యాదవ్ ఎన్నికయ్యారు.ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం బీఆర్‌టీయూ నాయకులు, కార్మికులు పటాన్‌చెరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల మద్దతుతో విజయం సాధించిన బీఆర్‌టీయూ నాయకులు,కార్మికులకు అభినందనలు తెలిపారు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన బాధ్యత నూతన కార్యవర్గంపై ఉందని సూచించారు.పరిశ్రమ అభివృద్ధిలో కార్మికుల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు..

అయ్యప్ప ఆలయానికి భారీ విరాళం

- బీరంగూడ ఆలయానికి రూ.7 లక్షల విరాళం..

- మాధ్రి పృథ్వీరాజ్‌కు కమిటీ ఘన సన్మానం..

పటాన్‌చెరు, నవంబర్ 12 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థాన అభివృద్ధికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు,ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు మాధ్రి పృథ్వీరాజ్



రూ.7,00,116 భారీ విరాళం అందజేశారు. ద్వారపాలకుల మండపం నిర్మాణం కోసం ఆయన అందించిన ఈ విరాళం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 22న జరగనున్న అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నేపథ్యంలో దేవస్థానాన్ని సందర్శించిన పృథ్వీరాజ్ ఆలయ నిర్మాణ పనులు, ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. దేవాలయాలు భక్తి, ఐక్యత, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకలని, వాటి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులోనూ దేవాలయాల అభివృద్ధికి,ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తన సహకారం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పృథ్వీరాజ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఆయన అందించిన విరాళం దేవస్థాన అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు, ప్రముఖులు, అయ్యప్ప స్వామి భక్తులు, యువసేన సభ్యులు పాల్గొన్నారు..

పార్టీ బలోపేతమే లక్ష్యం

- కూకట్‌పల్లి కాంగ్రెస్ జేఏసీ

-ఐక్యంగా పనిచేయాలని నిర్ణయం

కూకట్‌పల్లి, నవంబర్ 12, ప్రజా కలం ప్రతినిధి:

కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ జేఏసీ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అట్టడుగు వర్గాల వరకు చేరేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి రావడం, కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు సంకల్పించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, ఐక్యతతో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు మరియు తదితరులు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



అక్కన్న మాదన్న ఆలయంలో సంతోష్‌రావు ప్రత్యేక పూజలు

మాజీ ఎంపీని శాలువాతో సత్కరించిన సోము రమేష్ కురుమ

బీబీనగర్, నవంబర్ 12 (ప్రజాకలం): మండలంలోని మహదేవ్‌పూర్ గ్రామంలో ఉన్న ప్రముఖ అక్కన్న మాదన్న ఆలయాన్ని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నాయకుడు జోగినిపల్లి సంతోష్‌రావు గురువారం నందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ ఆయనను ఘనంగా శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసమల్ల శ్రీనివాసులు, వెంకిర్యాల సర్పంచ్ చింతల నాగలక్ష్మి లక్ష్మీనారాయణ, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు దబ్బికారి రాజేశ్వర్, మండల మైనార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, బత్తిని భానుచందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ విలీన నిర్ణయాన్ని

వెనక్కి తీసుకోవాలి

- విద్యార్థుల భవిష్యత్తుతో ప్రయోగాలు వద్దు
- బీఆర్ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నాగేష్

బీబీనగర్, నవంబర్ 12 (ప్రజాకలం): ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 10+2 విధానాన్ని అమలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేష్ డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా లక్షలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యకు పునాదిగా ఉన్న ఇంటర్మీడియట్ వ్యవస్థను మార్చే ముందు అన్ని వర్గాలతో చర్చించాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల ప్రత్యేకత, జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన ప్రత్యేక బోధన, ప్రయోగశాలలు, అధ్యాపకుల పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల భవిష్యత్తుతో పాటు ప్రైవేటు కళాశాలల నిర్వహణ, వాటిలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉద్యోగుల ఉపాధి భద్రతకు హామీ ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల విలీనం వల్ల పేద విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, బాలికలు, దివ్యాంగ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువు మధ్యలో మానేయడానికి కారణమవుతున్న పేదరికం, వసతి గృహాల కొరత, ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం వంటి సమస్యలను ముందుగా పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో విస్తృతంగా చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని జక్కి నగేష్ కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కౌన్సిలర్ పృథ్వీకి న్యాయం చేయాలి: దళిత సంఘాల ధర్నా

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 12:

ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో 30వ వార్డు దళిత కౌన్సిలర్ పృథ్వీకి జరిగిన అవమానం, అన్యాయాన్ని నిరసిస్తూ దళిత సంఘాల నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. ఆయనకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్



చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రావును కలిసి సమస్యపై వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్, కౌన్సిలర్ పట్ల అనుచితంగా ప్రవర్తించి అవమానించిన వారిపై తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తదుపరి, దళిత సంఘాల నాయకులు పట్టణ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా మాల కులాల జేఏసీ చైర్మన్ బండి రవీందర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇత్వర్పేట్ లింగన్న, దళిత ఐక్య సంఘటన సభ్యుడు కొక్కెర భూమన్న, ఎంఆర్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు కనక ప్రమోద్, ఎంఆర్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు ఇందారపు రాజుతో పాటు పలువురు దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





టిడబ్ల్యూజేఎఫ్ యూనియన్ కు తన సహాయ సహకారాలు ఉంటాయి:ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) టిడబ్ల్యూజేఎఫ్ యూనియన్ కు తన సహాయ సహకారాలు ఉంటాయని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. గురువారం టిడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా సంఘం ఆధ్వర్యంలో కలిశారు. అనంతరం ఆయనను శాలువతో సత్కరించారు. తదనంతరం బాచుపల్లి సిఐ దాలినాయుడు, బాచుపల్లి మాజీ సర్పంచ్ ఆగం పాండులను కలిసి శాలువాతో సత్కరించారు. వారు నూతన కమిటీ సభ్యులకు సన్మానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... నిరంతరం ప్రజలకు ప్రభుత్వానికి వారదులుగా పనిచేస్తూ సంఘాన్ని సమన్వయం చేస్తున్న విధానాన్ని అభినందించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి ఉంటుందని భరోసా ఇచ్చారు. నూతన కమిటీ మరింత ముందుకు సాగి జర్నలిస్టుల సమస్యలపై పోరాడాలని సూచించారు. నిరంతరం ప్రజాసేవలో ముందుంటున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే అక్రిడేషన్ కార్డులు అందించి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్, టిడబ్ల్యూజెఫ్ కుత్బుల్లాపూర్ అధ్యక్ష కార్యదర్శులు ఏ. గోవిందరావు, పి. బ్రహ్మాచారి, కోశాధికారి కొండ సంజీవకుమార్, ఉపాధ్యక్షులు మంజుల రెడ్డి, ఎం.దివాకర్, జోగు వెంకట్, కమిటీ సభ్యులు కుమార్ గౌడ్, సాయిరాజ్, ప్రవీణ్, నుస్మితరెడ్డి, శ్యామ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.ఓ



భూసార పరిరక్షణతోనే భవిష్యత్ తరాలకు భరోసా: ఏవో హరీష్

- తిమ్మాపూర్‌లో 'ఖేత్ బచావో అభియాన్' అవగాహన సదస్సు
- ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచన



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 12: నేటి వ్యవసాయ భూములను సారవంతంగా కాపాడుకుని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారి (ఏవో) హరీష్ అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో హరీష్ మాట్లాడుతూ, భూసార పరిరక్షణ, నేల కోత నివారణ, సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవశ్యకతను వివరించారు. పంటలలో రసాయన ఎరువులు, పురుగుమం దులను కేవలం అవసరమైన మేరకే వినియోగించాలని, సేంద్రియ ఎరువులు మరియు పర్యావరణహిత పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున రైతులు నీటి వినియోగాన్ని తగ్గించాలని కోరారు. ముఖ్యంగా వరి సాగుకు బదులుగా జొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం వల్ల నీటిని ఆదా చేయడంతో పాటు భూసారాన్ని కూడా పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరేష్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) శ్రీలత, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సేవలను విస్తరించాలి

-సభ్యత్వ నమోదును పెంచాలి - కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని జిల్లా కలెక్టర్, ఐఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షురాలు గరిమ అగ్రవాల్ సూచించారు, సేవా కార్యక్రమాల్లో మరింత మంది భాగస్వాములయ్యేలా సభ్యత్వ నమోదును పెంచాలని పిలుపునిచ్చారు.గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రణాళికాబద్ధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రెడ్‌క్రాస్ కార్యాలయం ఏర్పాటు, నూతన బ్లడ్ బ్యాంకు స్థాపన, సభ్యత్వ నమోదు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ గూడూరి రవీందర్, వైస్ చైర్మన్ ప్రయాకరావు వేణుకుమార్, కార్యదర్శి సీహెచ్ సంతోష్ కుమార్, సలహాదారు ఈవీ శ్రీనివాసరావు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు పీవీ సంజీవరెడ్డి, కోశాధికారి చంద్రగిరి శ్రీధర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎం. అజయ్ బాబు, ఏ. శివప్రసాద్, కే. బాబు, సీహెచ్ శ్రీనివాస్, దేవదాస్, అరుణ, రాజు, సురేంద్రబాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడదాం

4వ వార్డు సభ్యులు మంద లావణ్య మహేష్

మహేశ్వరం, నవంబర్ 12, (ప్రజా కలం):

ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అందరం అండగా నిలబడాలని 4వ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ మహేశ్వరం మండలం వైస్ ప్రెసిడెంట్ మంద లావణ్య మహేష్ అన్నారు.గొల్లూరు గ్రామ వాసి రామస్వామి అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 5,000/- ఆర్థిక సహాయం



అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మంద రాజు, మండల ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నందుపల్లి కుమార్, సీనియర్ నాయకులు మంద పోచయ్య, కారొబర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ నేషనల్ అవార్డుకు ఎంపికైన మారపాక నాగయ్య

ఉప్పల్ నవంబర్ 12(ప్రజాకలం న్యూస్)

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నేషనల్ అవార్డు– 2026 సంవత్సరానికి గాను చిల్కానగర్ మాదిగ సంక్షేమ సంఘం సలహాదారుడు మారపాక నాగయ్యకు జాతీయ అవార్డు ప్రకటించారు. అవార్డు సెలెక్షన్ కమిటి నేషనల్ చైర్మన్,నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్ లోని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సంధర్భంగా రాధాకృష్ణ మట్లాడుతూ ఎస్సి.ఎస్టి.బి.సి మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఏట ప్రజా ఉద్యమకారులకు, సంఘసేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు. ఈ సంవత్సరం నవంబర్ 15వ తేదిన దేశరాజధాని న్యూ ఢిల్లీలో నిర్వహించే బహుజన సాహిత్య అకాడమీ 20వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. దేశంలోని 28 రాష్ట్రాల నుండి సుమారుగా 1000 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్సుకు హాజరవుతారని తెలియజేశారు. ఈ ఆవార్డ్ లెటర్ అందజేసిన వారిలో తెలంగాణ రాష్ట్ర కమిటి సభ్యులు టేకి రాజశేఖర్, కనుకుంట్ల విజయ్ కుమార్ అవార్డు సెలక్షన్ కమిటి సభ్యులు ఉన్నారు.

మోర్తాడ్ సీనియర్ రిపోర్టర్ షాదిక్‌కు బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 12:

హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన తెలంగాణ ఉర్దూ వర్కింగ్



జర్నలిస్ట్ యూనియన్ పదో వార్షిక సర్వసభ్య సమావేశం, మిషన్ అవార్డుల ప్రదానోత్సవంలో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలానికి చెందిన సీనియర్ రిపోర్టర్ షాదిక్ బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ ఉర్దూ దినోత్సవం, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలువురు ఉర్దూ జర్నలిస్టులు పాల్గొన్నారు. బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ, కల్వకుంట్ల కవిత తదితర ప్రముఖులు హాజరయ్యారు. పాత్రికేయ రంగంలో అందించిన సేవలకు గుర్తింపుగా షాదిక్‌కు తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మత్ ఉల్లా హుస్సేన్ అవార్డును ప్రదానం చేశారు. మోర్తాడ్ ప్రాంత జర్నలిస్టుకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడంపై పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

కె.కె కమిటితో సమావేశానికి

"చలో హైద్రాబాద్"

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 12:

ప్రత్యేక రాష్ట్ర సాధనకు క్రియాశీల పాత్ర పోషించిన ముంబై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎంటిజెఏసి) ఆధ్వర్యంలో కెకె కమిటితో సమావేశం జరగనుంది. అయితే అట్టి ఐతిహాసిక సభకు అదానీ కంపెనీ కార్మికులు, ఎంటిజెఏసి ప్రముఖులైన గాయకులు ఎర్రోళ్ల గాలయ్య, సిరిపంగి యాదగిరి, బోయ మల్లేష్, సిరిపంగి రమేష్,



ఎంటిజెఏసి ముంబై కన్వీనర్ నారపాక లక్ష్మణ్, నిరటి భూమన్న, రమేష్ చౌవల్, ఎల్దీ రఘునాథ్ పద్మశాలి, యోహాను మరోవైపు బీవండి నుంచి శ్రీమల్ అశోక్, సిరిపురం తిరుపతి, కట్ట బ్రహ్మయ్య చారి తదితరులు "చలో హైద్రాబాద్" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గురువారం ముంబై మహానగరం నుంచి ఎక్స్ప్రెస్ ట్రైన్ల ద్వారా ప్రయాణం మొదలెట్టారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్ బాగలింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగబోయే ముంబై భివండి నవీముంబై సూరత్ లకు చెందిన వలస తెలంగాణ ఉద్యమకారులు కమిటి ప్రతినిధులతో చర్చ జరపనున్నారు. అట్టి సభకు ప్రముఖ అతిథిగా కెకె కమిటి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, శోభన్ రెడ్డి, రాములు నాయక్, అద్దంకి దయాకర్ హాజరు కానున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పరచిన కమిటి ముందు తమకు సమ న్యాయం జరగాలని వలసజీవులు వివరించనున్నారు.

సురక్షిత డ్రైవింగ్‌కు రూ.5 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు

- ఫ్రెష్ బస్ 'బెస్ట్ కెప్టెన్ అవార్డు' ప్రారంభం

- ప్రతిభ కనబరిచిన డ్రైవర్లకు రూ.లక్ష వరకు నగదు బహుమతి



హైదరాబాద్,
నవంబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించే బస్ డ్రైవర్లను ప్రోత్సహించేందుకు ఇంటర్‌సిటీ ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్ ఫ్రెష్ బస్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 'బెస్ట్ కెప్టెన్ అవార్డు'ను ప్రారంభించింది. ఈ వార్షిక కార్యక్రమం ద్వారా అర్హత సాధించిన డ్రైవర్లకు రూ.లక్ష వరకు నగదు బహుమతులు అందించనుంది. విజేతల సంఖ్యపై పరిమితి లేకపోవడంతో ఏటా రూ.5 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు పంపిణీ చేసే అవకాశం ఉందని సంస్థ వెల్లడించింది. 2026 అక్టోబరు 20 నుంచి 2027 అక్టోబరు 9 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. మొత్తం 100 పాయింట్ల భద్రతా మూల్యాంకన విధానం ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తారు. పూర్తి 100 పాయింట్లు సాధించిన వారికి రూ.లక్ష, 85 నుంచి 99 పాయింట్లు పొందిన వారికి రూ.75 వేలు, 70 నుంచి 84 పాయింట్లు సాధించిన వారికి రూ.50 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తారు. ప్రస్తుతం 500 మందికి పైగా బస్ కెప్టెన్లు ఈ కార్యక్రమం పరిధిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఫ్రెష్ బస్ వ్యవస్థాపకుడు, సీఈఓ సుధాకర్ చిర్రా మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రతకు తమ సంస్థ ఎల్లప్పుడూ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి ప్రయాణంలో బస్ కెప్టెన్లు ప్రదర్శించే అప్రమత్తత, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ వేలాది మంది ప్రయాణికుల విశ్వాసానికి పునాదిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వారి అంకితభావాన్ని గుర్తించి, సురక్షిత డ్రైవింగ్ సంస్కృతిని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ అవార్డులను ప్రారంభించినట్లు తెలిపారు. పూర్తి మార్కులు సాధించిన ప్రతి కెప్టెన్ ఈ గుర్తింపునకు అర్హుడని, అర్హత సాధించిన ప్రతి ఒక్కరినీ సత్కరించేందుకు సంస్థ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అవార్డుల ఎంపిక ప్రక్రియను ధ్రువీకరించిన రికార్డులు, సమాచార గణాంకాల ఆధారంగా పారదర్శకంగా నిర్వహించనున్నారు. నగదు బహుమతులతో పాటు విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేయడంతోపాటు ఆయా డిపోల నోటీసు బోర్డులపై ప్రత్యేక గుర్తింపు కల్పించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా డ్రైవర్లలో భద్రతా బాధ్యతను పెంపొందించడంతోపాటు ప్రయాణికులకు మరింత సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా సంస్థ ముందుకు సాగుతోంది.

.

అప్పులు చేసి ఇళ్లు పూర్తి చేసిన

పేదలకు ఎదురుచూపులు

- ఇందిరమ్మ లబ్ధిదారుల ఆందోళన!

- నెలలు గడుస్తున్నా ఖాతాల్లో జమకాని చివరి విడత నిధులు

అప్పుల ఊబిలో లబ్ధిదారులు ..!

బీబీనగర్,నవంబర్ 12 (ప్రజాకలం):

సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు పేదలు ఎన్నో కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇంటి సాయంపై నమ్మకంతో అప్పులు చేసి మరీ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. నిర్మాణాలు పూర్తయి, రంగులు వేసి గృహప్రవేశాలు కూడా చేసుకున్నా చివరి విడత బిల్లులు మాత్రం ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో అప్పులు తీర్చలేక, వడ్డీలు చెల్లించలేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న పేదలకు చివరి విడత బిల్లులు ఎప్పుడు విడుదల చేస్తారని మాజీ ఎంపీటీసీ, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మంచాల రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నించారు.ప్రభుత్వం విడతల వారీగా నిధులు విడుదల చేస్తుందన్న నమ్మకంతో చాలామంది అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని, వచ్చిన బిల్లులకు అదనంగా సొంత డబ్బులు ఖర్చు చేసి పనులు పూర్తి చేసుకున్నారని పేర్కొన్నారు. ఇళ్లు పూర్తయినా చివరి విడత బిల్లు అందకపోవడంతో అప్పులు ఇచ్చిన వారికి సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవైపు కొత్త ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతుండగా, ఇప్పటికే ఇళ్లు పూర్తి చేసుకున్న వారికి బిల్లులు చెల్లించడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పెండింగ్‌లో ఉన్న చివరి విడత నిధులను వెంటనే విడుదల చేసి అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఊరట కల్పించాలని మంచాల రవికుమార్ విజ్ఞప్తి చేశారు.





బాధను దిగమింగి..ప్రజల ముఖాల్లో చిరునవ్వులు నింపిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.!

రాజన్న సిరిసిల్ల,వేములవాడ నవంబర్ 12 (ప్రజా కలం ప్రతినిధి) : కాలికి గాయమైనా...కర్తవ్యానికి సెలవు ఇవ్వని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన బాధను దిగమింగుతూ చేయూత పెన్షన్ పత్రాల పంపిణీకి హాజరై ప్రజల పట్ల తనకున్న నిబద్ధతను మరోసారి చాటిచెప్పారు. ప్రజాసేవకు అంకితమైన మనసుకు శారీరక బాధలు అడ్డుకావు..ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అడుగులు వేసే నాయకుడికి గాయాలు సైతం కర్తవ్యాన్ని ఆపలేవు.దీనికి నిదర్శనంగా నిలిచారు ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్. బుధవారం నియోజకవర్గంలోని ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కాలికి గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ తన ఆరోగ్య సమస్యను పక్కనపెట్టి ప్రజల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమానికి హాజరై మరోసారి తన ప్రజాసేవా నిబద్ధతను చాటుకున్నారు.ఈ సందర్భంగా గురువారం వేములవాడ పట్టణంలో నిర్వహించిన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఒకరోజు ముందే కథలాపూర్ మండలం ఇప్పపల్లి వద్ద ఆయన కాలికి బలమైన గాయమైంది. దీంతో వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు.దాదాపు వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు చెప్పారు.గాయమైన నిన్నటి నుండి వేలాది మంది అభిమానులు ఆయనను చూడడానికి పెద్దఎత్తున తన నివాసంలో క్యూ కట్టారు.గాయం కారణంగా చేయూత కార్యక్రమం రద్దు చేద్దామని స్వయంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ తెలిపిన కూడా ప్రజల కోసం ఆ కార్యక్రమాన్ని రద్దు చేయలేదు. నిబద్ధతతో కార్యక్రమానికి హాజరై ప్రజలకు చేయూత మంజూరు పత్రాలు పంపిణీ చేసి దాదాపు 30 నిమిషాలకు పైగా నిలబడి ప్రసంగాన్ని కొనసాగించారు. కాలికి గాయమైన ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాల కార్యక్రమానికి దూరంగా ఉండకుండా లబ్ధిదారుల మధ్యకు వచ్చి ఆయన గొప్ప మనసును చూపించుకున్నారు. తన నొప్పి కంటే పేదల సంతోషమే ముఖ్యమని భావించారు.ఒకవైపు కాలికి గాయం,మరోవైపు వైద్య చికిత్స అవసరం...అయినా సరే తన కోసం ఎదురుచూస్తున్న పింఛన్ లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వు చూడాలనే తపన ఆయనను కార్యక్రమానికి తీసుకొచ్చింది.పింఛన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందిస్తూ వారి సమస్యలకు స్పందించాలి.



ఈ క్రమంలో తన ఆరోగ్య పరిస్థితిని సైతం లెక్కచేయకుండా ప్రజా కార్యక్రమానికి హాజరైన ఆది శ్రీనివాస్ తీరుపై పార్టీ శ్రేణులు,అభిమానులు,నియోజకవర్గ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.ప్రజాప్రతినిధిగా తనకు అప్పగించిన బాధ్యతను ఒక పదవిగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించే నాయకత్వ లక్షణం ఈ ఘటనలో కనిపిస్తోందని ప్రజలంతా అభిప్రాయపడుతున్నారు.

గాయం కాలికి తగిలింది..ప్రజాసేవకు వేసే అడుగులను ఆపలేకపోయింది..

నాయకుడంటే కేవలం ఎన్నికల సమయంలో ప్రజల మధ్య కనిపించేవాడు కాదు.ప్రజల అవసరాల సమయంలో సంక్షేమం పట్ల తనకున్న శ్రద్ధను చాటుకున్నారు. వృద్ధాప్యంలో ఆనరా కోనం ఎదురుచూసే వృద్ధుల,ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే నిరుపేదలు, దివ్యాంగులు,ఇతర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు.వారి జీవితాలకు ఒక భరోసా.అలాంటి భరోసాను అందించే కార్యక్రమంలో స్వయంగా పాల్గొనడం ద్వారా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రజల పట్ల తన బాధ్యతను మరోసారి గుర్తుచేశారు.

పదవి కోసం కాదు..ప్రజల కోసం పనిచేసే తత్వం..

రాజకీయాల్లో పదవులు రావచ్చు..పోవచ్చు కానీ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోవాలంటే ప్రజల కష్టాల్లో తోడుగా నిలవాలి.ప్రజల అవసరాలను గుర్తించి వాడే నిజమైన ప్రజానాయకుడు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన గాయాన్ని సైతం లెక్కచేయకుండా చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరుకావడం ఈ భావనకు అద్దం పడుతోంది.శారీరకంగా ఇబ్బంది ఉన్నప్పటికీ ప్రజల కోసం ముందడుగు వేసిన ఆయన అంకితభావం అభినందనీయం.ఎందుకంటే గాయాలు శరీరానికి మాత్రమే తగులుతాయి.ప్రజల పట్ల ఉన్న బాధ్యతకు,సేవ చేయాలనే సంకల్పానికి కాదు! ప్రజల సంక్షేమమే ప్రథమ కర్తవ్యం..ప్రజల మధ్యే తన ప్రయాణం అనే సందేశాన్ని మరోసారి చాటిన ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు రాష్ట్ర వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

మహిళా సాధికారతకు కుట్టు శిక్షణే ఆయుధం..

- కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థిక స్వావలంబన అని సింధు ఆదర్శ్ రెడ్డి పేర్కొన్నారు

- ఓల్డ్ ఎం.ఐ.జి. కాలనీలో శిక్షణ కార్యక్రమం నిర్వహణ..

- ఇంటి నుంచే ఉపాధి పొందాలని మహిళలకు పిలుపు..

- మహిళా సాధికారతకు కృషి చేస్తున్న నిర్వాహకులకు అభినందనలు..

పటాన్‌చెరు, నవంబర్ 12 (ప్రజా కలం) ప్రతినిధి

మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించి,సొంత కాళ్లపై నిలబడేందుకు కుట్టు శిక్షణ ఒక శక్తివంతమైన ఆయుధమని భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి స్పష్టం చేశారు.మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పటాన్‌చెరు నియోజకవర్గం, భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎం.ఐ.జి. కాలనీలో జనని మహిళా మండలి ఆధ్వర్యంలో, అక్షయ శక్తి ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,పేద మహిళలకు కుట్టు శిక్షణ అందించడం ద్వారా వారు సొంతంగా ఉపాధి పొందడమే కాకుండా,కుటుంబానికి ఆర్థికంగా పెద్ద అండగా నిలవగలుగుతారు అని అన్నారు.ఇంటి నుంచే సంపాదించే అవకాశం కల్పించే ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతాయని పేర్కొన్నారు.మహిళలు ఇలాంటి అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకొని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని ఆమె పిలుపునిచ్చారు.మహిళా శక్తి సమాజ అభివృద్ధికి వెన్నెముక అని,ఒక మహిళ ఆర్థికంగా బలపడితే ఆ కుటుంబమే కాదు, మొత్తం సమాజం బలపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. సేవాభావంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న జానని మహిళా మండలి, అక్షయ శక్తి ఫౌండేషన్ సభ్యులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అక్షయ శక్తి ఫౌండేషన్ సభ్యురాలు వాణి, వీరస్వామి,శివరాం రెడ్డి,జానని మహిళా మండలి సభ్యులు లక్ష్మి,స్వర్ణలత,మహిళా నాయకులు లత శ్రీ, జ్యోతి, సొసైటీ అధ్యక్షుడు బాలయ్య, ఉపాధ్యక్షుడు నారాయణ; బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భాస్కర్ ముదిరాజ్, చిన్న, సురేందర్, పద్మ తదితరులు పాల్గొన్నారు..

పరిశోధనలో అక్రమాలకు చెక్!

- పరిశోధనల్లో నైతికత, పారదర్శకతే ప్రామాణికం..

-నకిలీ ప్రచురణలు, పరిశోధనా అక్రమాలపై సౌమ్య నాయర్ హెచ్చరిక..



పటాన్‌చెరు,
నవంబర్ 12 (ప్రజా కలం) ప్రతినిధి

పరిశోధన రంగంలో నాణ్యతతో పాటు నైతిక విలువలు, పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా పాటించాలని అసోసియేట్ పరిశోధన సమగ్రత విశ్లేషకురాలు సౌమ్య నాయర్ స్పష్టం చేశారు.పరిశోధనల విశ్వసనీయతను పెంపొందించేందుకు బాధ్యతాయుతమైన ప్రచురణలు,నిష్పక్షపాత మూల్యాంకనం ఎంతో అవసరమని పేర్కొన్నారు. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం సహకారంతో స్ప్రింగర్ నేచర్ సంస్థ తన రైజ్–ఉత్తాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం గీతం విశ్వవిద్యాలయంలో పరిశోధన సమగ్రతపై అంతర్జాల ముఖాముఖి చర్చ నిర్వహించింది.ఈ కార్యక్రమంలో సౌమ్య నాయర్ ముఖ్య వక్తగా పాల్గొని పరిశోధన రంగంలో ఎదురవుతున్న అవకాశాలు, సవాళ్లను వివరించారు. పరిశోధనల్లో అక్రమాలు,నకిలీ పరిశోధనా పత్రాల తయారీ కేంద్రాలు,దోపిడీ ప్రచురణలు, సంస్థాగత సామర్థ్యాల్లో అసమానతలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.పరిశోధనల సంఖ్యకే కాకుండా వాటి నాణ్యత, సామాజిక ప్రయోజనం,నైతిక విలువలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.నైతిక పరిశోధనా పద్ధతులు, అందరికీ అందుబాటులో ఉండే పరిశోధనలు, బహిరంగ శాస్త్ర విజ్ఞానం, బాధ్యతాయుతమైన ప్రచురణలపై అవగాహన కల్పించారు.విద్యా నైపుణ్యానికి పరిశోధన సమగ్రత పునాదిగా నిలవాలని,సంస్థలు ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. గీతం విశ్వవిద్యాలయ కేంద్ర పరిపాలనా కార్యాలయం పరిశోధన,అభివృద్ధి సంచాలకులు ప్రొఫెసర్ రామగోపాల్ సమావేశాన్ని నిర్వహించారు. అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు చర్చలో చురుకుగా పాల్గొని పలు ప్రశ్నలు అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్నారు..





Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com



మీర్‌పేట్‌లో దారుణ హత్య కేసు ఛేదించిన మీర్పేట పోలీసులు


బంగారు ఆభరణాల కోసం మహిళ హత్య

నిందితుడు అరెస్ట్ చేసిన అమీర్పేట పోలీసులు

షేర్ మార్కెట్‌లో రూ. 4 కోట్ల నష్టం భరించలేకే ఘాతుకం

మహేశ్వరం, నవంబర్ 12, (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. బంగారు ఆభరణాల కోసం మహిళను హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి, దోచుకున్న బంగారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నవంబర్ 11, 2026న మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దాతు నగర్, శ్రీ లక్ష్మీ రెసిడెన్సీలో నివాసముంటున్న అనిత (34) గాయాలతో మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. ఆమె ఇంటి నుంచి బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో, ఆమె భర్త ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో ఇది డబ్బు కోసం చేసిన హత్యగా తేలింది. నిందితుడిని గడ్డ రాజ్ కుమార్ (41)గా గుర్తించారు. అతను షేర్ మార్కెట్ ఇన్వెస్టర్‌గా పని చేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా, బాలాపూర్ మండలం, దాతు నగర్, రోడ్ నంబర్ 9లోని శ్రీ లక్ష్మీ అపార్ట్‌మెంట్స్, బ్లాక్–ూ, ం5లో నివాసముంటున్నాడు. దర్యాప్తులో నిందితుడు షేర్ మార్కెట్ పెట్టుబడుల్లో దాదాపు రూ. 4 కోట్లు నష్టపోయినట్లు తేలింది. అలాగే పలువురి వద్ద అప్పులు చేసినట్లు, అతనిపై రెండు చెక్ బౌన్స్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు, అదే అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో నివాసముంటున్న బాధితురాలి బంగారు ఆభరణాలు దోచుకోవాలని నిందితుడు పథకం వేసినట్లు సమాచారం. నవంబర్ 11, 2026 మధ్యాహ్నం సుమారు 1 గంటకు నిందితుడు తన గుర్తింపు దాచుకునేందుకు హెల్మెట్ ధరించి బాధితురాలి మూడో అంతస్తులోని ఫ్లాట్‌కు వెళ్లాడని ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలు తలుపు తెరవగానే లోపలికి ప్రవేశించి, ఆమెను కిందకు నెట్టి, మెడలోని బంగారు మంగళసూత్రం, చేతులకు ఉన్న బంగారు గాజులు తీసుకున్నాడు. అనంతరం ఇనుప బాక్స్‌తో బాధితురాలిపై దాడి చేయడంతో ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, దోచుకున్న బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



శుద్ధి చేసిన మురుగునీటిని పునర్వినియోగంలోకి తీసుకురావాలి

నిర్మాణ, పారిశుద్ధ్య అవసరాలకు ఎస్టీపీ జలాల వినియోగం..

ఎస్‌హెచ్‌జీ మహిళల్లో అవగాహనకు ప్రత్యేక కార్యాచరణ

మల్కాజిగిరి, నవంబరు 12 (ప్రజా కలం ప్రతినిధి): నీటి వనరుల సంరక్షణలో భాగంగా శుద్ధి చేసిన మురుగునీటిని సమర్థవంతంగా పునర్వినియోగించుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. నిర్మాణ పనులు, రోడ్లు, ఇతర ప్రజా ప్రదేశాల శుభ్రత వంటి పారిశుద్ధ్య అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నుంచి లభించే శుద్ధి జలాలను వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం తార్నాకలోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) అధికారులతో కమిషనర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శుద్ధి చేసిన నీటి నాణ్యత, నిర్దేశిత ప్రమాణాలు, అందుబాటులో ఉన్న నీటి వనరుల వినియోగంపై సమీక్షించారు. అలాగే స్వయం సహాయక సంఘాల మహిళలకు శుద్ధి చేసిన నీటి ప్రాముఖ్యత, పునర్వినియోగం, నీటి సంరక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. మహిళల భాగస్వామ్యంతో ప్రజల్లో నీటి వృథాను అరికట్టడం, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం తీసుకురావడానికి కార్యాచరణ రూపొందించాలని చర్చించారు. ఎస్టీపీల నుంచి సేకరించిన శుద్ధి జలాల నమూనాలకు ఎన్ఏబీఎల్ గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో నిర్వహించిన పరీక్షల నివేదికలను సమావేశంలో పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న శుద్ధి జలాలను వివిధ అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ డైరెక్టర్ పంకజ, అదనపు కమిషనర్ (ఆరోగ్యం, పారిశుద్ధ్యం) సి.ఎన్. రఘు ప్రసాద్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు, సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.
నీటి వనరుల సంరక్షణ, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మున్సిపల్ కార్పొరేషన్, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.

ఏపీకి రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులు..

24 లక్షల ఉద్యోగాలే లక్ష్యం: ఎంపీ విజయ్

అమరావతి : విశాఖపట్నంలో రేపటి నుంచి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సీఐఐ సమ్మిట్ ప్రారంభంకానుందని ఎంపీ చింతకాయల విజయ్ తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ.. వైజాగ్ సీఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామన్నారు. దేశం మొత్తం మళ్లీ ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోందని.. దీనికంతటికీ కారణం 'బ్రాండ్ సీబీఎన్' అని చెప్పుకొచ్చారు. యువతకు భరోసానిస్తూ నిజమైన 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్'గా మంత్రి నారా లోకేశ్ నిలిచారన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతిందని ఎంపీ విమర్శించారు. రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ గతంలో జగన్ ప్రభుత్వం అంతా పచ్చి అబద్ధాలే చెప్పిందని మండిపడ్డారు. యువతను మోసం చేస్తూ యూట్యూబ్ ఛానళ్లు, అప్పడాలు, బొబ్బట్లు తయారీ కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్నారంటూ ఎద్దేవా చేశారు. అప్పట్లో పరిశ్రమలను వెళ్లగొడితే... కూటమి పాలనలో పెట్టుబడులకు ఏపీ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. దేశంలోనే రికార్డు స్థాయిలో 25.3 శాతం పెట్టుబడులను ఆకర్షించి ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా నిలిచిందని విజయ్ తెలిపారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా పారిశ్రామిక విప్లవాన్ని తీసుకొచ్చామన్నారు. సింగిల్ డెస్క్ విధానం, పారదర్శక పాలనతో పారిశ్రామికవేత్తలకు పూర్తి భరోసాను మంత్రి లోకేశ్ కల్పిస్తున్నారని అన్నారు. ఇప్పటికే రూ.11 లక్షల కోట్ల ప్రాజెక్టులు గ్రౌండింగ్ దశలో ఉన్నాయని... దాదాపు 15 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని స్పష్టం చేశారు. మొత్తం రూ. 26 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పరుగులు పెడుతోందన్నారు. ఏపీలో 8.51 శాతం జీఎస్‌డీపీ నమోదు అయ్యిందని.. దేశంలోనే రెండో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఏపీ నిలిచిందని ఎంపీ అన్నారు. ఉత్తరాంధ్రకు గూగుల్ ఏఐ హబ్, భోగాపురం ఎయిర్‌పోర్ట్... రాయలసీమలో ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ హబ్‌లు వచ్చాయన్నారు. అమరావతి నిర్మాణం పరుగులు పెడుతోందని, పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ కంపెనీలు ఏపీకి క్యూ కడుతున్నాయని ఎంపీ చింతకాయల విజయ్ పేర్కొన్నారు

భార్యను హత్య చేసి దుస్తులు తొలగించిన భర్త..

హత్యాచారంగా నమ్మించేందుకు యత్నం

చండీగఢ్: ఒక వ్యక్తి తన భార్యను అనుమానించాడు. ఈ నేపథ్యంలో గొంతు నొక్కి ఆమెను హత్య చేశాడు. ఆ తర్వాత భార్య దుస్తులు తొలగించి మృతదేహాన్ని ఒకచోట పడేశాడు. ఆమెపై హత్యాచారం జరిగినట్లు నమ్మించేందుకు ప్రయత్నించాడు. దర్యాప్తు చేసిన పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన జహదూర్ ఇస్లాం తన భార్య రుబీనా ఖాతున్‌తో కలిసి పంజాబ్‌కు వలసవచ్చాడు. ముకేరియన్‌లోని మదీన్‌పూర్ గ్రామంలో వారు నివసిస్తున్నారు. మురుగునీటి కాలువలు, డ్రైనేజీలను శుభ్రపరిచే పనులు చేస్తూ జీవిస్తున్నారు. కాగా, భార్య రుబీనా ఖాతున్‌కు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నట్లు భర్త జహదూర్ అనుమానించాడు. దీంతో కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల పని ముగిసిన తర్వాత గ్రామం సమీపంలోని చెరువు వద్దకు భార్య రుబీనాను భర్త తీసుకెళ్లాడు. గుడ్డ తువ్వాలుతో ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. ఆ తర్వాత రుబీనా శరీరంపై ఉన్న దుస్తులను తొలగించాడు. సమీపంలోని చెరకు తోటలో ఆమె నగ్న మృతదేహాన్ని పడేశాడు. రుబీనాపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించాడు. మరోవైపు భార్య హత్య తర్వాత బీహార్‌లోని కతిహార్ జిల్లాకు చెందిన బావ సోహెల్ అలీకి, జహదూర్ ఫోన్ చేశాడు. తన భార్య రుబీనా కనిపించడం లేదని చెప్పాడు. దీంతో ఆందోళన చెందిన రుబీనా సోదరుడు హుటాహుటిన పంజాబ్‌లోని మదీన్‌పూర్ గ్రామానికి చేరుకున్నాడు. వారిద్దరూ రుబీనా కోసం వెతకడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్‌లో మత్తు టాబ్లెట్ల దందా..

300 నైట్రో-విట్ టాబ్లెట్లు స్వాధీనం

హైదరాబాద్ : మల్లేపల్లిలో ఈగల్ టీమ్, హెచ్-న్యూ సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు చేసాయి. నిందితులు ఉప్పాడ ప్రసాద్, సమీరా బేగం నుంచి 300 నైట్రో-విట్ టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఆపరేషన్‌లో పల్లవి, సూర్యధరన్ అనే ఇద్దరి అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటకలోని బీదర్ నుంచి టాబ్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. స్థానిక యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు టాబ్లెట్ల విక్రయాలు జరుగుతున్నాయిని గుర్తించారు. గంజాయి విక్రయాలు తగ్గడంతో ప్రత్యామ్నాయంగా మత్తు టాబ్లెట్ల దందా చేస్తున్నట్లు పోలీసుల అనుమానం. అక్రమ సరఫరా, విక్రయాలపై మరిన్ని దాడులు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

నీరు వృథా చేసినందుకు అక్షయకల్ప సంస్థకు జరిమానా

హైదరాబాద్ : హైదరాబాద్‌లో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జలమండలి (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లో తాగునీటిని ఫ్లోర్ శుభ్రం చేయడానికి వినియోగించినందుకు గాను ప్రముఖ సంస్థ అక్షయకల్ప ఫార్మ్స్ అండ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.20,000 జరిమానా విధించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం.70లోని జర్నలిస్ట్ కాలనీలో ఉన్న అక్షయకల్ప ప్రాంగణంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటిని నేల శుభ్రపరచడానికి వాడుతున్నట్లు గుర్తించి, వెంటనే జరిమానా విధించారు. అంతేకాకుండా నిబంధనల ప్రకారం ఆ సంస్థ మురుగునీటి కనెక్షన్‌ను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి వృథాను అరికట్టేందుకు జలమండలి తనిఖీలను ముమ్మరం చేసింది. తాగునీటిని కేవలం తాగడానికి, వంట అవసరాలకు మాత్రమే వినియోగించాలని నగరవాసులకు, వాణిజ్య సంస్థలకు స్పష్టం చేసింది. ఫ్లోర్ క్లీనింగ్, వాహనాలు కడగడం, తోటపని, నిర్మాణ పనులకు మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నుంచి సరఫరా అయ్యే ట్రీటెడ్ వాటర్‌ను వాడుకోవాలని సూచించింది. నగరవ్యాప్తంగాఈ తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఎక్కడైనా తాగునీటి వృథా జరుగుతుంటే, దానికి సంబంధించిన ఫొటోలు లేదా వీడియోలతో 99499 30003 అనే వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

ప్రణబ్ ప్రధాని ఆశలు...సోనియా నెరవేర్చలేక పోయారా?

ప్రణబ్ ముఖర్జీ ఈ దేశానికి ప్రథమ పౌరుడిగా అయిదేళ్ల పాటు పనిచేసిన మాజీ రాష్ట్రపతి. ఆయన పదవీ కాలం 2012 నుంచి 2017 దాకా సాగింది. ఆయన ఆర్థిక నిపుణుడు. అపర మేధావి, అలాగే నాయకత్వ లక్షణాలు విశేషంగా ఉన్న వారు, కాంగ్రెస్ లో దశాబ్దాల పాటు పనిచేసిన వారు. ఎన్నో కీలక మంత్రిత్వ శాఖలతో పాటు ఆర్థిక శాఖను సమర్థంగా నిర్వహించిన నేత. అలాంటి ప్రణబ్ ముఖర్జీ ప్రధాని ఎందుకు కాలేకపోయారు అన్నది ఒక చర్చగా నాటికీ నేటికీ ఉంది. 2020లో ప్రణబ్ ముఖర్జీ మరణించారు. ఇక ప్రణబ్ ముఖర్జీని మోడీ ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న తో సత్కరించింది.

అవకాశాలు చేజారాయి : ప్రణబ్ ముఖర్జీ ప్రధానిగా ఈ దేశానికి అవాల్సిన సందర్భాలు ఎన్నో వచ్చాయి. అయితే ఆయనకు అదృష్టం కలసి రాలేదని అంటారు. ప్రణబ్ ముఖర్జీ ఇందిరాగాంధీకి ఇష్టమైన నాయకుడుగా ఉన్నారు. ఇందిరాగాంధీ మంత్రివర్గంలో ఆయన ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ప్రభుత్వంలో ఆయన రెండవ అత్యంత కీలకమైన నాయకుడిగా ఎదిగారు. 1969లో ఇందిరాగాంధీ ప్రోత్సాహంతో ప్రణబ్ ముఖర్జీ రాజ్యసభకు ఎన్నికై జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆమె నమ్మకాన్ని చూరగొన్న ప్రణబ్ 1973లో కేంద్ర మంత్రివర్గంలో చేరారు. ఇలా చూస్తే ఆయన రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు దక్కినా ప్రధాని మాత్రం దరి చేరలేదు అని అంటారు.

పీవీకి పోటీగా : ఇక పీవీ నరసింహారావు 1991లో ప్రధాని అయ్యారు. ఆ సమయంలో ప్రణబ్ ముఖరీ పేరు కూడా వినిపించింది. 1991 మే 21న జరిగిన రాజీవ్ గాంధీ హత్య తర్వాత కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ సంక్షోభం ఏర్పడింది. అప్పటికే కాంగ్రెస్ దిగ్గజ నేతలుగా ఉన్న శరద్ పవార్, అర్జున్ సింగ్, ఎన్.డి తివారీ వంటి సీనియర్ల పేర్లతో పాటు ప్రణబ్ ముఖర్జీ పేరు కూడా అప్పట్లో ప్రధాని పదవి కోసం చర్చకు వచ్చింది. అలా అంతర్గత అధికార పోరులో ప్రణబ్ ముఖర్జీ చివరికి తగ్గి పీవీ నరసింహారావుకు అండగా నిలిచారు. పీవీ మంత్రివర్గంలో తనకే మళ్లీ ఆర్థిక శాఖ దక్కుతుందని ప్రణబ్ ముఖర్జీ బలంగా ఆశించారు. మన్మోహన్ సింగ్‌ను పీవీ ఆర్థిక మంత్రిగా నియమించారు. అయితే పీవీ 1995లో ఆయనకు విదేశాంగ శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు అప్పగించారు. అలా ప్రధానిగా ప్రణబ్ కి ఒక చాన్స్ పోయింది అని అంటారు.

యూపీఏ హయాంలో : ఇక 2004 అలాగే 2009 ఎన్నికలల్లో గెలిచి రెండు సార్లు యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడింది. ఆ సమయంలో కూడా ప్రణబ్ ముఖర్జీ అనుభవం దృష్ట్యా ఆయన ప్రధాని అవుతారనే చర్చ రాజకీయ వర్గాల్లో నడిచింది. కానీ అలా జరగలేదు, మన్మోహన్ సింగ్ ప్రధానిగా రెండు టెర్ముల్లూ ఉన్నారు. ఆయన సోనియాగాంధీ ఎంపిక అన్నది తెలిసిందే. ఇక ఇటీవల విడుదలైన సోనియా గాంధీ ఆత్మకథ "బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్" లో కూడా 2010లో ప్రణబ్ ముఖర్జీకి



ప్రధాని కావాలనే ఆకాంక్ష ఉండేదని పేర్కొన్నారు. దాంతోనే దీని మీద మరోసారి చర్చ సాగుతోంది. తన తండ్రికి ఉన్న అపారమైన అనుభవం వల్ల ప్రధాని పదవి కోరితే తప్పేముందని ప్రణబ్ ముఖర్జీ తనయ శర్మిష్టా ముఖర్జీ సోనియాగాంధీ ఆత్మ కథలో ప్రణబ్ మీద చేసిన వ్యాఖ్యలకు బదులిచ్చారు. తన తండ్రి ప్రధాని కాదగిన వారు అని ఆమె అన్నారు. మరి సోనియా గాంధీ పుస్తకంలో ప్రణబ్ మీద చేసిన వ్యాఖ్యలు చూస్తే ఆయన ఆలోచనలు తెలిసి కూడా సోనియాగాంధీ అంతటి అనుభవం కలిగిన నేతకు ప్రధాని పదవికి ఎందుకు ఎంపిక చేయలేకపోయారు అన్నది ప్రశ్న. అయితే ఎంతో అనుభవం కలిగి స్వతంత్రంగా ప్రణబ్ వ్యవహరిస్తారు అన్న కారణంతోనే ఆమె ఆయనను పక్కన పెట్టారా అన్నది కూడా చర్చగా ఉందని అంటారు.

ప్రధాని పదవి వదులుకోవడానికి అదే కారణం

హైదరాబాద్ : కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ మంగళవారం విడుదలైంది. కుటుంబంలో చోటుచేసుకున్న సంఘటనల నుంచి రాజకీయాల్లో ఆమె పోషించిన పాత్రల వరకు అనేక ఆసక్తికర అంశాలను ఈ పుస్తకంలో సోనియా ప్రస్తావించారు. ముఖ్యంగా 2004 సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రధాని పదవిని తృణప్రాయంగా వదులుకోవడానికి గల అసలు కారణాలను ఆమె తన మాటల్లోనే స్పష్టం చేశారు. 2004 ఎన్నికలకు చాలా నెలల ముందే ప్రధాని పదవి చేపట్టకూడదని నిర్ణయించుకున్నట్లు సోనియా గాంధీ వెల్లడించారు. నానమ్మ, నాన్నల హత్యలను చూసిన రాహుల్, ప్రియాంకలు.. ఆ పదవి తమ కుటుంబానికి ప్రమాదకరమని భావించి తాను ప్రధాని కావడాన్ని కోరలేదని తెలిపారు. అయితే ఎన్నికల సమయంలో పార్టీలో నాయకత్వ సమస్యలు రాకూడదనే ఉద్దేశంతో ఈ విషయాన్ని ముందుగా బయటపెట్టలేదన్నారు. యూపీఏ కూటమి గెలిచి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్న సమయంలో తనలో అంతర్మథనం జరిగిందని ఆమె గుర్తుచేసుకున్నారు. కూటమి నేతలు తనను ప్రధానిగా బలవంతం చేసినప్పుడు.. గది బయట ఉన్న ప్రియాంక తన నిర్ణయం విని కంటతడి పెట్టుకున్నట్లు, ఆ రాత్రి రాజీవ్ గాంధీ తన పక్కన ఉంటే బాగుండేదని తలచుకున్నట్లు భావోద్వేగంతో పంచుకున్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలు తన నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, ధైర్యం కూడగట్టుకుని ప్రధాని అభ్యర్థిగా మన్మోహన్ సింగ్ పేరును ప్రతిపాదించినట్లు సోనియా తెలిపారు. ప్రభుత్వ పదవుల్లో సుదీర్ఘ అనుభవం ఉండటం, పార్టీలో ఏ వర్గానికి చెందకుండా తటస్థంగా ఉండటం, కమ్యూనిస్టుల మద్దతు లభించడం వంటి కారణాల వల్లే మన్మోహన్ చేతుల్లో దేశం భద్రంగా ఉంటుందని నమ్మి ఆయనను ఎంపిక చేసినట్లు సోనియా గాంధీ తన ఆత్మకథలో వివరించారు.

కార్యక్రమాలకు చిన్నారెడ్డి దూరం

వరంగల్ : తెలంగాణ కాంగ్రెస్‌లో మరో సీనియర్ నేత వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు డాక్టర్ జీ. చిన్నారెడ్డి ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీలో కీలక పదవులు నిర్వహించిన ఆయన.. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల తర్వాత మౌనం పాటిస్తుండటంతో అసలు ఏం జరుగుతోందనే చర్చ మొదలైంది. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తరహాలో చిన్నారెడ్డి కూడా పార్టీకి దూరమయ్యే ఆలోచనలో ఉన్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. డాక్టర్ జీ. చిన్నారెడ్డికి కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉంది. 1985 నుంచి ఎన్నికల రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయనకు పార్టీ పలుమార్లు అవకాశాలు కల్పించింది. మొత్తం ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం ఇచ్చింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రిగా కూడా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగానూ పనిచేశారు. పార్టీ అధిష్ఠానానికి సన్నిహితుడిగా గుర్తింపు పొందిన చిన్నారెడ్డి.. ఇటీవల వనపర్తి రాజకీయ పరిణామాల నేపథ్యంలో వార్తల్లో నిలిచారు. ప్రస్తుత ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పార్టీ వ్యవహారాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అనంతరం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి ప్రభుత్వం తొలగించింది. దీంతో చిన్నారెడ్డి రాజకీయ ప్రస్థానంలో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించిన తర్వాత చిన్నారెడ్డి రాజకీయంగా మౌనం పాటిస్తున్నారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. హైదరాబాద్‌లోనూ, ఢిల్లీలోనూ పార్టీ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో ఆయన కనిపించడం లేదని నేతలు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఇప్పుడు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పార్టీతో విభేదాల నేపథ్యంలో తీసుకున్న రాజకీయ నిర్ణయాలు కూడా చర్చకు వస్తున్నాయి. చిన్నారెడ్డి కూడా అదే దారిలో పయనిస్తారా? పార్టీపై అసంతృప్తితోనే మౌనం వహిస్తున్నారా? లేక ప్రస్తుత పరిణామాలు సద్దుమణిగే వరకు వేచి చూస్తున్నారా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చిన్నారెడ్డి భవిష్యత్ కార్యాచరణపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. పార్టీ నాయకత్వంతో మళ్లీ సఖ్యత కుదుర్చుకుంటారా? తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారా? లేక తన రాజకీయ భవిష్యత్తుపై మరో నిర్ణయం తీసుకుంటారా? అన్నది చూడాలి. ప్రస్తుతానికి ఆయన మౌనం వెనుక ఉన్న కారణాలపై స్పష్టత లేదు. రానున్న రోజుల్లో చిన్నారెడ్డి వేసే రాజకీయ అడుగులే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పనున్నాయి.

కరీంనగర్‌కు నితిన్ నబీన్..

- లక్ష మందితో బీజేపీ మహా పాదయాత్ర

హైదరాబాద్: తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ దూకుడు పెంచుతోంది. ఇందులో భాగంగా జాతీయ నాయకుల రాష్ట్ర పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈ నెల 18న ఆయన నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో లక్ష మందితో భారీ పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'సర్' అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడుప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు వివరించడమే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. నితిన్ నబీన్ తొలిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించాలని బండి సంజయ్ నిర్ణయించారు. గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు పాదయాత్ర సాగనుంది. ఇందులో నితిన్ నబీన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బండి సంజయ్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి లక్ష మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా మహా పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు బండి సంజయ్ కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో సమావేశమయ్యారు. బూత్ స్థాయి నుంచి మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను సమీకరించాలని సూచించారు.

సాయుధ దళాలను గౌరవించండి.... ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ పర్యటనలో ప్రధానమంత్రి మోదీ చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ సాయుధ దళాలు, పారామిలిటరీ బలగాలు, సైన్యాన్ని గౌరవించడంలో కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ వరుసగా విఫలమవుతూనే ఉన్నారని ఆయన విమర్శించారు.